# అయిదో అశ్వికుడు

(THE FIFTH HORSEMAN)

## కోవిడ్-19
వైఫల్యాలు-పాఠాలు



## COVID-19
Failures & Lessons


Dr. Lanka Siva Rama Prasad

డాక్టర్ లంకా శివరామప్రసాద్

# కోవిడ్-19 (వైఫల్యాలు - పాఠాలు)

## COVID-19 (Failures & Lessons)



# అయిదో అశ్వికుడు

## (The Fifth Horseman)


డాక్టర్ లంకా శివరామప్రసాద్

**Dr. Lanka Siva Rama Prasad**

# అయిదో అశ్వికుడు

## కోవిడ్-19 (వైఫల్యాలు-పాఠాలు)

## THE FIFTH HORSEMAN

**COVID - 19 (FAILURES & LESSONS)**

✧✧✧———✧✧✧

by

**Dr. Lanka Siva Rama Prasad**

October 2020

All rights reserved

Copyright @ 2020

**Dr. Lanka Siva Rama Prasad**

For Copies:

**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002,
Telangana, INDIA
Mobile : 8897849442, 6305677926
Email: lankasrprasad@gmail.com
**www.anuvaadham.com**

Price : ₹ **300** **$ 5**

Cover Design & Post Script :

**Prakash Pula**

Printed at :

**Vasavi Printers**

J.P.N. Road, Warangal. Ph : 0870-2426364

# ప్రస్తావన

కలల రహదారి వంతెనపై నిలబడి నేను దిగువకు పోతున్న జల ప్రవాహాన్ని చూస్తున్నాను. అరవై అయిదేళ్ల దూరంగా నేను కెవ్వుమని పెట్టిన తొలికేక అక్కడి కాలరేఖలో నిక్షిప్తమై ఉన్నది. పది నెలల తరువాత మొదలైన నా బుడిబుడి నడకలు తల్లిదండ్రుల వదనాలలో చానాళ్లు ప్రతిఫలించాయి, నేను తప్పటడుగుల నుంచి తప్పుటడుగులు వేసే వరకూ, ఆ నీటి అలలపై నా విజయాల మెరుపులూ, వైఫల్యాల సుడిగుండాలూ దృశ్యాదృశ్య చిత్రాల్లా కానవస్తున్నాయి. ప్రేమలూ–ద్వేషాలూ, అవమానాలూ–అనుమానాలూ, నన్ను తడిపినప్పుడల్లా నాలో మొలకెత్తిన కొత్త ఆశ–ధైర్యాలతో నేను వెనుకంజ వేయలేదు. నేను చేతబట్టిన కత్తి రెండువేపులా పదునైనది. దేహంలోని, సమాజ దేహంలోని దుష్టాంగంబు ఖండించి శిష్టాంగ రక్షణ చేసే విధంగా నన్ను నేను మలచుకున్నాను. ఆ ప్రయాణంలో ఎక్కడో నన్ను నేను కోల్పోయాను. ఎప్పుడు సందడిగా ఉండే నేను చిరునవ్వును పోగొట్టుకున్న నా ముఖాన్ని ద్వేషించడం మొదలెట్టాను.

అద్దాలెన్ని మార్చినా అంతః సంఘర్షణల వల్ల ముడతలు బడిన ముఖంలో వెలుగు, జీవశక్తి మసకబారినట్లు కనిపించి నేను అంతర్ముఖుడనైనాను.

నా ఆలోచనలన్నీ మృత్యువు చుట్టూరా కేంద్రీకరించబడినాయి. నచికేతుడిలా, మార్కండేయుడిలా, ఆర్ఫియస్‌లా, వర్జిల్–డాంటే ద్వయంలా నేను మృత్యువుతో సమావేశం కావాలని కోరుకుని ప్రతీకాత్మకంగా నా ఆలోచనల పుటలపై మృత్యు సూత్రానికి అక్షర ముత్యాలను పొదిగినాను. నాకంటూ ఓ ప్రత్యేక లిపిని రూపొందించుకుని స్వప్నాల దారిని కాంతివంతం చేసుకో గలిగినాను.

ఆల్ప్సు పర్వత శిఖరాల దగ్గర మంచుతునకలు ఒక్కొక్కటీ రాలి పడుతున్నపుడు నా కవిత్వ పాదాల్ని శుభ్రించి, ఇంటర్‌లాకెన్ సరస్సులో జీవన ప్రతిబింబాల్ని గమనించి, జంగ్‌ఫ్రా (Jungfrau) కొండపై మంచుశిఖరంపైకి నిట్టనిలువుగా వెళ్లే కాగ్‌వీల్ – ఫ్యునిక్యులార్ ట్రెయిన్‌లో వెళ్తున్నపుడూ దూరంగా

బూడిదరంగు అశ్వంపై ఉన్న అశ్వికుడు నావంకే చూస్తున్నట్లు అనిపించేది. అతడిని రక్షక దేవదూత (Guardian Angel) గా భావించేవాడిని. రోమన్ కొలిజియమ్ (Colloseum) వద్ద గ్లాడియేటర్స్‌ను పర్యవేక్షిస్తూన్నట్లు, పీసా టవర్ వద్ద, వాటికన్ మ్యూజియంలో, ఈఫిల్ టవర్ దగ్గర, లండన్ బ్రిడ్జి వద్ద, ప్రాచీన ప్రభువుల ఖడ్గాలు, గిలెటిన్‌ల వద్ద ఉరికొయ్యల వద్ద అతడు ఓ మెరుపులా మెరిసి అదృశ్యమయ్యేవాడు.

ఈజిప్టులోని పిరమిడ్ల వద్ద, టుటన్‌ఖామున్ మాస్క్ పక్కన, థెబెస్ నగర శిథిలాలలో, నైలునది నీలినీడలలో అతడి నీడ ప్రస్ఫుటించేది. చైనా టెర్రకొట్టా వీరుల మధ్య, సియాన్–మింగ్ రాజుల, రాణుల విహార స్థలాలలో, చైనా వాల్ పునాదులలో అతడి హస్తముద్రలు కనిపించేవి.

టర్కీ–కప్పడొకియా, పాముక్కలే, ఎఫిషస్, కోన్యా దారులలో, భూగర్భ నగరాలలో, గ్రీకుల ఏథెన్సు, శాంటొరిని ద్వీపాలలో, ఇటలీ–టరాంటో జ్ఞాపకాలలో, పోలండ్–వార్సా–కాన్‌సెంట్రేషన్ క్యాంపుల స్మృతులను దాచుకున్న భవనాలలో, నార్డిక్ దేశాలైన–నార్వే, ఫిన్‌లాండ్, స్వీడన్, డెన్మార్క్ ప్రాక్కథలలో అతడి శీతల వదనాన్ని చూస్తూ కొంచెం భయపడేవాడిని కూడా!

మానస సరోవరపు నీటిలో మునిగి స్నానం చేసినపుడు, కైలాస పర్వతపు నీడల్ని చూస్తూ యమద్వారం దాటినపుడూ, అంటార్కిటికా ప్రయాణంలో పెంగ్విన్ల నడకలో, ఆస్ట్రేలియా ఆదిమ ప్రజల సంగీతంలో, సింగపూరు సీతాకోక చిలుకలలో, బాలి ద్వీపపు సోయగాలలో, శ్రీలంక తేయాకు తోటల సౌందర్యంలో, స్పెయిన్ పోర్చుగల్ వీధుల సందడిలో, అర్జెంటినా టాంగో నృత్యకేళిలోనూ నేనతడి అడుగుజాడల్ని గమనించాను.

అతిశీతల అంటార్కిటికా ఖండం నుంచి డ్రేక్ ఫాసేజి అలల ఉధృతిని దాటి, మరల నా దేశపు నేలపై అడుగిడినప్పుడు దూరంగా అతడే. ఎవరైనా ఇంత ముభావంగా ఎలా ఉండగలరో ఇప్పటికీ నాకర్థం కాదు.

జనవరి నుంచి కరోనా శీతల విషవాయువుల మధ్య అతడి నడకను గమనిస్తూనే ఉన్నాను. అతడి వెనక ఎందరివో కలల రహదారులు, వంతెనలూ కూలిపోతున్నా అతడలా వస్తూ పోతూనే ఉన్నాడు. అతడి చూపు నుంచి

తప్పించుకోవడానికి చాలామంది శీతల గుహల్లో, ఫాంహౌసుల్లో తలదాచుకుంటున్నారు.

మహమ్మారి, యుద్ధం, కరువు, మృత్యువు అనే నలుగురు అశ్వికులను చూసాను నేను. ఈ నాలుగో అశ్వికుడు నాకు పరిచితమైనవాడే. అతడిని తప్పించుకుని పోవాలని భయమనే గుఱ్ఱంపై స్వారీ చేస్తూ వేగంగా వెళ్లిపోతున్నాను, అయిదవ అశ్వికుడిగా కలల రహదారిపై!

ఆ Fifth Horseman నేనే!

మామూలు మానవుడిని!....

**– డాక్టర్ లంకా శివరామప్రసాద్**



***Success is not Final,***
***Failure is not fatal***
***It is the Courage***
***To continue that counts***

- Winston Churchil

✤✤✤✤

**Failure should be our teacher, not our undertaker.**

**Failure is delay, not defeat.**

**It is temporary detour, not a dead end.**

**Failure is something we can avoid only by saying nothing, doing nothing and being nothing.**

- Denis Waitley

✤✤✤✤

**The fault, dear Brutus, is not in our stars,**
**But in ourselves, that we are underlings.**

- Shakespeare (Julius Caesar I, II)

**విజయమే అంతిమం కాదు,**
**వైఫల్యం మరణం కారాదు.**
**ధైర్యంతో ముందడుగు వేయడం**
**అదే కావాలి జీవన లక్ష్యం!**

– విన్‌స్టన్ చర్చిల్

❖❖❖❖

**వైఫల్యం మన గురువు కావాలి, కాటికాపరి కారాదు!**
**వైఫల్యం కొద్దిపాటి ఆలస్యం అంతే, పరాజయం కాదు!**
**వైఫల్యం తాత్కాలికమైన పక్కతోవ, ఆఖరి మజిలీ కాదు!**
**వైఫల్యం వచ్చినపుడు దానిని తప్పించుకునే మార్గమల్లా ఏమీ అనకుండా, ఏమీ చేయకుండా, ఏమీ కాకుండా ఉండగలగడం!**

– డెనిస్ వెయిట్‌లీ

❖❖❖❖

**బ్రూటస్, నక్షత్రాలలో లేదు దోషం!**
**లోపమల్లా మనల్ని మనం బానిసలుగా భావించడం!**

– షేక్స్పియర్ (**జూలియస్ సీజర్-I,II**)

## అసమానతలను రూపుమాపే నలుగురు అశ్వికులు
### THE FOUR HORSEMEN

1) **PANDEMICS - మహమ్మారులు**
2) **WARS - యుద్ధాలు**
3) **REVOLUTIONS - విప్లవాలు**
4) **STATE FAILURES - ప్రభుత్వ వైఫల్యాలు**

**- Walter Scheidel**
(వాల్టర్ స్కిడెల్)

✣✣✣✣

***"Any one for whom Seven acres are not enough is a dangerous citizen"***
**- Pliny the Elder**

ఏడెకరాలు సరిపోదనేవాడు ప్రమాదకరమైన పౌరుడు!
– ప్లిని ద ఎల్డర్

✣✣✣✣

***"If you want a vision of the future, Imagine a boot stamping on a human face - forever***
**- George Orwell**

నీవు భవిష్యత్తును చూడదలుచుకున్నావా,
ఊహించు మానవ ముఖాన్ని ఎప్పటికీ తొక్కిపెడ్తున్న బూటుకాలును!
– జార్జి ఆర్వెల్

# అయిదో అశ్వికుడు

## విషయ సూచిక


1. ఒక మహమ్మారి .......................................................... 10
2. ఇది కూడా వెళ్లిపోతుందా వెనకటిలానే? ............................... 16
3. తొలిసారిగా ప్రత్యక్షం ........................................................ 22
4. గబ్బిలాల యువతి ......................................................... 29
5. అనుమానం పెనుభూతం .................................................. 35
6. మందో రాజా భవిష్యతి! .................................................... 41
7. ఆ ఒక్కటీ అడక్కు........................................................... 48
8. అదృశ్య హస్తం – అక్షయపాత్ర ............................................. 55
9. ఎవరి కోసం మోగుతున్నాయీ మృత్యుఘంటికలు? ................... 62
10. ప్రతి సాధువూ, అతడి ప్రత్యేక దీపమూ! ................................ 69
11. ఎవరి బాకా వారే ఊదుట... ............................................. 76
12. మృత్యు నృత్యం ........................................................... 83
13. నలుగురు అశ్వికులు ..................................................... 90
14. కలల రహదారి ............................................................... 99
వర్తమానం లేని వర్తమానం ................................................. 109

# 1. ఒక మహమ్మారి (Pandemic)

"విషం పుట్టింది. విశ్వవ్యాప్తమయ్యింది. ఎంత వెదికినా విరుగుడు దొరకడం లేదు. దొరికాయనుకున్నవన్నీ మంచిగా పనిచేసాయన్న దాఖలాలు లేవు. అత్యంత కఠినతరమైన లాక్‌డౌన్లు, దుర్భరమైన క్వారంటైయిన్లూ, ఐసొలేషన్లూ గొప్పగా పనిచేసాయనుకునే లోపునే అది నిజం కాదని తెలిసి నిరుత్సాహం. మాస్కులు, శానిటైయిజర్లూ, పి.పి.యి. కిట్లూ, క్లోరొక్విన్, డాక్సిసైక్లిన్, అజిత్రొమైసిన్, ఐవర్‌మెక్టిన్, స్టెరాయిడ్లు, ఫాబిఫ్లూ, రెమిడెసివిర్, మోనోక్లోనల్ ఏంటిబాడీస్, ప్లాస్మాథెరపీలు, వాక్సీన్‌లు, వెంటిలేటర్లు, ఎక్మోలు వస్తున్నాయి, పోతున్నాయి. ఏది సవ్యంగా పని చేస్తుందో ఎవరికీ తెలీదు. రోజుకో ప్రకటన. ఇవ్వాళ చెప్పింది రేపు ఖండిస్తున్నారు.

**ఆలోల జలధి లోపల**
**నాలో నహి విడిచి సురలు నసురలు బరవం**
**గీలా కోలాహలమై**
**హాలాహల విషము పుట్టె నవనీనాథా!**

పోతన భాగవతం 8-275

ఇదంతా పాలసముద్రాన్ని మధిస్తున్నపుడు హాలాహలం పుట్టి ప్రపంచాన్ని దహిస్తుంటే అందరూ కైలాసానికి వెళ్లి అక్కడ మంచులో కూలబడి 'కుయ్యో, మొర్రో విను మాలింపుము, చిత్తగింపుము, దయన్ వీక్షింపుమని' మొత్తుకుంటుంటే శివుడు సతీసమేత చంద్రచూడుడై వచ్చి, లోకహితార్థం ఆ హాలాహల విషాన్ని మింగి, దానిని కడుపులోకి పోనీక, కంఠంలో నిలుపుకుని గరళకంఠుడైనాడు. ఇప్పుడు ఈ విషాన్ని ఎవరు మింగి జనాల్ని రక్షిస్తారో!" అన్నాడు విషాద వదనంతో అంతర్యామి.

"బలవంతుడిదే రాజ్యం, ఆరోగ్యవంతుడిదే జీవితం, శీలవంతుడిదే ఇహపరలోకం" అన్నాడు యల్లెస్సారిన్ సాలోచనగా.

"డార్విన్ అన్నట్లుగా- 'Survival of the fittest' ఇప్పుడు మౌలికసూత్ర మయ్యింది" అన్నాడు అంతర్యామి.

“సెప్టెంబరు 11, 2020 నాటికి మానవ జనాభా 7.81 బిలియన్లు. డేవిడ్ అటెన్‌బరో (David Attenborough) అన్నట్లు ఈ మానవులే భూమిపై చీడగా పరిణమిస్తున్నారు 'Humanity a plague on the Earth'” అన్నాడు యల్లెస్సారిన్.

“కరోనా వ్యాధిగ్రస్తులు సెప్టెంబరు 11, 2020 నాటికి 2,83,28,131. మరణాల సంఖ్య 9,13,919. వందకు ఇద్దరిని మింగేస్తున్నదీ మహమ్మారి. మానవజాతి భూమిపై ఇతర జీవజాలానికి చీడగా మారితే, చీడకు చీడ పట్టినట్లు ఈ వైరసులు, బాక్టీరియా, ఫంగై, ప్రొటొజోవన్లు మానవ జాతిని సంక్షోభంలోకి నెడుతున్నాయి” అన్నాడు అంతర్యామి.

క్రీస్తుశకం 541-750 మధ్యకాలంలో వచ్చిన జస్టినియన్ ప్లేగు ఆనాటి మానవ జనాభాలో సగాన్ని (30-50 మిలియన్లు) మింగి వేసింది. జ్వరం, వాపులు, చీము, రక్తం కారుతూ రోజుకు పదివేలమందికి పైగా చనిపోతుంటే సంబంధీకుల దుఃఖం, ఆర్తనాదాలతో దిక్కులు పిక్కటిల్లేవట. ఆనాటి బైజాంటియన్ చక్రవర్తి మొదటి జస్టినియన్ పేరు మీద ఈ ప్లేగుకు ‘జస్టినియన్ ప్లేగు’ అని పిలిచారు. ఆఫ్రికా నుంచి నౌకలలో ఈగలు, ఎలుకల ద్వారా యూరప్ చేరుకున్నదా వ్యాధి.

ఆరువందల సంవత్సరాల తరువాత తలెత్తింది నల్ల మృత్యువు (Black Death). చైనా నుంచి మొదలై ఇటాలియన్ నావికులతో యూరప్ చేరుకుని (1347-1353) ఆరేళ్లలో యాభై మిలియన్ జనాల్ని కబళించింది. (చైనా, ఇండియా, సిరియా, ఈజిప్టు దేశాలలో). యువతరాన్ని మింగేసిన మహా పిశాచమది.

జువాన్ గెథిన్ (Jeuan Gethin) అనే వెల్ష్ కవి వ్రాసినాడు- 'A plague which eats off the young, a rootless phantom which has no mercy or fair countenance" యల్లెస్సారిన్ వివరించాడు.

అంతర్యామి అన్నాడు- “15వ శతాబ్దం నుంచి సాహసికులు ఉత్తర దిక్కున ఉన్న నూతన ఖండాల వేపు ప్రయాణించినారు. కొలంబస్ లాంటి నావికుల సాహసయాత్రలలో 1852లో ఓ స్పానిష్ నౌకలోని ఆఫ్రికన్ బానిసకు ఉన్న మశూచి (Smallpox) వెరాక్రుజ్, మెక్సికో లోని స్థానిక ఇండియన్లకు సోకగా అక్కడ జనాభాలో 95 శాతం మంది (ఇరవై మిలియన్లు) మరణించారు.

1817–1823లో ప్రారంభమైన కలరా (Cholera) జెస్సోర్ (Jessore-India) ఇండియాలో ప్రారంభమై లక్షలాది స్థానికులను, పదివేలమంది బ్రిటిష్ సైనికుల్ని పొట్టన పెట్టుకున్నది. ప్రపంచ ఆరోగ్యసంస్థ 'కలరా'ను 'The forgotten pandemic'గా వర్ణించింది. ఇప్పటికీ వేలాదిమందిని మృత్యువాతకెరజేస్తున్న వ్యాధి కలరా. రెండు శతాబ్దాల కాలంలో ఏడుసార్లు వచ్చినదీ కలరా మహమ్మారి."

యల్లెస్సారిన్ అందుకున్నాడు– "సరిగ్గా వందేళ్ల క్రితం (1918-1919)లో వచ్చిన స్పానిష్ ఫ్లు ప్రపంచంలోని మూడవ వంతు జనాభాను (500 మిలియన్లు) వ్యాధిగ్రస్థం చేయగా యాభై మిలియన్ల (50–100) మంది చనిపోయారు.

యాభై ఏళ్ల తరువాత హాంగ్‌కాంగ్ ఫ్లు (Hongkong Flu - $H_3N_2$; 1968-1970) ఒక మిలియన్ జనాభాకు సోకింది.

1981లో మొదలై ఇప్పటికీ మానవజాతిని వణికిస్తున్నది HIV/AIDS. డెబ్భై అయిదు మిలియన్ల మందికి ఈ వ్యాధి సోకగా 32 మిలియన్ల మంది చనిపోయారు.

SARS (2002–2003) గ్వాంగ్‌డాంగ్, చైనాలో మొదలై 26 దేశాలకు వ్యాప్తి చెందింది. 8000 మందికి సోకగా 774 మంది చనిపోయారు.

స్వైన్ ఫ్లు (H1N1 2009-2010) దాదాపు 60.8 మిలియన్ల మందికి సోకగా వారిలో ఎక్కువ మంది 65 ఏళ్ల లోపు వయసున్నవారు. సాధారణంగా ఇన్‌ఫ్లుయెంజా 65 ఏళ్ల పైబడిన వారిలో తీవ్రంగా ఉంటుంది.

2014–2016లో గినీయాలోని ఎబొలా నది దగ్గర ఓ గ్రామంలో మొదలైన ఎబొలా వైరస్ వ్యాధి పశ్చిమ ఆఫ్రికాలో 28,600 మందికి సోకగా 11,325 మంది చనిపోయారు.

SARS వైరసు లాంటిదే కోవిద్–19 వైరసు. జన్యుపరంగా రెండు వైరసులూ 86.9% ఒకేరకంగా ఉండడాన్ని శాస్త్రజ్ఞులు గమనించారు".

అంతర్యామి అన్నాడు– "స్టాన్‌ఫర్డ్ చరిత్రకారుడు వాల్టర్ స్కిడిల్ (Walter Scheidel) తన పుస్తకం 'The Great Leveller' లో The four horsemen - నలుగురు అశ్వికులు – అసమానతలను రూపుమాపేందుకు వస్తారు–

1) మహమ్మారి (Pandemics), 2) యుద్ధాలు (Wars), 3) విప్లవాలు (Revolutions), 4) ప్రభుత్వ వైఫల్యాలు (State Failures)’ అన్నాడు.

జస్టినియన్ ప్లేగుతో రోమన్ సామ్రాజ్యం పతనమైంది. నల్లమృత్యువు - Black Death తో శ్రామికులు, రైతుకూలీల తిరుగుబాటు (Peasant Revolt-1381) వచ్చింది. యూదులను వ్యాధిని వ్యాపింపచేస్తున్నవారిగా అనుమానించి వారిని అనేక హింసలకు గురిచేసినారు. కాథలిక్ చర్చి బలహీనపడింది. దేవుడిపై విశ్వాసం సడలింది. 'How could it be that an event of this kind could occur with a wise, all knowing and omniscient divinity?'

కలడందురు దీనుల యెడఁ
కలడందురు పరమయోగి గణముల పాలున్
కలడందురు అన్ని దిశలందున్
కలడు కలండనెడివాడు కలడో లేడో!

స్పానిష్ ఫ్లూ వచ్చేసరికి మొదటి ప్రపంచయుద్ధం ముగింపు దశలో ఉన్నది. స్పానిష్ ఫ్లూ యూరప్, అమెరికా, ఆసియాలలో వ్యాప్తి చెందగా ఆనాటి ఇండియాలోని 6% జనాభా (18 మిలియన్లు) ఆ వ్యాధి బారిన పడి అదృశ్యమైనది.

జర్మనీ ఓడిపోవడానికి ముఖ్య కారణంగా ‘స్పానిష్ ఫ్లూ’ పేర్కొనబడింది. ఇప్పుడు కోవిడ్–19 ప్రపంచ స్వరూపాన్ని ఎలా మార్చివేస్తుందో చూడాలి!” అన్నాడు అంతర్యామి.

యల్లెస్సారిన్ ఆలోచిస్తూ అన్నాడు– “మానవ జనాభా 1 బిలియన్ (వంద కోట్లు)కు చేరుకోడానికి రెండు మిలియన్ సంవత్సరాలు పట్టింది. ఏడు బిలియన్‌లు చేరడానికి పట్టిన కాలం రెండు వందల సంవత్సరాలే.

మహాకరువు (Great Famine 1315-1317), నల్లమృత్యువు (1350) నాటికి ప్రపంచ జనాభా 370 మిలియన్లు. ఈ సెప్టెంబరు 2020 నాటికి 7.81 బిలియన్లు. 2050 కల్లా 10 బిలియన్లు చేరుకునేట్లుంది. 31 అక్టోబర్ 2011ను 'Day of 7 Billions'గా యునైటెడ్ నేషన్స్ నామకరణం చేసింది.

అలాగే, విప్లవాలలో (Revolutions) మిలియన్ల కొద్దీ ప్రజలు మరణించారు. హైతీ, ఇరాన్, క్యూబా, చైనా, ఫ్రెంచి, రష్యా, అమెరికా, బ్రిటన్, టర్కీ విప్లవాలు ఆయా దేశాలలో అనేకమంది మృతికి కారణమైనాయి.

ఈ భూమిపై ఇంతవరకు పుట్టిన మానవుల సంఖ్య దాదాపు వంద బిలియన్లు అని ఓ అంచనా (100-107 బిలియన్లు). ప్రస్తుత జనాభా 7.8 బిలియన్లు. ఇప్పటికే వంద బిలియన్ల మంది (పదివేల కోట్లు) మట్టిలో కలిసి పోయారు. మానవుని శాస్త్రజ్ఞాన కీర్తిప్రతిష్ఠలు ఈ కోవిద్-19 దెబ్బకు మట్టిలో కలిసాయి.

Sic transit gloria mundi (Thus passes worldly glory) - కొత్తగా ఎన్నికైన పోప్ తన ఊరేగింపు కుర్చీలో (Sedia gestatoria) కూర్చుని ఉన్నాడు. సెయింట్‌పీటర్ బెసిలికా నుంచి ఊరేగింపు ప్రారంభమయ్యింది. మధ్యలో మూడుసార్లు ఊరేగింపు ఆగింది. ఆగిన చోటల్లా ఉత్సవ పూజారి 'పోప్' ముందు తన మోకాళ్లపై నిలబడి చేతిలోని వెండి లేదా ఇత్తడి పుల్లకు ఉన్న పొగచూరిన వత్తిని చూపిస్తూ ఈ ఆడంబరాలన్నీ క్షణికాలేనని గుర్తుచేస్తూ అంటాడు– 'Holy father, So passes worldly glory'.

నాకు దింపుడు కళ్లాలు గుర్తుకొచ్చాయి. అవును, మరణం తప్పదు – Memento mori! కనురెప్ప మూసే వ్యవధిలో – In the blink of an eye - In ictu oculi - at the last trump ఏమైనా కావచ్చు. In raptu, In transitu, in ictu oculi - నిమేష మాత్రాన జనన మరణాలు సంభవించవచ్చు. ఇదంతా శూన్యమేనా? (Vanitas), మాయా? (Illusion)?

అయినా This too shall pass - ఇదీ ముగుస్తుంది (in nizbogzarad) - 1852లో ఎడ్వర్డ్ ఫిట్జ్‌గెరాల్డ్ (Edward Fitzgerald) వెనకటి పర్షియన్ గాథను కొత్తగా చెప్పినాడు. సొలొమాన్ ముద్రిక (Solomon's Seal)గా! మంచీ చెడూ అన్ని కాలాల్లోనూ సత్యంగా భాసించే వాక్యాన్ని చెప్పమని ఓ రాజు అడిగినపుడు సొలొమాన్ ప్రభువు అన్నాడు– 'This too will pass away'.

రాజ సభలో వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఒక తార్కికుడడిగాడు– 'ఇదీ ముగుస్తుంది. సరే! మరి మనకు ముందున్న వాళ్లు ఎక్కడికి వెళ్లిపోయారు?' Ubi sunt qui ante nos fuerunt? Where are those who were before us?.

ఫ్రాంకాయిస్ విలాన్ (Francois Villan - 15వ శతాబ్దం) అడుగుతున్నాడు తన Ballad of the Ladies of Times Past లో Mais on sant les neiges d'antan? Where are the snows of yester year?

మహాకవి శ్రీశ్రీ అన్నాడు– 'ఏవి తల్లీ, నిరుడు కురిసిన హిమ సమూహములు?'

ఉమర్ ఖయ్యాం అటుగా వెళ్తున్నపుడు కులాలుని కుటీరంలోని కుండలు మాట్లాడుకుంటున్నాయి– ఒక మట్టిపాత్ర అన్నది– 'వాళ్లేరీ, ఆ కులాలుడు, ఈ కుండల్ని కొనేవాడు, వీటిని అమ్మేవాడు?' నీకు తెలుసా, ఈ మరణ భయం నన్ను మరింత కృంగదీస్తున్నది' – 'Timor mortis conturbat me' - 'Fear of Death disturbs me'"

అంతర్యామి తలవూపాడు– "ఈ కోవిద్–19 వ్యాధి కన్నా భయం మానవుల్ని కలచివేస్తున్నది. వ్యాధి వస్తుందేమోనన్న భయం, వస్తే ఒంటరిగా క్వారంటెయిన్‌లో ఉండాలేమోనన్న భయం, ఉంటే ఇంట్లో జరుగుబాటెలా అనే భయం, ఇంటికి వచ్చాక పని దొరుకుతుందా అన్న భయం; వ్యాధి ఎక్కువైతే బతుకుతానా అని భయం, బతికి బట్టకడితే రేపటి బతుకు భయం!

మన మెదడులోని ఎమిగ్డాలా (Amugdalae) కేంద్రాలు భయాన్ని నియంత్రిస్తాయి. అవి దెబ్బతింటే (Urbach - Wiethe disease) భయం ఉండదు. ప్రపంచంలో ఈ వ్యాధి ఉన్న నాలుగు వందల మందికి ఎమిగ్డాలాలు నశించడం వలన వాళ్లకు భయమనే మాట తెలియదు.

ఈ కోవిద్–19 దెబ్బకు భయమంటే ఏమిటో తెలిసివచ్చింది. భయమంటే తెలియని సాహస యువకుడిని పెళ్లాడిన రాకుమార్తె అతడు నిద్రపోతుంటే ముఖాన చల్లటి మంచునీళ్లు కొట్టేసరికి అతడు ఉలిక్కిపడి లేచి వణికిపోతూ అన్నాడు బింకంగా– 'నాకు వణకడం (Shudder) అంటే తెలిసింది కాని భయమంటే ఏమిటో ఇంకా తెలవలేదు'. అట్లాగే మన పరిస్థితీ ఉంది" అన్నాడు అంతర్యామి.

**ఇది కూడా వెళ్లిపోతుంది కదా? This too shall pass!**
**అవును, వెళ్లిపోతుంది. వెళ్లిపోతుందనే ఆశ!**

✧✧✧✧✧

**(జాకబ్‌తో అతడన్నాడు– "జీవితార్థం తెలుసుకోవాలని ఎంత ప్రయత్నించినా కానరావడంలేదు"**

**జాకబ్ అన్నాడు– "అన్వేషించు, అర్థమవుతుంది మిత్రమా! చేతిలో దీపం పట్టుకుని వెలుగుకోసం వెదుకుతున్నావేమో నీవు!")**

# 2. ఇది కూడా వెళ్లిపోతుందా వెనకటిలానే?

## (This too shall pass?)

యల్లెస్సారిన్ అన్నాడు– “ఒకసారి బర్డ్‌ఫ్లూ (Bird Flu) విస్తారంగా ఉన్నపుడు పక్షులన్నీ సమావేశమైనాయిట. వాటిలో తెలివైన పక్షి హూపో (Hoopoe) అన్నది– ‘ఈ మానవ విధ్వంసజనిత ప్రమాదాలూ, నూతన ప్రయోగ ఆవిష్కరణలూ, అడవుల నరికివేతలూ, సెల్‌ఫోన్ టవర్ల తరంగాలూ మన జీవితాలను అస్తవ్యస్తం చేస్తున్నాయి. వాళ్లకు ట్రంప్, షి జిన్‌పింగ్, మోడి, పుతిన్ లాంటి నాయకులున్నట్లే మనకూ నాయకులుంటే మనమూ మన పక్షిప్రజల్ని కాపాడుకునేవాళ్లం. అందుచేత మనకు సమర్థుడైన సిమోర్గ్ (Simorgh) పక్షీంద్రుడవసరం’.

అన్నిటికన్నా వేగంగా పోగల లఘు పతనకం– కాకి అడిగింది– ‘సిమోర్గ్ ఎక్కడ ఉంటాడు? మనకెందుకు కనిపించడు?’

హూపో అన్నది– ‘అతడిని కలుసుకోవాలంటే మనం ఏడు లోయలు దాటాలి. 1) అన్వేషణాలోయ, 2) ప్రేమలోయ, 3) జ్ఞానలోయ, 4) బంధచ్ఛేదనా లోయ, 5) ఐక్యతాలోయ, 6) అద్భుత లోయ, 7) కాలరహిత లోయ. వీటిని దాటితే మనం మహానాయకుడిని కలవచ్చు”.

“సిమోర్గ్ (సి=ముప్పది) (ముర్గ్=పక్షులు). పర్షియన్ భాషలో ఫరిదుద్దిన్ అత్తర్ కవి మాంటిక్–అత్–తెయర్ (Mantiq-ut-Tayr) అనే గ్రంథంలో వర్ణిస్తాడు– ముప్పై పక్షులు సప్తలోయల్ని దాటి దైవపీఠాన్ని చేరుకుంటాయి సిమోర్గ్‌ను కలిసేందుకు. వాటికప్పుడు అర్థమవుతుంది – ఆ అద్భుత కాంతి నీడలమే తామని” అన్నాడు అంతర్యామి.

“అలాగే ఇటువంటి కోవిద్–19 వైరస మృత్యు ఘంటికారావాల మధ్య మనకర్థమవుతుంది వైరస్ మన నీడ కావచ్చు లేదా అనేక వైరస్‌ల నీడ మనం కావచ్చు. This too shall pass. ఇదీ వెళ్లిపోతుంది. కాలగమనాన మార్పు సహజం. బుద్ధుడు వచించినట్లు– ఉనికికి (Existence)–తిలఖ్ఖన–త్రిలక్షణాలు– అనిచ్ఛ (Impermanence) దుఃఖ (Suffering), అనత్త (Non self).

Tempora mutantur, nos at mutamur in illis - Times are changed, we also are changed with them. మారే కాలంతో పాటు మనమూ మార్పు చెందుతాము.

పక్షులు ఏడు లోయలు దాటి తమలో పరమాత్ముడిని చూసుకున్నట్లు మనం కూడా ఆధార్‌కార్డ్, పాన్‌కార్డ్, డ్రైవింగ్ లైసెన్సు, పాస్‌పోర్టు, వీసా, గ్రీన్‌కార్డ్, పర్మనెంట్ రెసిడెన్సి కార్డులుంటేనే లోయలన్నీ దాటుతాం. అప్పుడు కోరుకున్న నాయకుడి దర్శనం, ఆ లోకపు పౌరసత్వం లభిస్తుంది. లేకుంటే ఇటువంటి కరోనా వైరసులొచ్చి పడ్డప్పుడు మన బతుకులు అగమ్యగోచరాలవుతాయి" అన్నాడు యల్లెస్సారిన్.

అంతర్యామి ఒక పట్టాన అందడు. అతడు అన్నాడు- "నాకేం జరుగుతుంది, ఇది ఎలా ముగుస్తుంది అన్న చింత నాకు లేదు. కాని ఒక్క వైరస్ మానవ సంబంధాలను ఎంతగా దిగజార్చిందో అదే నన్ను బాధిస్తున్నది. అల్జీరియాలో పుట్టిన ఫ్రెంచి వేదాంతి, నలభై నాలుగేళ్ల వయసులో (1957) నోబెల్ బహుమతి పొందిన ఆల్బర్ట్ కామస్ (Albert Camus) ఫ్రెంచ్ రెసిస్టెన్స్‌లో చేరి Combat అనే పత్రికకు ముఖ్య సంపాదకుడిగా పనిచేసాడు. Absurdism - అసంబద్ధతావాదాన్ని వేదాంతంలో ప్రచారంలోకి తెచ్చినవాడితడు. అతడంటాడు- 'యుద్ధం రాగానే ప్రజలంటారు 'ఇది మూర్ఖత్వం. ఎక్కువకాలం ఉండదులే!'. మూర్ఖత్వానికి దానికి పరిచితమైన దారి ఉంటుంది. మన అజ్ఞానంలో మనముంటాము' సిసిఫస్‌లకు మల్లే మన నెత్తిమీద పెద్ద బండరాయి. కొండ మీదికి తోసుకువెళ్లగానే కిందకు జారిపోతుందది. మళ్లీ మొదలెట్టాలి పర్వత పాదం దగ్గర్నుంచీ" అన్నాడు.

యల్లెస్సారిన్ తల పంకించాడు- "ఈ కరోనా వైరసుల ఉనికి 1930లోనే తెలిసినా 2002-2003 SARS (Severe Acute Respiratory Syndrome)తో అందరి దృష్టి వీటిపై పడింది. కరోనా వైరసులలో ఆల్ఫా, బీటా, గామా, డెల్టా రకాలున్నాయి. వీటిలో ఏడు వైరసులు 1) $\alpha$ HCov-229E, 2) H Cov-NL63, 3) $\beta$ H Cov-HKU1, 4) SARS Cov-1, 5) MERS CoV, 6) H Cov-OC43, 7) SARS Cov-2 లేదా 2019 -nCov ముఖ్యమైనవి.

ఈ SARS Cov-2 (Covid-19) వైరస్‌కు వుహాన్ గబ్బిలాలలో ఉండే Bat Cov Ra TG 13 కు 96% జన్యువులు ఒకే రకంగా ఉన్నాయి. అలాగే పంగోలిన్‌లో ఉన్న వైరసుల జన్యువులు 90% Covid-19 వైరస్‌ను పోలి ఉండడం గమనార్హం.

ఈ కోవిద్-19 వైరస్ ACE-2 రిసెప్టార్లున్న కణజాలంలోకి మాత్రమే ప్రవేశించగలుగుతుంది. నోరు, ముక్కు, గొంతు, శ్వాస కోశములు, జీర్ణాశయం, పేవులు, చర్మం, లింఫ్ గ్రంథులు, థైమస్, మజ్జ-బోన్‌మారో, ప్లీహము, కాలేయము, మూత్రపిండాలు, మెదడులోని కణాలకు ACE-2 రిసెప్టార్లు ఉంటాయి. ముఖ్యంగా Lung Alveolar Epithelial Cells, Enterocytes of Smell intestine; Enolothelial Cells of Blood Vessels లో.

ఈ Covid-19 వైరస్ తాను లక్ష్యంగా చేసుకున్న కణాల్లో ప్రవేశించి తన సమూహాన్ని వృద్ధి చెందించేందుకు ఏడు ఘట్టాలున్నాయి.

1) కణపు ACE-2 రిసెప్టార్‌ను తన Spike (S-Protein) తాళంచెవితో తెరవడం.

2) వైరస్ ఏక్టివేషన్ - కణంలోకి ప్రవేశించి తన జీనోమ్‌ను విడుదల చేయడం.

3) వైరస్ m-RNA గా మారడం.

4) వైరల్ జీనోమ్‌లోని ORFla, ORFlb జన్యువుల ద్వారా Polyprotein la, 1b లను తయారుచేసి వాటితో రైబోజోములను తన నియంత్రణలోకి తెచ్చుకోవడం, వైరల్ ప్రొటీన్లను తయారుచేయడం.

5) ఎండొప్లాస్మిక్ రెటిక్యులం వద్దకు వెళ్లడం.

6) వైరస్‌ల తయారి - గాల్గి ఏపరేటస్‌లో (అసెంబ్లి).

7) కణం నుంచి విడుదల కావడం. (Endocytosis)

ఈ ఏడు ఘట్టాలు పక్షులు దాటిన ఏడు లోయల్లా 1) Valley of Quest, 2) Love, 3) Knowledge, 4) Detachment, 5) Unity, 6) Wonderment, 7) Annihilation or Release ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

జీవకణపు సైటొకిన్ స్టార్మ్ – తుఫాను మంటల అద్దాల్లో ఈ వైరసులు తమ ప్రజాపతి నీడగా తమను తాము చూసుకుంటున్నాయి" అన్నాడు యల్లెస్సారిన్.

అంతర్యామి దిగాలుగా అన్నాడు– "2020 సంవత్సరం మనకు అచ్చిరాలేదు. ఈ విష కణాలను నియంత్రించడంలో ప్రభుత్వాలూ, ప్రజలూ అందరూ వైఫల్యం చెందారు. ఎందుకంటే వీళ్లు సరైన మార్గంలో నడవలేదు".

యల్లెస్సారిన్ అడిగాడు– "ఏమిటా సరైన మార్గం? ఎందుకు ఇంత శాస్త్రజ్ఞానమూ ఈ చిన్ని వైరసు దెబ్బకు కుదేలయిపోయింది".

అంతర్యామి అన్నాడు– "విజయానికి బాట ఒక్కటే, అపజయ మార్గాలు అనేకం. బాటసారులు నాలుగు రకాలు–

1) ప్రకృతి ధర్మాలను అనుసరిస్తూ చరించేవాళ్లు

2) హేతుబద్ధంగా, తార్కికంగా ఆలోచించేవాళ్లు

3) ప్రేమ, శాంతి, సంయమనాలతో నడిచేవాళ్లు

4) ప్రకృతికి విధేయులై, శాస్త్రజ్ఞానాన్ని సమన్వయ పరుస్తూ, స్వార్థరహితులై, మానవజాతిని ఉత్తేజపరుస్తూ ముందుకు వెళ్లేవాళ్లు.

ఈ కోవిద్–19 ఆట కట్టించడంలో అందరూ కలిసి నడవడం మాని రాజకీయ, ఆర్థిక, స్వార్థ కారణాలతో తలొక దిక్కు వేపున నడుస్తున్నారు. అదే ఈ వైఫల్యాలకు కారణం. ఈ విషవ్యాధిని కట్టడంలో వీళ్లు ఏడు అగాథాలను దాటడానికి మార్గాలనెన్నుకున్నారు. అయినా 'ఎవరికి వారే యమునా తీరే'లా ప్రవర్తించడంతో సమస్య జటిలమయ్యింది".

యల్లెస్సారిన్ నవ్వాడు– "ఇంత దుఃఖంలో వేదాంతం పెల్లుబికి వస్తున్నది. బయటపడే దారి దొరకనపుడే మనసు భగవంతుడి మీదకు మళ్లుతుందా? స్వర్గ నరకాలు తటిల్లతల్లా మెరిసి మాయమవుతుంటాయా?"

అంతర్యామి అన్నాడు– "కష్టాలు వచ్చినప్పుడే నష్టాలు భరించరానివిగా మారతాయి. ఆశ నశించినాక తెగింపు మొదలవుతుంది. డానియల్ డెఫో (Daniel Defoe) అన్నట్లు– 'ఒక ఒంటరితనాన్ని ఇంకొక రకపు ఒంటరితనంతో పోల్చడం

ఉన్నదానిని లేనిదానితో పోల్చడానికి సమానం. ఈ క్వారంటెయిన్లూ, ఐసొలేషన్లూ వ్యక్తావ్యక్త స్థితుల్ని ఒక్కతాటిపై నిలబెడ్తున్నాయి".

"అవును అంతర్యామీ! నీవు చెప్పేది అక్షరాలా సత్యం. వాస్తవం కన్నా ఊహలే మనల్ని ఎక్కువగా భయపెడ్తున్నాయి. అన్ని నిజాలూ ఊహాలోకంలోనే ఊపిరి పోసుకుంటాయి. నిలదొక్కుకుంటాయి. జీవితాన్ని నడిపించేది ఊహా ప్రపంచమేనా!" అన్నాడు యల్లెస్సారిన్.

"ఊహల్ని ప్రభావితం చేసేది సమాచారం. పుకార్లు, నిజంలా కనిపించే అబద్ధాలూ అలజడిని సృష్టిస్తాయి. పరిశోధనా పత్రాల పేరిట Preprint servers - Arxiv, Bio RXIV, Med RXIV, SSRN లలో Peer Review లేకుండా వచ్చిన సమాచారం కోవిద్-19 పుట్టుక, వ్యాప్తి గురించి అనేక అపోహలకు దారితీసింది. ఎంతో పట్టుదలతో, శ్రమించి పనిచేస్తున్న ప్రభుత్వాలపై, ప్రపంచ సంస్థలపై బురద జల్లడానికి ఈ పత్రాలు తోడ్పడ్డాయి. నిజం కన్నా అబద్ధం ఆకర్షణీయంగా, రుచికరంగా ఉంటుంది కదా!

వుహాన్ వైరాలజీ పరిశోధన శాల నుంచి ప్రమాదవశాత్తు కోవిద్-19 వైరస్ బయటపడి ఈ విపత్తుకు కారణమయ్యిందనేది ముఖ్యమైన ఆరోపణ. ఈ వైరస్ Bio Engineered Virus అని, చైనా దేశపు జీవాయుధమని (Biological Weapon), కెనడా పరిశోధన శాలలో చైనా శాస్త్రవేత్తలు గూఢచారులుగా పనిచేసి జన్యుమార్పిడి చేయబడిన వైరస్‌ను చైనాకు తరలించారని; అమెరికా జీవాయుధమని, యూదులు ఇరాన్‌కు వ్యతిరేకంగా తయారుచేసిన Biological Weapon అని, ముస్లింలు మత సమావేశాల్లో ఈ వైరస్‌ను వ్యాప్తి చేస్తున్నారని రకరకాల పుకార్లు విశ్వవ్యాప్తమయ్యాయి" అన్నాడు అంతర్యామి.

"ఇంకో గమ్మత్తైన ఆరోపణ ఏమిటంటే ప్రపంచ జనాభా తగ్గించడానికి మైక్రోసాఫ్ట్ మాజీ అధినేత బిల్‌గేట్స్ (Bill Gates) ఇంగ్లండ్‌లోని Pirbright Institute ద్వారా పన్నిన వ్యూహంలో భాగమే ఈ వైరస్ సృష్టి అని ప్రచారం జరిగింది" అన్నాడు యల్లెస్సారిన్.

"ఆఫ్రికాలో కోవిద్-19 ఉధృతి ఎక్కువగా లేకపోవడానికి కారణం అక్కడకింకా 5G టెక్నాలజి అందుబాటులో లేకపోవడమని థామస్ కొవాన్ అనే

అతడు ఆరోపించాడు. 5G టెక్నాలజీలో వెలువడే ఎలక్ట్రో మాగ్నెటిక్ రేడియేషన్ వైరస్‌లలో మార్పు తేగా అవి కోవిద్–19గా రూపు చెందాయని అతడు వాదించాడు. ఆ వార్త తీవ్రమైన అలజడి సృష్టించడంతో ఇంగ్లండ్, నెదర్‌ల్యాండ్స్, సైప్రస్, ఐర్లాండ్‌లలో అనేకచోట్ల సెల్‌టవర్లు, 5G నెట్‌వర్క్‌లు ధ్వంసం చేయబడినాయి" అన్నాడు అంతర్యామి.

"కేమరూన్ లాంటి ఆఫ్రికాదేశాల్లో పోలియో చుక్కల మందులో కోవిద్–19 వైరస్ ఉన్నదన్న పుకారు రావడంతో చాలామంది ప్రజలు వాక్సినేషన్‌ను తిరస్కరించారు" అన్నాడు యల్లెస్సారిన్.

అంతర్యామి అన్నాడు– "ఏది ఏమైనా అందరి దృష్టి ఇప్పుడు చైనాపై ఉన్నది. అత్యంత దుర్భరమైన స్థితి నుంచి అనతికాలంలోనే అగ్రరాజ్యంగా మారినందుకు చైనా ఇతర దేశాలకు కంటగింపుగా మారిందా? అతి తక్కువ ధరతో తమ వస్తువుల్ని అమ్ముతూ ప్రపంచ వాణిజ్య మార్కెట్లను తమ అధీనంలోకి తెచ్చుకుంటున్న చైనాను నిలువరించడానికి ఈ కోవిద్–19 ఓ ఆయుధంగా వాడబడుతున్నదా? ప్రతి రంగంలోనూ ఎందుకు చైనా హస్తం ప్రత్యక్షమవుతున్నది?"

✧✧✧✧✧

**(శిథిలమైన కొంత కాలానికి అకస్మాత్తుగా వస్తుంది మార్పు. బహిష్కరించ బడిన దివ్యకాంతి తిరిగి కనిపిస్తుంది. బలం వల్ల కాక సహజంగా కలిగిన చలనం ఉబికి వస్తుంది. ఆ నిర్ణీత సమయానికి అన్నీ వస్తాయి. అదే స్వర్గం – నేలల అనుబంధానికి చిహ్నం. – ఐ. ఛింగ్)**

# 3. తొలిసారిగా ప్రత్యక్షం
## (The First Appearance)

**"చైనా దేశంలో అర్ధరాత్రి ప్రత్యక్షమయ్యింది ఆ పక్షి! ఎంత అద్భుతమైన విషయం! అక్కడ ఊడిపడిందా పక్షి ఈక ఒకటి విచిత్రంగా! దాని పేరు ప్రఖ్యాతులు వ్యాపించాయి ప్రపంచమంతా వేగంగా! ప్రతి ఒక్కరూ ఊహించారు ఈకను బట్టి విహంగపు రూపాన్ని! ఎవరి ఊహ నిజమో తెలియక పడ్డారు గందరగోళం! ఆ దేశపు ప్రదర్శన శాలలో చూడవచ్చు ఆ ఈక ఉన్న చిత్రం! అందుకే అంటారు చైనాలో అయినా సరే అన్వేషించు జ్ఞానం!"**

– 'పక్షుల సభ' – ఫరీదుద్దీన్ అత్తర్.

...................

అంతర్యామి అన్నాడు– "అన్ని దారులూ ఆరోజుల్లో రోమ్ నగరానికి వెళ్లినట్లు, ఇప్పుడు అందరి చూపుడు వేళ్లూ చైనానే చూపిస్తున్నాయి.

1346–1353 మధ్యకాలంలో ఆఫ్రికా, ఆసియా, యూరప్ దేశాలలో 75–200 మిలియన్ ప్రజల ప్రాణాలను హరించిన ప్లేగు వ్యాధి (Black Death) చైనాలోనే మొదలై వాణిజ్య నావలలో ఎలుకలు, ఈగల ద్వారా ఇతర దేశాలకు వ్యాపించిందని చరిత్రకారుల అభిప్రాయం.

ఆరవ, పధ్నాలుగవ, పంధొమ్మిదవ శతాబ్దాలలో వచ్చిన ప్లేగు వ్యాధికి జన్మస్థానం 'చైనా' అని అంతేగాక గత వంద సంవత్సరాలలో వచ్చిన అనేక మహమ్మారులకు (Pandemics) పుట్టిల్లు ఆ దేశమేనని ఆరోపణలున్నాయి".

యల్లెస్సారిన్ అందుకున్నాడు– "డాక్టర్ స్టివెన్ నొవెల్లా తన Skeptics' Guide to the Universe - ఎపిసోడ్‌లో వ్యాఖ్యానించాడు– 'చైనాలో జనసాంద్రత ఎక్కువ. వారి ఆహారపు అలవాట్లు ప్రత్యేకమైనవి. ఇటువంటి వైరసులు జంతువుల నుంచి మానవులకు రావడానికి (Zoonoses) ఇంతకంటే మంచి అవకాశ మేమున్నది?'.

డాక్టర్ పీటర్ దస్జాక్ – ఎకొహెల్త్ ఎలయెన్స్ ప్రెసిడెంట్ 2016లో ఈ విధంగా అన్నాడు– 'వైరసులను పుట్టించే పాత్ర దక్షిణ మధ్య చైనా. చైనా ప్రజలు

అప్పటికప్పుడు చంపిన జంతువుల మాంసం రుచికరమైనదని భావిస్తారు. చైనా Wet Market లో లభించని జంతువు లేదు".

అంతర్యామి అన్నాడు- "చైనాలో ఇప్పటికీ సాంప్రదాయ వైద్యానికి గిరాకీ. ఆక్యుపంక్చర్, మూలికా కషాయాలు (Honeysuckle, Chinese Skullcap, Weaping Forsythia) కోవిడ్-19 ఉధృతిని తగ్గించాయని వాళ్ల నమ్మకం.

1918లో వచ్చిన స్పానిష్ ఫ్లూ చైనాలోనే మొదలై దాదాపు వంద మిలియన్ల మంది ఉసురు తీసింది. ఒక్క ఇండియాలోనే ఇరవై మిలియన్ల మంది చనిపోయారు. 675000 మంది అమెరికాలో మృతి చెందారని ఓ అంచనా!

ప్రపంచం మొత్తాన్ని స్పానిష్ ఫ్లూ కబళిస్తున్నా చైనాలో అప్పుడూ మరణాల సంఖ్య తక్కువగా ఉండడానికి కారణమేమిటి? ఇప్పుడు కోవిడ్-19 రోగులు, మరణాల సంఖ్య చైనాలో తక్కువగా ఉండటానికి కారణం వాళ్ల సాంప్రదాయ వైద్యమా?

1918లో వచ్చిన స్పానిష్ ఫ్లూ వ్యాధిని ఇండియాలో బోంబేజ్వరం (Bombay Fever) అని పిలిచారు. 14-20 మిలియన్ల జనాభా (అప్పటి జనాభాలో 5 శాతం) వ్యాధి బారినపడి మరణించారు. మహాత్మాగాంధీ కూడా ఈ వ్యాధికి లోనై కోలుకున్నారు. వ్యాధిని నివారించడంలో బ్రిటిష్ వారి వైఫల్యం భారత స్వాతంత్ర్య సమరం ప్రజ్వరిల్లడానికి తోడ్పడింది" అన్నాడు యల్లెస్సారిన్

అంతర్యామి అన్నాడు- "1957 ఏషియన్ ఫ్లూ చైనాలోని గ్విజౌ (Guizhou) లో మొదలై 1.1 మిలియన్ ప్రాణాలు హరించింది.

1968 హాంగ్‌కాంగ్ ఫ్లూ మరో మిలియన్ ప్రజల్ని మట్టిలో కలిపింది.

1997 - బర్డ్‌ఫ్లూ-A (H5N1) హాంకాంగ్‌లో మొదలై ఆసియాలో విస్తరించింది.

2002- SARS-Cov-1 చైనాలోని యునాన్ (Yunnan) ప్రావిన్స్‌లో ప్రారంభమై 37 దేశాల్లో 750 మంది మరణాలకు కారణమైనది.

2019లో ఈ కోవిడ్-19 మహమ్మారి మరణమృదంగ ధ్వనులింకా విస్తరిస్తూనే ఉన్నాయి.

నవంబర్ 2017లోనే స్మిత్ సొనియన్ మాగ్ పత్రిక వ్రాసింది– 'Is China Ground Zero for a Future Pandemic?'

పీటర్ నవర్రొ (Peter Navarro) చైనాను 'Disease Incubator' గా వర్ణించాడు.

డాక్టర్ జెన్నిఫర్ హువాంగ్ బొయుయె (Dr. Jennifer Huvang Bouey) అభిప్రాయం– 'ఎపిడమిక్స్ చాలా వరకు చైనాలో పుట్టడమో, చైనా ద్వారా వెళ్లడమో చేస్తున్నాయి".

యల్లెస్సొరిన్ అన్నాడు– "WHO – ప్రపంచ ఆరోగ్యసంస్థ 2015లో ప్రచురించిన రిపోర్టు ఇది.

| వ్యాధి | జంతువులు | వైరస్ | జన్మస్థానం |
|---|---|---|---|
| స్పానిష్ ఫ్లూ | పందులు | H1N1 | చైనా |
| ఏషియన్ ఫ్లూ | అడవి బాతులు | H2N2 | చైనా |
| హాంగ్‌కాంగ్ ఫ్లూ | పందులు | H3N3 | హాంగ్‌కాంగ్ |
| HIV, ఎయిడ్స్ | చింపాంజీలు | HIV | ఆఫ్రికా |
| SARS | గబ్బిలాలు,<br>అడవి పిల్లులు | Corona Virus | చైనా |
| Ebola | అడవి జంతువులు | Ebola Virus | ఆఫ్రికా |
| MERS | ఒంటెలు, గబ్బిలాలు | Corona Virus | Middle East |
| NIPAH | గబ్బిలాలు | Nipah | మలేసియా |
| మార్‌బర్గ్ | గబ్బిలాలు | Marburg Virus | యూరప్ |
| కోవిద్–19 | గబ్బిలాలు, పంగొలిన్ | Corona Virus | చైనా |

అమెరికా రక్షణశాఖ కార్యదర్శి మైక్ పాంపియొ (Mike Pompeo) అన్నాడు– 'ఇవ్వాల్టికి కూడా మనం మాస్కులు ధరించి, మహమ్మారికి బలైన అభాగ్యుల శవాల్ని లెక్కబెడుతూనే ఉన్నాం ఈ చైనా కమ్యూనిస్టు పార్టీ తప్పిదాలు, వైఫల్యాలవల్ల'.

చైనా బదులిచ్చింది– ‘ఈ నిందాక్రీడ–Blame Game ఆపండి. తొలుదొల్త మేమూ ఇది మామూలు ఇన్‌ఫ్లుయెంజా అనే అనుకున్నాం. అనవసరంగా ప్రజల్ని ఆందోళనలో ఉంచడం వల్ల ఉపయోగం ఉండదని భావించాం. కాని వైరసు రూపురేఖలు, తీవ్రత గమనించిన వెంటనే మేము ప్రపంచ ఆరోగ్య వ్యవస్థకు సమాచారమందించాం! వారితో సహకరిస్తూనే ఉన్నాం! ఇలా జరిగుంటే బాగుండేది అని మీరనుకుంటే సరిపోతుందా? అన్నీ తెలిసినాక మీరేం చేసారు?’

ఇలా ఒకరినొకరు నిందించుకోవడం మానేసి సహాయ సహకారాలు అందించుకుని ఉంటే బాగుండేది” అన్నాడు యల్లెస్సారిన్.

అంతర్యామి అన్నాడు– “వుహాన్‌లో లాక్‌డౌన్ జనవరి 23న ప్రకటించారు. అప్పటికే నాలుగు మిలియన్ల ప్రయాణీకులు వుహాన్ (Wuhan) నుంచి ఇతర చోట్లకు, విదేశాలకు వెళ్లిపోయారు (చైనీస్ నూతన సంవత్సరం సందర్భంగా). ఆ లాక్‌డౌన్ మూడు వారాలు ముందు ప్రకటించి ఉంటే 95% వ్యాప్తిని అరికట్టగలిగి ఉండేది. ఒక వారం ముందైతే 65 శాతం ఆపగలిగి ఉండేది”.

యల్లెస్సారిన్ నవ్వాడు– “ఈ లెక్కలన్నీ గమ్మత్తుగా ఉంటాయి. ఇంతకీ Ground Zero అంటే తొలుదొల్త కోవిద్–19 ఈ భూమిపై ప్రత్యక్షం అయిన రోజెప్పుడు? Patient Zero ఎవరు? వీటికే సరైన సమాధానం దొరకలేదు. కోవిద్–19 రోగులలో 80% పైగా ఏ వ్యాధి లక్షణాలు లేనివారే! నీకీ విషయం తెలుసా అంతర్యామీ! ఫ్రాన్సులో కొందరు పాత పేషంట్ల రక్తం, తెమడ శాంపుల్స్‌ను తిరిగి పరీక్షించినపుడు వాటిలో కోవిద్–19 ఆనవాళ్లు కనిపించాయిప్పుడు. అంటే ఈ వైరస్‌కు పేరు పెట్టక మునుపే నవంబరు 16 కల్లా ఫ్రాన్సు, డిసెంబర్ 18 కల్లా ఇటలీలో ప్రత్యక్షమయ్యిందన్నమాట.

అక్కడక్కడా చాపకింద నీరులా ప్రవహించి క్రిస్టమస్, నూతన సంవత్సర శలవులలో గణనీయంగా వృద్ధి చెంది, మత సమావేశాల్లో మరింత బలపడి విశ్వవ్యాప్తం చెంది ఉండవచ్చు. ‘తిలాపాపం తలా పిడికెడు’ అన్నట్లు– అందరి వైఫల్యాలూ ఈ వైరస్ మహమ్మారి అనే అగ్నిలో ఆజ్యం పోసాయి.

డిశంబరు 27, 2019న వుహాన్‌లోని వైద్యులు, అనేకమంది రోగులలో న్యుమోనియా (Pneumonia) లక్షణాలను గమనించారు. డిశంబరు 31, నాడు

కొత్త వ్యాధిని అధికారికంగా ప్రకటించారు. జనవరి 1, 2020 నాడు వుహాన్ వెట్ మార్కెట్‌ను మూసివేసారు.

కాని అప్పటికే సామాజిక మాధ్యమాలలో అంతుబట్టని ఈ వ్యాధి గురించి అలజడి చెలరేగింది. డిశంబర్ 30, 2019 నాడు లి వెన్‌లియాంగ్ అనే కంటి డాక్టరు 'We Chat' సోషల్ మీడియాలో అంతుపట్టని శ్వాసకోశ వ్యాధి గురించి తన మిత్రులకు తెలియబరచాడు. అది తెలిసిన స్థానిక అధికారులు - తప్పుడు సమాచారాన్ని అందించి ప్రజల్లో భయాందోళనలను రేకెత్తిస్తున్నాడని కేసులు పెట్టి క్షమాపణా పత్రంపై సంతకం చేయించుకున్నారు. ఒక గ్లకోమా రోగి నుండి కోవిద్-19 లి వెన్‌లియాంగ్‌కు సోకగా అతడు ఫిబ్రవరి 7, 2020 నాడు కన్ను మూసినాడు. ఈ సంఘటన స్థానికులలో అలజడి సృష్టించగా చైనా కమ్యూనిష్టు పార్టి అతడి కుటుంబానికి క్షమాపణలు తెలిపింది".

అంతర్యామి అన్నాడు- "చైనా రాజకీయ వ్యవస్థ నిర్మాణం అటువంటిది. స్థానిక సంస్థలు పైనుంచి వచ్చిన ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తాయే కాని స్వయంగా నిర్ణయాలు తీసుకోలేవు.

2002లో SARS (Severe Acute Respiratory Syndrome) వచ్చినప్పుడు చైనాలో అధికారం జియాంగ్ జెమిన్ (Jiang Zemin) నుంచి హు జింతావొ, వెన్ జియాబావొల చేతుల్లోకి వెళ్లింది. అప్పుడూ వ్యాధి తొలి దశలో స్థానిక సంస్థలు సమాచారాన్ని తొక్కిపట్టిన్నాయి. గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్సు నుండి (Guangdong) వ్యాధి బీజింగ్‌కు వ్యాపించేసరికి ఆందోళన మొదలయ్యింది. వెన్ జియాబావొ (Wen Jiabao) 2003లో ప్రధానమంత్రి అయినాడు. వు యి (Wu Yi) వైద్యశాఖామంత్రిణి కాగా వాంగ్ క్విషాన్ (Wang Qishan) బీజింగ్ మేయర్ పదవిని చేపట్టి కొత్త సంస్కరణలు తీసుకురాగా SARS అదుపులోకి వచ్చింది".

యల్లెస్సారిన్ అన్నాడు- "USAలోని CDC (Centre for Disease Control and Prevention) మోడల్‌లో చైనా కొత్త ఆర్గనైజేషన్‌ను ఏర్పాటు చేసుకున్నది. SARS లాంటి Pandemics రాకుండా చేయడం దాని ఉద్దేశం.

అయితే రాజకీయం (Politics) అనేది చైనా దైనందిన జీవితంలో ఒక భాగం. చైనాలో సాహిత్యం, రాజకీయాలను విడదీసి చూడడం కష్టం. వుహాన్‌లో కోవిద్-19 విస్తృతంగా వ్యాపిస్తున్నపుడే అక్కడ వుహాన్, హుబెయి ప్రావిన్సులలో పార్టీ సమావేశాలు విస్తృతంగా జరిగాయి. జనవరి ఆఖరి వారంలో చైనా కొత్త

సంవత్సరం సెలవులకు దాదాపు అయిదు మిలియన్ల జనం వుహాన్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు.

15 జూన్ 1953 నాడు యాన్‌షువాన్ ప్రాంతంలో జన్మించిన షి జిన్‌పింగ్ (Xi Jinping) 2013లో చైనా అధ్యక్షుడైనాడు. జర్మన్ వార్తాపత్రిక Der Spiegel కథనం ప్రకారం– షి జిన్‌పింగ్ ప్రపంచ ఆరోగ్యసంస్థ అధ్యక్షుడు టెడ్రోస్ అధ్నామ్ (Tedros Adhnom) పై ఒత్తిడి తెచ్చి కోవిద్–19 మహమ్మారిపై గ్లోబల్ వార్నింగ్‌ను ఆలస్యం చేయించాడని వ్రాసింది. WHO దానిని నిర్ద్వందంగా ఖండించింది.

రెన్ ఝిక్వియాంగ్ (Ren Zhiquiang) షి చెంగ్ (Xicheng) జిల్లాలో హువాయున్ గ్రూపు మాజీ చైర్మన్. అతడు చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ కోవిద్–19ను నియంత్రించడంలో వైఫల్యం చెందాడని విమర్శించడంతో, అతడిని పార్టీ నుంచి బహిష్కరించడమే కాక అతడిపై అవినీతి ఆరోపణలు మోపినారు" అన్నాడు యల్లెస్సారిన్.

అంతర్యామి అన్నాడు– "Community of a shared future for Mankind అనే చైనా లక్ష్యమల్లా Community of a shared Corona virus for Mankind గా మారిందా? విజిల్ బ్లోయర్సు, జర్నలిస్టులు (లి జెహువా, చెన్ క్వియుషి, ఫాంగ్ బిన్), లీగల్ స్కాలర్ షు షిజాంగ్ లాంటివారిని అదుపులోకి తీసుకున్నారు చైనాలో. ఎందుకని?

జనవరి 2020 నాటికే వైరస్ తీవ్రత గురించి తెలిసినా జనవరి 25, 2020 చైనా నూతన సంవత్సరం – వసంతోత్సవం 'Spring Festival' కావడంతో ప్రపంచం నలుమూలల్నుంచీ వచ్చే సందర్శకులకు చైనా ఆర్థికస్థితి గొప్పతనాన్ని ప్రదర్శించే ఉద్దేశంతో చైనా కమ్యూనిష్టు పార్టి (CCP), అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌లు కావాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ అధ్యక్షుడిపై ఒత్తిడి తెచ్చాడనేది ఆరోపణ. (కోవిద్–19 గ్లోబల్ వార్నింగ్ ప్రకటించడంపై)

జనవరి 15, 2020 నాడు చైనా–అమెరికాల మధ్య వాషింగ్‌టన్‌లో వ్యాపార ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఏప్రిల్ 27–28, 2018లో మోడి–షి జిన్‌పింగ్‌ల సమావేశం వుహాన్‌లో, తరువాత రెండవ శిఖరాగ్ర సమావేశం – మామల్లపురం, ఇండియాలో 11 అక్టోబరు, 2019 నాడు జరిగాయి. 22 సెప్టెంబరు 2019 నాడు Howdy Modi Summit టెక్సాస్‌లో, 24–25 ఫిబ్రవరి 2020న Namaste Trump కార్యక్రమం ఇండియాలో అట్టహాసంగా జరిగింది.

ఇంకా ఆ సంతకాల తడి ఆరకమునుపే మహానాయకుల మధ్య కరోనా కాలం మనస్పర్ధలను తెచ్చింది. వాణిజ్యపు ఆంక్షలు, సరిహద్దుల వద్ద ఘర్షణలు, పరస్పర ఆరోపణలు అగ్నిజ్వాలల్లా దహిస్తుండగానే, కరోనా విషవాయుగాడ్పుల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు.

**సెప్టెంబరు 13, 2020 మధ్యాహ్నం రెండు గంటలకు కరోనా వ్యాధిగ్రస్తులు**

| | వ్యాధిగ్రస్తులు | మరణాలు |
|---|---|---|
| ప్రపంచం | 2,89,83,731 | 9,25,376 |
| అమెరికా | 66,79,646 | 1,98,153 |
| ఇండియా | 47,64,786 | 78,727 |
| బ్రెజిల్ | 43,15,858 | 1,31,274 |
| రష్యా | 10,62,811 | 18,578 |
| చైనా | 85,184 | 4,634 |
| పాకిస్తాన్ | 3,01,481 | 6,370 |
| బంగ్లాదేశ్ | 3,37,520 | 4,733 |
| శ్రీలంక | 3,195 | 12 |
| ఇరాన్ | 4,02,029 | 23,157 |
| ఇటలీ | 2,86,297 | 35,603 |

పై పట్టికను చూడు, యల్లెస్సారిన్! ఇండియా త్వరలో ప్రథమ స్థానాన్ని చేరుకోబోతున్నది. 'కరోనా, క్యా కరోనా!' అన్న పరిస్థితుల్లోకి మనం వెళ్లబోతున్నామా? ప్రపంచంలో ఏ ఉత్పాతం వచ్చినా అది ప్రత్యక్షం గానో, పరోక్షంగానో మనలనే దెబ్బతీస్తున్నదా? ఏమిటీ దుస్థితి?" అన్నాడు దీనంగా అంతర్యామి.

అంతర్యామి అలా అంటున్నపుడే టెలివిజన్ తెరపై ప్రత్యక్షమయ్యింది గబ్బిలాల యువతి.

✧✧✧✧✧

**(జ్ఞానమంతా కాపీ కొట్టడం వలన వచ్చిందే!**
**ఒక్క మూర్ఖత్వమే సహజ గుణం! – హ్యూఘ్ కెర్ (Hugh Kerr)**

# 4. గబ్బిలాల యువతి
## (Bat-Woman)

**"గబ్బిలం కళ్లకు పగటి వెలుగు ఎలాగో, ఆత్మకు హేతువు లేదా కారణం అలాంటిది. అన్నిటికన్నా స్పష్టంగా కనిపించే వాటిని చూడడానికి ఛాందస మనసు అంగీకరించదు"** –అరిస్టాటిల్.

"కీచుమంటూ మూకుమ్మడిగా ఎగిరిపోయాయి గబ్బిలాలు ఆ గుహ నుంచి. ఆ శబ్దానికి ఒళ్లు జలదరించి గుండె ఆగినట్లనిపించింది. అక్కడంతా గబ్బిలాల పెంట వాసన. వాంతి వచ్చినంత పనయ్యింది"

"అంతర్యామీ! కాస్త ఆగు. కాస్త విశ్రాంతి తీసుకుందాం గుహ లోపలికి వెళ్లేముందు" అన్నాడు ఆయాసపడుతూ యల్లెస్సారిన్.

"అజంతా–ఎల్లోరా, అమర్‌నాథ్, బాదామీ, బాఘ్, ఒరాబర్, బెలం, భిమ్‌బెట్కా, బొర్రా, ఎలిఫెంటా, మహాకాళి, ఉదయగిరి, ఉండవల్లి గుహల్ని చూసాం మనం. ప్రాచీన శిల్పకళా నైపుణ్యాల్ని, నాగరికతల్ని పరామర్శించాం. మేఘాలయాలో క్రెమ్ మావ్‌మలుహ్, మాసాయి గుహల్లో సహజ శిల్పసౌందర్యాన్ని తిలకించాం. కాని ఈ గుహలోకి అడుగుపెట్టాలంటే భయం వేస్తున్నది" అన్నాడు అంతర్యామి.

"సిల్క్ రోడ్ ప్రారంభమయ్యే నగరం సియాన్ (Xian)లో చైనా తొలి చక్రవర్తి (259–210 BC) క్విన్ షి హువాంగ్ మృణ్మయ సైనికుల్ని (Terracotta Army) చూసాము గత సంవత్సరం. తరువాత టాంగ్ చక్రవర్తి జ్వాన్‌జాంగ్ (Xuanzong 685-762 AD) ప్రేయసి యాంగ్ గ్యుఫి (యాంగ్‌యుహువా) పాలరాతి శిల్పాన్ని సియాన్ – లి పర్వతాల వద్ద ఉన్న హువాక్వింగ్ ఉష్ణజలధారల (Huaquing Hot Springs) వద్ద చూసాము అక్కడే. ఇప్పుడు మనం సియాన్ నుంచి 1860 కిలోమీటర్ల దూరంలో ఉన్న యునాన్ (Yunnan) ప్రావిన్స్ రాజధాని 'కున్మింగ్' వచ్చాం. కున్మింగ్ (Kunming) పట్టణాన్ని వసంత నగరం (Spring City) అంటారు" వివరించాడు యల్లెస్సారిన్.

చైనాలోని నైఋతీ దిక్కున ఉన్న పర్వత ప్రాంతం యున్నాన్ (Yunnan). సియాన్ నుంచి మొదలైన సిల్క్‌రోడ్, బంగ్లాదేశ్‌లోని భితర్‌గర్ (Bhitargarh) చేరుకునే ముందు యున్నాన్ ప్రాంతం గుండా పోతుంది.

మానవుడు తొలిసారిగా తేయాకు చిగుళ్ల రుచి చూసిందిక్కడే. మబ్బులు కమ్మిన పర్వతాలకు (Yunling) దక్షిణాన ఉన్నందువలన ఈ ప్రాంతాన్ని యున్నాన్ అని పిలిచారు. యున్నాన్ Pure Tea ప్రపంచ ప్రసిద్ధికెక్కింది.

వియత్నాం, లావొస్, బర్మా (మైన్మార్) దేశాలు టిబెట్, గ్యుజొ, సిచువన్, గ్వాంక్షి చైనా ప్రావిన్సులు ఈ యున్నాన్ ప్రావిన్స్‌కు సరిహద్దులు.

3,90,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో జర్మనీ కన్నా పెద్దది, పదహారు భాషలు, 25 మైనారిటి తెగలు, టిబెటన్ సంస్కృతితో పరిఢవిల్లే షాంగ్రి-లా (Shangri-La), ప్రాచీన టీ-హార్స్ రోడ్‌గా ప్రసిద్ధికెక్కిన దక్షిణ సిల్క్ రోడ్ ఉన్నది యున్నాన్ ప్రాంతంలోనే.

యున్నాన్ ప్రాంతంలోని గుహలు అనేక రకాల గబ్బిలాలకు నివాస స్థానాలు. యున్నాన్ రాజధాని కున్‌మింగ్ (Kunming)కు ఇరవై కిలోమీటర్ల దూరంలో యాంజిడాంగ్ (Yanzi Dong-Swallo Cave) గుహ వాటిలో ఒకటి. సమీప గ్రామాల్లోని ప్రజలు గుహల్లోని రాళ్లను, స్టాలక్టైట్, స్టాలగ్మైట్ శిలలను పట్టుకుపోయి ఇళ్ల నిర్మాణంలో వాడుకుంటారు" అన్నాడు అంతర్యామి.

యున్నాన్ ప్రావిన్స్‌లో యాంజిడాంగ్, షిటొ (Shitou) గుహలకు దగ్గర్లో డాపెన్‌కొయు, తియాన్‌జింగ్ గ్రామాలున్నాయి. అక్కడ నుంచి కున్మింగ్‌కు దూరం 63 కిలోమీటర్లు. అక్కడ స్థానికుల సహాయంతో చెట్టుకు తాళ్లు కట్టి, హెడ్‌ల్యాంపు వెలుగులో గుహలోకి దిగడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

యాంజిడాంగ్ గుహలో కటికచీకటి - దుర్వాసన! గబ్బిలాలు తలల మీదుగా దూసుకుపోతుంటే ఒళ్లు జలదరిస్తున్నది. కింద నేలమీద బురద. హెడ్‌లాంపు వెలుగులో గబ్బిలాల పెంటపై జరజరా పాకుతున్న జెర్రులు, గుహ గోడల మీద నీలిరంగులో మెరుస్తున్న జలగలు.

అక్కడక్కడా చచ్చి పడున్న గబ్బిలాలు. వాటిని కప్పిన ఫంగస్. ఎగుర్తున్న రెక్కల పురుగులు; ఫంగస్ తినివేయగా మిగిలిన గబ్బిలాల అవశేషాలు, ఎముకలూ".

అంతర్యామి అన్నాడు– "ఈ ఫంగస్‌లో ఒకరకం హిస్టోప్లాస్మా కాప్సులేటమ్. ఇది సోకితే Caver's Disease అనే ప్రాణాంతకమైన వ్యాధి వస్తుంది. అటువంటిదే ఇంకోరకం సాంప్రదాయక వైద్యంలో అత్యంత ఖరీదైన Ophio Cordyceps Sinensis ఫంగస్–శిలీంద్రం. Swift moths లేదా Ghost moths గా పిలువబడే రెక్కల పురుగుల గుడ్ల నుంచి వచ్చిన లార్వాల (గొంగళిపురుగు) తలపై ఈ ఫంగస్ పెరుగుతుంది. బర్మా, టిబెట్, భూటాన్, నేపాల్ ప్రాంతాలలో ఈ లార్వా పురుగులు మట్టిలో నిట్టనిలువుగా ఉండి మొక్కల వేళ్లు తిని బతుకుతాయి. ఈ ఫంగస్ వాటి తలపై పొడుగ్గా 4–10 సెంటిమీటర్లు – పురుగంత పెరుగుతుంది. క్రమేపీ లార్వా శరీరం గట్టిపడి ఎండిపోగా లార్వా చనిపోతుంది. ఈ Caterpillar fungus ను డాంగ్ ఛాంగ్–సియాసావొ – Summer grass - Winter Worm (చైనీస్), యార్చా–గుంబా (నేపాలి), కీడాజాడి (బర్మా, ఇండియా) – అని పిలుస్తారు. ఇది హిమాలయ పరిసర ప్రాంతాల నాటువైద్యంలో అతి ఖరీదైన మందు. కిలోగ్రాము 'కీడాజాడి' ధర లక్ష నుంచి అయిదు లక్షల రూపాయలు పలుకుతుంది.

ఈ గుహలోని గబ్బిలాలలో కూడా SARS CoV ను పోలిన వైరసులు కనిపించాయి.

గబ్బిలాలు (Bats) 52–50 మిలియన్ సంవత్సరాల క్రితం పరిణామం చెందాయి. (Eocene Period) అదే కాలంలో భూమిపై ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. యాభై మిలియన్ సంవత్సరాల నాటి వైరసులు అప్పటి గబ్బిలాలలో వ్యాధిని కలిగించగా, కొన్ని వైరసులు గబ్బిలాల జన్యువులలో చేరి, వాటికి అపకారం కలిగించకుండా తరువాత తరాల గబ్బిలాలలో సహజీవనం గడుపుతూ ఉండాలి.

Bat కు Flutter Mouse అని, పురుగు (moth), రాత్రిపురుగు (Nocturnal insect) అని, Chiroptera అంటే (Chiro-hand) (Ptera-wing) రెక్కలు చేతులుగా గలది –అని పేర్లున్నాయి.

చైనాలో బియాన్‌ఫు (Bianfu) అంటే గబ్బిలం. Fu = good fortune (అదృష్టం). Red Bats = Wide spread good fortune; అయిదు ఆశీర్వాదాలు (Five Blessings) - 1) Longevity (చిరాయువు), 2) Wealth (ధనం), 3) Good health (ఆరోగ్యం), 4) Virtue (శీలం), 5) Peaceful Death (అనాయాస

మరణం). Bats + Swasthika (గబ్బిలాలు+స్వస్తికా చిహ్నం) = పదివేల ఆశీస్సులు అదృష్టానికి, సంతోషానికి గబ్బిలాలు ప్రతీకలు.

చైనాలోని నాటువైద్యాలలో– పంగొలిన్ పొలుసులు, గబ్బిలాల పెంటికలు, గబ్బిలాల శవాలపై పెరిగే ఫంగస్‌ను, Caterpillar fungus ను జ్వరాలను తగ్గించడానికి వాడతారు.

ఈ గబ్బిలాలు–వైరస్‌లపై పదహారు సంవత్సరాలు పరిశోధనలు చేసిన వైరాలజిస్టు షి జెంగ్లి (Shi Zhengli) (Born on 26 May, 1964). వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ డైరెక్టరు. అది Bio Safety Level-4 Lab.

డిసెంబరు 29, 2019 నాడు సాయంకాలం ఏడు గంటలకు షి జెంగ్లి సెల్‌ఫోను మోగింది. వుహాన్‌లో చాలామంది రోగులు Atypical Pneumoniaతో బాధపడ్తున్నారు. దానికి 2002–2003లో వచ్చిన SARS కు ఏమైనా సంబంధం ఉన్నదో కనుక్కోమని. షాంఘైలో మీటింగ్ అయిపోగానే వెంటనే ట్రెయిన్‌లో వుహాన్ చేరుకున్నది షి జెంగ్లి. ఆమె మనసులో ఆందోళన. ఈ వైరస్ తమ లాబ్ నుంచి తప్పించుకున్నదా?

Eco Health Alliance అనేది న్యూయార్క్‌లోని Non Profit Research Organization. దాని ప్రెసిడెంట్ Ecologist గా పేరొందిన Peter Daszak. SARS లాంటి కొత్త వైరసులు జంతువుల నుంచి మానవులకు సంక్రమించే ముందే వాటి గురించి తెలిసి వుంటే నివారణ సులభమనేది ఆ సంస్థ ఉద్దేశం. ఈ సంస్థకు ఆసియా, ఆఫ్రికా, యూరప్‌లలోని దాదాపు 30 దేశాల వైరాలజిస్టులతో సత్సంబంధాలు ఉన్నాయి.

2004లో షిజెంగ్లి చైనాలోని గ్వాంగ్‌షి రాజధాని నాన్నింగ్ (Nanning) దగ్గరున్న గుహలలో గబ్బిలాలకై వెదకినపుడు 30 గుహల్లో కేవలం పన్నెండు గుఱ్రపు నాడా గబ్బిలాలు కనిపించాయి. కాని గబ్బిలాలకు–వైరస్‌లకు ఉన్న లింకు దొరకలేదు. ఎనిమిది నెలలు శ్రమ తరువాత ఈ గబ్బిలాలలో SARS వైరస్ ఏంటిబాడీలు కనుగొనడంతో పరిశోధనలు వేగవంతమైనాయి.

వుహాన్ నుంచి యున్నాన్‌లోని కున్మింగ్‌కు మధ్య దూరం 1290 కిలోమీటర్లు (800 మైళ్లు) కున్మింగ్ దగ్గరున్న షిటౌ (Shitou) గుహలోని గబ్బిలాలలో

ఉన్న వైరస్ జీనోమ్‌లో 97 శాతం గ్వాంగ్‌డాంగ్‌లో ఉన్న SARS-Cov 1 వైరస్‌తో సరిపోల్చబడింది.

అక్టోబరు 2015లో షిటొ గుహకు దగ్గర్లో ఉన్న నాలుగు గ్రామాలలోని మూడు శాతం జనాభాలో SARS - like Corona Virus from Bats కు ఏంటిబాడీలు కనిపించాయి. ఈ పరిశోధనల వివరాలన్నీ Viruses and Nature Reviews Microbiologyలో ప్రచురింపబడినాయి.

షి జెంగ్లి డిసెంబరు 30, 2019 నాడు వుహాన్ చేరుకోగానే కొత్త వ్యాధి బారినపడిన రోగుల శాంపుల్స్ పరీక్షలు చేసినపుడు వాటిలో కరోనా వైరస్ జన్యు వరుసలు కనిపించాయి. కొత్త వ్యాధి కరొనా వైరస్ వల్ల అనేది నిర్ధారణ అయ్యింది.

వైరల్ జీనోమ్ సీక్వెన్స్‌లను తాము గబ్బిలాల నుంచి సేకరించిన వైరస్‌ల జీనోమ్‌లతో సరిపోల్చినపుడు వాటిమధ్య తేడా రావడంతో తమ పరిశోధన శాలలో ఉన్న వైరస్ ఈ కొత్త వ్యాధికి కారణం కాదని తెలవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

2005– SARS like Corona Viruses కు సహజ ఆశ్రయం గబ్బిలాలు అని కనుగొన్నది షి జెంగ్లి.

2008– Spike Protein కు ACE-2 రిసెప్టార్లకు మధ్య ఉన్న సంబంధాన్ని అధ్యయనం చేసింది ఆమె.

2017– యున్నాన్ గుహల్లోని వేలాది గబ్బిలాలలో ఉన్న SARS CoV వైరస్‌ల మిశ్రమ వైరస్ మానవుడిలో SARS వ్యాధిని కలిగించి ఉండవచ్చునని పరిశోధనా పత్రాలు ప్రచురించారు.

2020– ఫిబ్రవరిలో గబ్బిలాలకు–కొత్త కరొనా వైరస్‌కు ఉన్న సంబంధాన్ని తెలియపరచారు షి జెంగ్లి.

రెమెడెసివిర్, క్లోరోక్విన్‌లు ఈ వ్యాధి నివారణకు సమర్ధవంతంగా పని చేస్తాయని – Cell Research లో ప్రకటించారు. రెమ్‌డెసివిర్ పేటెంటు హక్కుల కోసం వుహాన్ వైరాలజి ఇన్‌స్టిట్యూట్ తరపున దరఖాస్తు పెట్టుకున్నారు.

"I swear with my life, the virus has nothing to do with my lab" - అని ప్రకటించింది షి జెంగ్లి.

పదకొండు మిలియన్ల జనాభాతో కళకళలాడే వుహాన్ నగరం 23 జనవరి 2020 నాడు లాక్‌డౌన్‌లోకి వెళ్లి ఏప్రిల్ 8వ తేదీన అన్‌లాక్ చేయబడింది. సామాజిక మాధ్యమాలలో ఆమెపై రేగిన గాలిదుమారం అంతాయింతా కాదు.

షి జెంగ్లి ఆ ఆరోపణలను ధైర్యంగా ఎదుర్కున్నది– 'గబ్బిలాల నుంచి కరౌనా వైరసులు భవిష్యత్తులో మరిన్ని ఉపద్రవాలను కలిగిస్తాయి. అవి మానవ జాతిని చేరే లోపునే మనం వాటిని కనుక్కొని అంతం చేయాలి" అన్నది షి జెంగ్లి.

గబ్బిలాలలో కనుగొన్న కరౌనా వైరస్ పేరు RaTG 13. దీని జన్యు వరుస SARS-Cov-2 కు దగ్గరగా ఉండడం గమనార్హం.

2015లో షి జెంగ్లి, రాల్ఫ్ S. బారిక్, వినీత్ D. మెనాచెరి, మరో పన్నెండు మంది సంయుక్తంగా చేసిన పరిశోధనలు Nature Medicine లో Hybrid Virus పేరున ప్రకటించారు. ఈ Chimeric Corona Virus (SH Co 14 - MA 15) మానవుల ఊపిరితిత్తులలోని కణజాలంలో కూడ వ్యాధిని కలిగించ గలదు" అని పేర్కొన్నారు.

ఈ పత్రాలు వెల్లడి కావడంతో, షి జెంగ్లి బృందం తయారుచేసిన హైబ్రిడ్ వైరస్ వుహాన్ పరిశోధనాశాల నుంచి బయటపడి ప్రస్తుత కల్లోలానికి కారణ మయ్యిందని చాలామంది అనుమానించారు. అనుమానం పెనుభూతమయ్యేసరికి కొత్త వైరస్ వుహాన్ వైరస్‌గా, చైనా వైరస్‌గా, Covid-19 గా, SARS Cov-2గా పిలవబడింది. ఈ అనుమానం నిజమయ్యిందా?

"చైనా వెళ్లి వచ్చాక మా అనుమానాలు మరింత బలపడినాయి" అన్నాడు యల్లెస్సారిన్.

✧✧✧✧✧

**(నీవు సంపూర్ణుడివి కావాలంటే ముందు దానిలో భాగంగా ఉండు; నిటారుగా నిలబడాలంటే ముందు కాస్త వంపుగా ఉండు; నిండుకుండగా నిలవాలంటే ముందు ఖాళీగా ఉండు; పునర్జన్మ కావాలంటే ముందు మరణించు; నీకన్నీ కావాలంటే ముందు అన్నీ వదులుకో!" – తావొ తె ఛింగ్ (Tao)**.

# 5. అనుమానం పెనుభూతం
## (Doubt is the Dreaded Demon)

**"నరకలోక ద్వారాలంత అసహ్యం నాకు,**
**హృదయంలో ఒకటి దాచుకుని పైకి వేరే మాట్లాడేవాళ్లంటే!"**

– హోమర్ – ఇలియాడ్

ప్రపంచంలోని అగ్ర నాయకులంతా 'అనుమానం' అనే కొండశిఖరంపై సమావేశమైనారు. ఒక్కో టేబుల్ వద్ద నలుగురు చొప్పున కూర్చుని వేర్వేరు భాషల్లో నవ్వుతున్నారు, తలపంకిస్తున్నారు. వీపుల వెనుక మిస్సైళ్లు దాచుకుని చేతుల్తో గులాబీలు ఇచ్చిపుచ్చుకుంటున్నారు. వాళ్ల నూనె పూసిన పెదాలపై నుంచి తేనె పూసిన మాటలు వస్తుంటే దగ్గర్లోనే ఉన్న మీడియా సోదరులు వాటిని వాళ్లవాళ్ల భాషల్లో వివిధ కోణాల్లో వ్యాఖ్యానిస్తున్నారు. శ్రమజీవుల స్వేదంతో ఫలించిన మధువును రకరకాల రంగుల గ్లాసులలో అందిస్తున్నారు మేధావులైన వెయిటర్లు. పావురాల వేపుడు నంచుకుంటూ, ప్రజా ప్రతినిధులు యుద్ధమనే లావణ్యవతి బెల్లీడాన్సును పరవశంగా చూస్తున్నారు. ఆమె సోయగాల నిండా కరోనా వైరసు మెరుపులూ, తళుకులే!

ఆ దృశ్యాలను వీక్షిస్తూ యల్లెస్సారిన్, అంతర్యామిలు ఆలోచనలో మునిగిపోయారు. అంతర్యామి అన్నాడు– "మేధావులకు సందేహాలెక్కువ. సాధారణుడికి సంశయాలు తక్కువ. మూర్ఖుడు మొండిగా పోతాడు, జ్ఞాని భయపడుతూ నడుస్తాడు. ఇటువంటి ఆపత్కాలాలలో, జ్ఞానం కన్నా అజ్ఞానమే మేలనిపిస్తున్నది".

యల్లెస్సారిన్ తల పంకించాడు అవునన్నట్లు– "సమాచారం లేకుండా సంబంధాలు ఏర్పడవు. గౌరవం లేని ప్రేమ నిలవదు. నమ్మకం లేని స్నేహం మిగలదు. నీకు అవసరమయినప్పుడు అగ్గిపుల్లయినా ఇవ్వనివాళ్లను రక్షించడానికి అగ్నివలయాలను దాటే సాహసం చేయడం అవసరమా? ఈ జీవన యానంలో నీవెవర్ని కలవాలో కాలం నిర్ణయిస్తుంది. నీ జీవితంలోకి ఎవరు రావాలో నీ హృదయం చెబుతుంది. నీతో ఎవరుండాలో అనేది నీ మనసు, ప్రవర్తన నిర్ణయిస్తాయి".

అంతర్యామి అన్నాడు– “ఈ కోవిద్–19 కాలంలో పెట్రేగిన భయాందోళనల వల్ల కొత్తకొత్త మానసిక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రతి వ్యక్తీ ఒక మాస్కు తగిలించుకుని కనబడుతున్నాడు. అదుగో భావన వస్తున్నది. తనకు తెలిసినవారమ్మాయి మానసిక పరిస్థితి గురించి నీతో మాట్లాడుతుందట!”

భావన వచ్చింది– “హలో యల్లెస్సారిన్, గుడ్‌మార్నింగ్ అంతర్యామీ! ఓ కప్పు కాఫీ ఇవ్వండయ్యా బ్రహ్మాచారులూ!” అన్నదామె నవ్వుతూ.

కాఫీ తాగుతూ అన్నది భావన– “నా చిన్ననాటి స్నేహితురాలి పేరు స్వేచ్ఛ. ఆమె భర్త ధర్మారావు ఈ కరోనా వ్యాధి బారిన పడి కన్నుమూసాడు. దాదాపు నెలరోజుల పాటు వెంటిలేటర్‌పై ఉన్నాడు కాని, ఫలితం దక్కలేదు. వాళ్లకు పిల్లలు లేరు. స్వేచ్ఛ ఇప్పుడు వాళ్ల తల్లిదండ్రులతో క్వారంటెయిన్‌లో ఉంటున్నది. వాళ్లూ వయసులో పెద్దవాళ్లే. మన దేశానికి స్వతంత్ర్యం వచ్చిన సంవత్సరంలో పుట్టారట వాళ్లు. స్వేచ్ఛ మానసిక పరిస్థితేం బాగోలేదు!”.

“సైకియాట్రిస్ట్‌కు చూపించారా?” అడిగాడు అంతర్యామి.

“చూపించారు. మందులు వాడుతున్నది గత వారం పదిరోజులుగా. కాని ఇంకా స్థిమితపడలేదు” అన్నది భావన. “ఆమె మాట్లాడుతున్నపుడు వీడియో తీసాను చూస్తారా!”

యల్లెస్సారిన్, అంతర్యామిలు ఆ వీడియో చూస్తున్నారు, స్క్రీన్‌పై స్వేచ్ఛ కనిపించింది.

చిందరవందరగా ఉన్న గదిలో మంచం పక్కనే ఉన్న కుర్చీలో ఒక మూలకు అటుతిరిగి కూర్చుని ఉన్నది స్వేచ్ఛ. భావన పిలిచింది ‘స్వేచ్ఛా! ఇటు చూడరా!’ అని. ఇటు తిరిగి మరుక్షణంలో తల తిప్పుకుంది స్వేచ్ఛ.

“ఏమిటి? ఈ గదిలో నన్ను బంధించారు మీరు? ఇది గది కాదు, పెద్ద సమాధి! ఈ ప్రపంచం నాది కాదు. ఇది వేరేలోకం! అంతా కొత్తగా ఉంది నాకు. ఇది నా దేహం కాదు. నేను నేను కాదు. నన్నెవరో నానుంచి వేరుచేసారు. అంతే! నాకేం పిచ్చి లేదు” అన్నది స్వేచ్ఛ. మరలా మౌనం.

యల్లెస్సారిన్ అన్నాడు– “అన్ని దుఃఖాలూ ఒకేసారి వరదలా ముంచెత్తినపుడు ధైర్యం కొట్టుకుపోతుంది. తాను ఒంటరినైపోయానన్న దైన్యం మనసునూ దేహాన్ని విడదీస్తుంది”.

భావన రెండో వీడియో ఆన్ చేసింది. స్వేచ్ఛ అంటున్నది– "ఈ యిల్లు ఎప్పుడు కూలుతుందో తెలీదు. అందరం చచ్చిపోతాం. ధర్మా చనిపోలేదా! నాకెవ్వరూ లేరు. అదుగో, చూడు, పైకప్పు నిండా నెర్రెలు. అది కూలినా నాకు భయంలేదు. నేనెప్పుడో చచ్చిపోయాను".

యల్లెస్సారిన్ అన్నాడు– "స్వేచ్ఛ చాలా దయనీయమైన పరిస్థితిలో ఉన్నది. ఈ లక్షణాలు Cotard delusion - భ్రాంతుల్లా ఉన్నాయి"

"ఈ మూడో వీడియో చూడు యల్లెస్సారిన్! సైకియాట్రిస్ట్ దీనిని Capgras Syndrome అన్నాడు" అని వీడియో ఆన్ చేసింది భావన.

"వాళ్లు మా అమ్మానాన్నా కారు. ఎవరో వాళ్లను మాయంచేసి వాళ్ల స్థానంలో వీళ్లను పెట్టారు. వీళ్లు నన్ను చంపేస్తారు" అంటూ వలవలా ఏడుస్తున్నది స్వేచ్ఛ. పక్కనే నిలబడి ఉన్న ఆమె తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయినారు.

అంతర్యామి అన్నాడు– "భావనా! ఆమె ఇప్పుడు తన గదిలోనే ఉన్నదా!".

"లేదు. నిన్ననే ఆమెను మానసిక వైద్యాలయంలో చేర్పించాను. ECT షాక్‌లిచ్చారు. మగతగా పడుకుని ఉన్నది!" అన్నది భావన.

అంతర్యామి అన్నాడు– "ఈ Cotard delusion ను Walking corpse syndrome - 'నడిచే శవం' అంటారు. వీళ్లు తమ శరీరం చచ్చిపోయిందని, కుళ్లి దుర్వాసన కొడ్తుందని భావిస్తూ, తాము అమరులమయ్యామని, ఈ కుళ్లు దేహంతో పనిలేదని భావిస్తారు. లేని దేహానికి ఆహారమెందుకని తినడం మానేస్తారు. దీనితోపాటు ఈ ప్రపంచం తమపై కుట్ర పన్నుతున్నదని, తన స్నేహితులు బంధువుల్ని ఎవరో కిడ్నాప్ చేసి వాళ్ల స్థానంలో నకిలీలను పెట్టారని భావిస్తారు. దీనిని Capgras Syndrome అంటారు".

యల్లెస్సారిన్ అన్నాడు– "ఈ కోవిద్–19 దెబ్బకు ఎన్నో తరాలుగా మనం నిర్మించుకుంటూ వస్తున్న రక్షణా దుర్గాలు కూలిపోయాయి. ఒకరిపై ఒకరికి అనుమానం పెరిగింది. ఈ మహమ్మారి ఎప్పుడు ముగుస్తుందో తెలియదు, మళ్లీ జీవితం ఎప్పుడు గాడిన పడుతుందో తెలియదు. ఇంత సందిగ్ధ స్థితిని ఎవరూ చూడలేదు. ఓరకంగా ప్రతి ఒక్కరూ, జోంబీలుగా, నడిచే శవాలుగా మారిపోయారు".

"అవును యల్లెస్సారిన్!" అన్నది భావన. "పిల్లలు పెద్దవాళ్ల పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంది. హాయిగా స్వేచ్ఛగా తిరిగే పిల్లలు గదుల్లో బంధింప

బడేసరికి ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ వ్యాధి తమపై ఎప్పుడు దాడి చేస్తుందో అని పెద్దవాళ్లు భయపడుతున్నారు. దాచుకున్న డబ్బులు అయిపోవస్తున్నాయి. ఇంటి పనులు చేసేవాళ్లు రావడం మానేసారు. క్వారంటెయిన్ ఆంక్షలను దాటి వలస కూలీలు స్వగ్రామాలకు వెళ్తూ నరకయాతన పడ్డారు. ప్రభుత్వాలు చేస్తున్న ప్రతి పనినీ కొందరు తమ వ్యక్తిగత స్వేచ్ఛకు అడ్డంకిగా భావించినారు. స్కూళ్లు మూసేసరికి పిల్లల చదువులకు ఆటంకం కలిగింది. చాలామంది ప్రైవేటు టీచర్లు, ఉద్యోగులు వీధిన పడ్డారు".

అంతర్యామి అన్నాడు– "ప్రజల ముఖాలపై చిరునవ్వు కరువైంది. వ్యాధి గురించి సామాజిక మాధ్యమాలలో, టివి విశ్లేషణలలో, పేపర్లలో ప్రతిరోజూ విరుద్ధ కథనాలు రావడంతో అందరిలో ఒక విధమైన గందరగోళం నెలకొన్నది.

వ్యాధిని నిర్ధారించే పరీక్షలు, రక్షణా మార్గాలు, మందులు అన్నిటిలోనూ ఒకే విధానం లేకపోవడంతో ఎవరికి తోచింది వారు చేసుకుంటూ పోతున్నారు. ఇక పాజిటివ్ వచ్చిన వాళ్ల పరిస్థితి దారుణంగా ఉంది. బతికున్నపుడు ఓ రకమైన ఐసోలేషన్, చచ్చిపోతే ఇంకోరకమైన ఐసొలేషన్. గౌరవంగా బతకడం, చావడం రెండూ అసాధ్యమవుతున్నాయిప్పుడు".

భావన అన్నది– "మొదట అందరం భయపడ్డాం. ఆ తరువాత నిర్లిప్తత. ఇప్పుడు విసుగు పుడ్తున్నది. చదివిందే చదివి, చూసిందే చూసి, విన్నదే విని, భయాన్ని మనసు లోతుల్లోకి తొక్కిపెట్టి, తొక్కిపెట్టి ఇప్పుడు పిచ్చ బోర్ కొడ్తున్నది. ఇన్నాళ్లూ సంపాదన పేరు మీద కాలాన్ని రకరకాలుగా మేనేజ్‌మెంటు చేసాం కదా! ఇప్పుడు ఎంత మేనేజ్ చేసినా కాలం మిగిలిపోతూనే ఉన్నది. ఎక్కడో కూసింత ఆశ. ఈ చీడ తొలిగిపోతుంది. ఈ పీడ నాశనమవుతుంది. ఈ పీడకల అంతమవుతుందని, కాని, యల్లెస్సారిన్! మళ్లా మాస్కుల్లేని ముఖాలను చూస్తామంటావా?".

యల్లెస్సారిన్ అన్నాడు– "మాస్కుల్లేనిదెప్పుడు మనకు? మాస్కు మీద మాస్కు మనకు ఊపిరాడకుండా చేస్తున్నది. ఒకసారి వేసుకున్నాక మాస్కు తీయడం చాలా కష్టం. గట్టిగా లాగితే చర్మంకూడా ఊడిరావచ్చు. మనం ఏది చూపించ దలుచుకోలేదో దానిపై మాస్కు కప్పుతాము. మనుషులు మారరు. మారేదల్లా మాస్కులే! నీ దగ్గర అద్దముంటే చూడు. నీ దగ్గరకు వచ్చిన ప్రతివ్యక్తి దగ్గరా నీవు మాస్కులు మారుస్తుంటావు. మనిషి పుట్టేప్పుడే పదివేల మాస్కులతో పుడతాడట!".

భావన అన్నది సాలోచనగా– “నిజం యల్లెస్సారిన్! విక్టర్ హ్యూగొ అన్నాడు– 'Virtue has a veil, vice a mask' - ‘శీలానికి మేలిముసుగు, వ్యసనానికి మాస్క్’. అయినా ఎంతకాలం ఈ మాస్కులను తొడగాలి? అలసట రాదూ! కొన్నాళ్లు పోతే మన నిజస్వరూపం అంతర్ధానమవుతుందేమో! బహుశా నన్ను నేను గుర్తు పట్టలేనేమో!”.

అంతర్యామి అన్నాడు– “అటు చూడండి! వీధిలో జనం రకరకాల మాస్కులతో తిరుగుతున్నారు. కొందరు చీరచెంగులు, కొందరు తువ్వాళ్లు, కొందరు జేబురుమాళ్లు, కొందరు సర్జికల్ మాస్కులూ, కొందరు N95 మాస్కులు ఇలా ఒక మాస్కుకు మరో మాస్కుకూ పొంతన లేదు. అయితే ప్రతి మాస్కు వెనకాల ఓ ముఖం, ప్రతి ముఖం వెనుకా ఒక కథ ఉంటుంది తరచి చూస్తే”.

భావన అన్నది– “ఈ ప్రపంచంలో స్నేహపూరితమైన మాస్కులు ధరించిన తోడేళ్లకు, గాయపడిన గొర్రెపిల్లలకు కొదవలేదు. జపాన్ దేశస్తులంటారు– ‘ప్రతి మనిషికీ మూడు ముఖాలుంటాయి. ఒకటి ప్రపంచానికి చూపించేది, రెండవది దగ్గర వాళ్లకు చూపించేది. మూడవది నీవు నీ మనసనే అద్దంలో చూసుకునేది”.

యల్లెస్సారిన్ అన్నాడు– “ప్రతిరోజూ వినవస్తున్న ఈ మరణమృదంగ ధ్వనులకు ప్రజలు వణికిపోతున్నారు. దానికితోడు డయాబెటిస్, రక్తపోటు, శ్వాసకోశ వ్యాధులున్నవాళ్లు కాస్త జ్వరం, దగ్గు, తుమ్ము వచ్చినా భయకంపితులవుతున్నారు. చిత్రకారుడి కుంచె పాతదై గరుకుగా మారిందేమో, ముఖంనిండా ముడతలు గీతలు. పైపెచ్చు మాస్కులతో వచ్చే ఇబ్బంది. రోజూ గుప్పెడు మందులు మింగు తున్నప్పుడు, జీవితం కత్తి అంచుమీద నడకలానే ఉంటుంది”.

భావన అన్నది– “ప్రేమ ఒక్కటే ఈ మాస్కులను తీసివేయగలిగిన వరం. ప్రేమ ఈ శాపగ్రస్థ జీవితాలను ప్రక్షాళన చేస్తుంది. బతకడానికి కావలసిన ధైర్యాన్ని, శక్తిని ఇస్తుంది. ప్రేమలేని లోకం ఓ మృతలోకం. క్వారంటెయిన్ ఆంక్షలను ఉల్లంఘించి స్వస్థలాలకు వెళ్లిపోతున్న వలస కూలీలను కాస్త పలకరించి, ఇంత ఆహారం పెట్టినప్పుడు వాళ్ల కళ్లలో వెలిగిన కాంతులు ఈ కరోనా చీకట్లను తొలిగించి వేసాయి. నాకనిపించింది కష్టాలలో ఉన్న వాళ్లకు కావలసింది ఇంత భరోసా. కాస్త ధైర్యం. కించిత్ మానవత్వపు ఓదార్పు”.

“చాలా బాగా చెప్పావు భావనా!” అన్నాడు అంతర్యామి. “ఇక్కడకన్నా అక్కడ ఇదే శ్రమతో ఎక్కువ సంపాదించి సుఖంగా ఉండవచ్చునని సరిహద్దులు దాటి దూరప్రాంతాలకు, దేశాలకు వలసపోతాం. ఇటువంటి ఉత్పాతాలొచ్చినప్పుడు

ఒయాసిస్సులన్నీ ఎండమావులవుతాయి. మళ్లా కాళ్లీడ్చుకుంటూ ఇంటిదారి పడతాము. జెయింట్‌వీల్ చక్రంపై సీటులో కూర్చున్నపుడు క్రింద పడిపోతామేనని కడ్డీని గట్టిగా పట్టుకుంటాం. చక్రభ్రమణాలలో ఉండే థ్రిల్ మరల మరలా కావాలనిపిస్తుంది. కాని పైనుంచి కింద పడితే ఏమవుతామోనన్న భయంతో గుండె డబడబలాడ్తుంది. జెయింట్‌వీల్ దిగి నేలపైకి అడుగుపెట్టినాక 'హమ్మయ్య' అని గట్టిగా ఊపిరి పీల్చుకుంటాం. ఇదీ అంతే! మృత్యుశీతల కరవాలం మెడదాకా వచ్చి మాయమవుతుంది. ప్రయాణం సాగుతూనే ఉంటుంది".

"మరీ దారుణమేమిటంటే అంత్యక్రియలు కూడా గౌరవప్రదంగా జరగక పోవడం. చాలా దేశాల్లో వైద్యసిబ్బంది, పర్యవేక్షకులు, పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులు రోగం బారినపడ్డారు. కొందరు ప్రాణాలు కోల్పోయారు. రేపు తమకూ అదే స్థితి పట్టవచ్చునని తెలిసి కూడా ప్రజలు వ్యవహరించిన తీరు చూస్తుంటే మానవత్వం దాదాపుగా మృగ్యమవుతున్న స్థితిని చూసి మనసు కలుక్కుమంటున్నది.

2003 సార్స్ వ్యాధి ప్రబలమైనపుడు బీజింగ్‌లో Xiaotangshan Hospital ను ఏడు రోజుల్లో కట్టినారు. 2020 ఫిబ్రవరి నెలలో కరోనా వైరస్ పేషంట్ల కోసం వేయి పడకల ఆస్పత్రిని పదిరోజుల్లో (Huosheshan Hospital) వుహాన్‌లో నిర్మించినారు. అటువంటి వ్యవస్థ ఉండడం వల్లనే చైనాలో వ్యాధితీవ్రత తక్కువగా ఉన్నదా?

అప్పటికే వుహాన్ నుంచి అయిదు మిలియన్ల జనం ఇతర ప్రాంతాలకు, దేశాలకు వెళ్లిపోయారు. చైనాలో వ్యాధిగ్రస్తులు 85,202; మృతుల సంఖ్య 4634. తక్కువగానే ఉన్నా ఇవ్వాళ సెప్టెంబరు 15, 2020 నాటికి ప్రపంచంలో వ్యాధిగ్రస్తుల సంఖ్య 2,94,66,633; మరణాలు– 9,33,150 కు చేరుకున్నది. ఇండియాలో వ్యాధిగ్రస్తులు 49,63,097, మరణాలు 81,168. చైనాలో వ్యాధిగ్రస్తుల, మరణాల సంఖ్య చాలా తక్కువగా ఉండడానికి కారణమేమిటి? ఈ వైరస్ హైబ్రిడ్ వైరస్ కావడమేనా? చైనీయులను రక్షించి ప్రపంచాన్ని వణికించడమే ఈ జీవాయుధం లక్ష్యమా! అనే అనుమానం అందరినీ పీడిస్తున్నది."

✧✧✧✧✧

**(నీ హృదయంలోకి చూసుకో దృష్టి స్పష్టంగా ఉంటుంది. బాహ్యదృష్టి స్వప్నాలనిస్తుంది. అంతర్దృష్టి మెలకువను కలిగిస్తుంది" –కారల్ జంగ్ (Carl Jung)**

# 6. మందో రాజా భవిష్యతి!
## (Drug is the Future!)

**"మెడిసిన్ (మందు) అనేది బంగారు బాతు. అది బంగారు గుడ్డు పెట్టినప్పుడల్లా ఎవరో ఒకరికి రోగం రావడమో, చావడమో జరుగుతుంది. అలాంటి బాతును చంపడమే ఉత్తమం"** – రిఛర్డ్ దయాజ్.

డిసెంబర్ 2019లో హాంకాంగ్ నుంచి మెయిన్‌లాండ్‌కు వెళ్లి అక్కడ పరిస్థితి గురించి హెచ్చరికలు చేసిన Whistle Blower డాక్టర్ లి మెంగ్ యాన్ (Li Meng Yan) ఇప్పుడు అమెరికా చేరుకున్నది. ఆమె వైరాలజిస్టు. సెప్టెంబరు 11, 2020 నాడు ఆమె బ్రిటిష్ టాక్‌షో 'Loose Women' లో ఈ కోవిద్–19 వైరస్‌పై తాను చేసిన పరిశోధన ఫలితాలను తన పైఅధికారికి చెప్పినప్పుడు– 'Spring Festival' ముగిసేవరకు మౌనంగా ఉండాలని సలహా యిచ్చాడని డాక్టర్ లి మెంగ్ యాన్ వెల్లడించింది. "ఇది జంతువుల నుంచి మానవుడికి సంక్రమించిన Zoonoses వైరస్ కాదు. చైనా మిలిటరీ ఇన్‌స్టిట్యూట్ కనుగొని, మార్పుచేసిన CC45, ZXC41 ల మిశ్రమ వైరస్. దీనికి మనిషి నుంచి మనిషికి వ్యాపించే శక్తి ఎక్కువ. నా దగ్గర ఉన్న ఆధారాలను త్వరలో ప్రపంచం ముందుంచుతాను" అన్నదామె. "నాకు తెలుసు నా ప్రాణానికి హాని ఉన్నదని. నాలాగే విజిల్‌బ్లోయర్స్ చాలామంది అదృశ్యమైన సంగతి నాకు తెలుసు. అందుకే నేను ఈ దేశంలో తలదాచుకుంటున్నాను" ఇదీ వార్త!

స్వేచ్ఛ దగ్గరకు వెళ్లి వస్తానని భావన వెళ్లిపోయింది. మరుసటి రోజున యల్లెస్సారిన్, అంతర్యాములు టివిలో వార్తలు చూస్తున్నారు. ఆక్స్‌ఫర్డ్ వాక్సీన్, రష్యా వాక్సీన్, చైనా వాక్సిన్‌లు ఇప్పట్లో వచ్చేట్టు లేవు. ఇంతవరకు కోవిద్–19కు ఖచ్చితంగా పనిచేస్తుందన్న మందూ లేదు. ఈలోగా గేమ్ ఛేంజర్‌లుగా (Game Changers)గా పిలువబడిన అజిత్రొమైసిన్ (Azithromycin), క్లోరొక్విన్ (Chloroquin), ఐవర్‌మెక్టిన్ (Ivermectin), డాక్సిసైక్లిన్ (Doxycyclin), డెక్సామిథసోన్ (Dexamethasone), ఫావిపిరావిర్ (Favipiravir), రెమ్‌డెసివిర్ (Remdesivir), ప్లాస్మాథెరపీ, జింక్, విటమిన్ D3, కాల్షియం, మోనోక్లోనల్ ఏంటిబాడీలు, డాపాగ్లిఫ్లొజిన్, CD24FC, వెంటిలేటర్‌లు, ఎక్మొ (ECMO)లను

ట్రయల్ అండ్ ఎర్రర్ పద్ధతిలో వాడుతున్నారు. ట్రయల్స్‌లో వచ్చిన ఫలితాలు ఒకదానికొకటి విభిన్నంగా ఉండడం, దేనివల్లా కోవిడ్-19 తగ్గుతున్నదీ ఖచ్చితంగా చెప్పలేని పరిస్థితి. మళ్లీ అందరూ స్క్వేర్‌వన్‌కు చేరుకున్నారు.

ఎటువంటి కల్లోల పరిస్థితినైనా దందాగా, వ్యాపారంగా మార్చుకునే బిజినెస్ మ్యాన్‌లు, మోసగాళ్లు తమ ఆక్టోపస్ చేతుల్ని విస్తరిస్తున్నారు. నకిలీ వార్తలను ప్రసారం చేసి నిజమని నమ్మిస్తున్నారు. అరచేతిలో అద్దంలాంటి సెల్‌ఫోన్లలోని సామాజిక మాధ్యమాలలో స్వార్థానికి మాస్కులు తొడిగి కోవిడ్ వైరస్‌కు విరుగుడు సూత్రాల్ని వైరల్ చేసి లాభం పొందుతున్నారు.

యల్లెస్సారిన్ అన్నాడు- "మనమందరం స్వార్థపరులమే! మన క్రోమోజోముల్లోనే Selfish Genes (స్వార్థపు జన్యువులు) ఉన్నాయి. స్వార్థమే జీవ పరిణామానికి (Evolution)కు కారణమేమో! నిజమైన హేతువాదం స్వార్థమే! నిస్వార్థమూ, సేవ, స్వర్గం, సమానత్వం ఇవన్నీ మత ధర్మాలు".

అంతర్యామి తలపంకించాడు- "ప్రజలు తమ దగ్గర లేనిది ఇతరుల దగ్గర ఉంటే అసూయపడతారు. ఎదుటివాడు ఆనందిస్తుంటే ముఖం మాడ్చుకుంటారు. తమ దగ్గర లేనివి తమ దగ్గర ఉంటే వాటిని అందరితో పంచుకుంటామని ప్రగల్భాలు పలుకుతారు కాని తమ దగ్గర ఉన్నవాటిని పంచమంటే 'ససేమిరా వల్లకాదు' అంటారు".

యల్లెస్సారిన్ నవ్వాడు- "ప్రపంచం అంటే మాది ఇతరులకు 'పంచం' అని కొత్త అర్థం వచ్చినట్లుంది. పాత పంచభూతాలు కలుషితమై కొత్త భూతాలైనాక అంతా అస్తవ్యస్త ప్రపంచమైందిప్పుడు. ఈ లాక్‌డౌన్, ఐసొలేషన్ ప్రపంచానికి మేధావులు, రాజకీయ వేత్తలు అప్పుడప్పుడూ Game Changers ను ప్రకటిస్తుంటారు. మేమే ఈ మందులు వాడుతున్నాం మీకేం భయం లేదని ప్రకటనలిస్తారు.

మార్చి 19, 2020 నాడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump) ప్రకటించాడు- 'క్లోరోక్విన్ మాత్రలు ఈ కోవిడ్ గేమ్‌ఛేంజర్' అని. 'నేనూ తీసుకుంటున్నాను, మీరూ తీసుకోండి! కోవిడ్ భూతం ఇలా వచ్చి అలా పారిపోతుంది దీని దెబ్బకు అయినా!' అయినా 'What the hell do you have to

lose?' అన్నాడు. అట్లాగే రష్యా అధ్యక్షుడు పుతిన్ రష్యా వ్యాక్సీన్‌ను ప్రమోట్ చేస్తూ 'మా అమ్మాయి తీసుకున్నది ఈ వ్యాక్సీన్. మీకూ రక్షణనిస్తుంది. కోవిద్‌బారి నుంచి' అని టి.విలో ప్రకటించాడు. భారతదేశపు ఆరోగ్యశాఖామంత్రి డాక్టర్ హర్షవర్ధన్ కోవిద్-19 వ్యాక్సీన్ వచ్చినపుడు తానే ముందు వరుసలో ఉండి తీసుకుంటానన్నాడు".

అంతర్యామి అన్నాడు- "మనం ఈ మందుల గురించి చర్చిద్దాం. అజిత్రొమైసిన్, క్లోరోక్విన్ మందులు కలిపి తీసుకుంటే గుండెదడ, హార్ట్ ఎటాక్ వస్తాయని నిపుణులనడంతో రెండవచూపు (Second Look) మొదలైంది. మిగతా మందుల పరిస్థితీ అంతే!

31 డిసెంబరు 2019 నాడు వుహాన్ మున్సిపల్ హెల్త్ కమిషన్, తమ హాస్పిటల్స్‌లో న్యుమోనియా కేసులు ఎక్కువ సంఖ్యలో ఉండడాన్ని 'WHO' - ప్రపంచ ఆరోగ్యసంస్థకు రిపోర్టు చేసింది.

12 జనవరి, 2020 నాటికల్లా Covid-19 Genetic Sequence ను అన్ని దేశాల పరిశోధనాశాలలకు అందుబాటులో ఉంచింది చైనా.

30 డిసెంబరు 2019 నాడు Bat Woman షి జెంగ్లి కొత్త వైరసుపై పరిశోధనలు మొదలుబెట్టింది. జనవరి 21 కల్లా రెమ్‌డిసివిర్ మందును కోవిద్-19 వ్యాధి నివారణలో వాడేందుకు పేటెంట్ కోసం దరఖాస్తు పెట్టుకున్నది వుహాన్ వైరాలజి ఇన్‌స్టిట్యూట్ పేరుమీద. మరీ ఇంత 'ఫాస్టా' అని ప్రపంచం అదిరిపోయింది, ఆశ్చర్యపోయింది.

గిలియాడ్ రెమ్‌డిసివర్ ఒక్కో ఇంజక్షన్ ఖరీదు- 520 డాలర్లు. ఆరు ఇంజక్షన్లకు 3120 డాలర్లు. దాదాపు రెండులక్షల యాభై వేల రూపాయలు. దానిని సిప్లా కంపెనీ జనరిక్‌గా ముప్పై వేలకు (6×5000) అందజేస్తున్నారు. గిలియాడ్ లక్ష్యం సంవత్సరంలో 3 బిలియన్ డాలర్లు (ఇరవై వేల కోట్ల రూపాయలకు పైనే), ఏడేళ్లలో పదిహేను బిలియన్ డాలర్లు రెమ్‌డెసివిర్‌తో సంపాదించాలనేది గిలియాడ్ లక్ష్యం".

అంతర్యామి మాట్లాడుతుండగానే భావన వచ్చింది. యల్లెస్సారిన్ అడిగాడు స్వేచ్ఛ ఆరోగ్య పరిస్థితి గురించి.

"ఇప్పుడు కొద్దిగా మెరుగనిపిస్తున్నది. ధర్మారావుకు కోవిడ్ పాజిటివ్ వచ్చిప్పుడు స్వేచ్ఛకు, స్వేచ్ఛ తల్లిదండ్రులకు టెస్టులు చేస్తే నెగెటివ్ వచ్చాయి. ధర్మారావుకు రెమ్‌డెసివిర్ ఇంజక్షన్‌ను ఇచ్చారు. ప్లాస్మా ఎక్కించారు. చివరకు వెంటిలేటర్ మీద పెట్టారు. కానీ ఫలితం లేకపోయింది. స్వేచ్ఛ, ధర్మారావులు టీచర్లు. కరోనా కాలంలో వలస కార్మికులకు ఎంతో సేవ చేసారు. తమ మిత్రులతో కలిసి బృందంగా ఏర్పడి శిబిరాన్ని ఏర్పాటు చేసి దాదాపు నెలరోజులపాటు స్వంత రాష్ట్రాలకు నడచివెళ్తున్న వలస కూలీలకు ఆహారం రవాణా సౌకర్యాలు కలిపించారు. శిబిరం ముగిసాక ఇంటిదగ్గరే ఉన్నారు. ఎట్లా సోకిందో తెలియదు కాని రెండు నెలల క్రితం రెండురోజుల వ్యవధిలో ఇద్దరికీ జ్వరం వచ్చింది. ఐసోలేషన్, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ మందులతో తగ్గినట్లే తగ్గి వారం తరువాత ధర్మారావుకు మళ్లీ జ్వరం వచ్చింది. ఈసారి పేరున్న కార్పొరేట్ హాస్పిటల్‌లో పరీక్షలు చేయించుకున్నారిద్దరూ. ధర్మారావుకు పాజిటివ్, స్వేచ్ఛకు నెగిటివ్ వచ్చింది. HRCT Chest లో తేడా రావడం, ఆక్సిజన్ శాచురేషన్ 94 శాతానికి పడిపోవడంతో హాస్పిటల్‌లో ఎడ్మిట్ చేయాల్సివచ్చింది. నెలరోజుల పాటు జీవన్మరణాల మధ్య లోలకంలా ఊగిసలాడి, నాకేం కాదులే అని నవ్వుతూ ఐసిసియూలోకి వెళ్లినవాడు ఆరడుగుల తెల్లటి ప్యాకేజీగా బయటకు వచ్చాడు. ఇంటికి పోయే వీలు లేదు. స్వేచ్ఛ, ధర్మారావు తల్లిదండ్రులు, నేను, కొద్దిమంది మిత్రులం స్వేచ్ఛకు తోడుగా ఉన్నాం. బయట భోరున వాన. రోడ్లన్నీ జలమయం. హాస్పిటల్ బిల్లు చెల్లించేసరికి స్వంత ఇంటి కోసం దాచుకున్న డబ్బు అయిపోయింది.

అంబులెన్సు మాట్లాడుకుని ధర్మారావు వాళ్ల తల్లిదండ్రులున్న అద్దె ఇంటికి వెళ్లాం. అపార్ట్‌మెంట్ వాళ్లు అబ్జెక్షన్ చెప్పారు లోనికి తీసుకురావద్దని. ఇక్కడ అంతిమ సంస్కారాలు చేయవద్దని కాలనీవాళ్లు అడ్డుకున్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడిన వాళ్లకు పట్టిన దురవస్థను చూసి నాకు దుఃఖం పొర్లుకు వచ్చింది. స్వేచ్ఛ మూగదానిలా, శిలలా ఉండిపోయింది. ప్లాస్టిక్ కవర్లోంచి ధర్మారావు ముఖం మాత్రం మసకమసకగా కనిపిస్తున్నది.

నాకు తెలిసిన పోలీస్ అధికార్లతో చెప్పించి ఓ దహనవాటికలో అంత్యక్రియలు కానిచ్చాం. కొద్దిరోజులు మౌనంగా ఉన్న స్వేచ్ఛ తరువాత తనలో తానే మాట్లాడుకునేది. వెంటనే సైకియాట్రిస్టుకు చూపించాం. కొద్దిరోజులు బాగానే ఉంది. నాలుగైదు రోజులుగా ఆమె మానసిక పరిస్థితి పూర్తి అధ్వాన్నంగా మారింది. ఎప్పుడు బయటపడుతుందో ఏమో స్వేచ్ఛ ఈ డిప్రెషన్ నుంచి!".

వింటున్న యల్లెస్సారిన్, అంతర్యామిలకు గుండె బరువెక్కింది. "లోకం తీరు అంతేనేమో! ఎరిక్‌ఫ్రామ్ అంటాడు– 'స్వార్థపరులు ఇతరులను ప్రేమించలేరు, చివరకు తమను తాము కూడా!' ప్రతి పాపకార్యం స్వార్థంతోనే ప్రారంభమవుతుంది. స్వార్థం ఇతరులలో ఉంటే వాళ్లను ద్వేషిస్తాం, మనలో ఉంటే మనల్ని మనం ప్రేమిస్తాం. కాని ఆ ప్రేమ ఎంతోకాలం నిలవదు".

అంతర్యామి అన్నాడు– "కోవిద్–19 పాజిటివ్ వచ్చి సీరియస్ లక్షణాలు లేనివాళ్లకు Favipiravir టాబ్లెట్లు ఇస్తున్నారు. 200 మిల్లిగ్రాముల టాబ్లెట్లు – ఒక ప్యాక్‌లో 34 ఉంటాయి. ఖరీదు 3500 రూపాయలు. గ్లెన్‌మార్క్ కంపెనీ వాళ్ల అంచనా ప్రకారం 2021 ఆర్థిక సంవత్సరంలో ఓ డెబ్బై కోట్ల రూపాయలు రెమ్‌డెసివిర్ నుంచి, ఇంకో నూటయాభై కోట్ల రూపాయలు ఫావిపిరావిర్ నుంచి వస్తాయని ఆశావహంగా ఉన్నారు. ఈలోగా మనకు ఇరవై నాలుగు గ్రాముల ఫావిపిరావిర్ మింగి పర్సు బరువు పన్నెండువేలు తగ్గినాక మన జీవితాలు, డబ్బులు ఎంత బుద్బుదప్రాయమో మనకు అర్థమవుతుంది. ఫావిపిరావిర్, రెమ్‌డెసివిర్ అనే పేర్లు మన పుట్టినరోజుల కన్నా ఎక్కువ గుర్తుండిపోతాయి".

యల్లెస్సారిన్ అన్నాడు– "ఐవర్‌మెక్టిన్ అనే మందును గజ్జి (Scabies), నులిపురుగులు, రివర్ బ్లైండ్‌నెస్ లాంటి వాటికి నివారణగా వాడతారు. ఆస్ట్రేలియా, సింగపూర్ పరిశోధకులు ఈ మందుకు ఏంటివైరల్ గుణం ఉన్నట్లున్నదని ప్రకటించేసరికి లాటిన్ అమెరికా దేశాలలో ఆ మందు అమ్మకాలు అమాంతం పెరిగిపోయాయి. డోస్ ఎక్కువైతే ప్రమాదమని హెచ్చరించినా ప్రయోజనం లేకుండాపోయింది.

ఒలియాండ్రిన్ అనే మందును గన్నేరుచెట్టు నుంచి తయారుచేస్తారు. మనకు తెలుసు గన్నేరుపప్పు, ఆకులు తిని ఆత్మహత్య చేసుకున్నవాళ్ల గురించి. నాటువైద్యాలలో గన్నేరు మొక్కల్ని వాడేవారు. జులై 2020లో ఫీనిక్స్ బయొటెక్నాలజీ కంపెనీలో ఇంటరెస్ట్ ఉన్న My Pillow CEO మైక్ లిండెల్, డొనాల్డ్‌ట్రంప్ ప్రభుత్వంలో గృహనిర్మాణ సంస్థ సెక్రటరి బెన్‌కార్సన్‌లు ఈ ఒలియాండ్రిన్‌ను కోవిద్–19కు - Over the Counter (OTC) సప్లిమెంటరీ మందుగా వాడేందుకు అనుమతి కోరారు. 14 ఆగష్టు 2020న FDA రిజక్ట్ చేసింది. లేకపోతే డొనాల్డ్ ట్రంప్ మరో Game Changer ను ప్రకటించేవాడు. మైక్‌లిండెల్ తనకు Fund Raiser కదా!

ఇప్పుడు క్లోరోక్విన్ గొడవ! మార్చి 19, 2020 నాడు డొనాల్డ్ ట్రంప్ దీనిని By Prescription గా గేమ్ ఛేంజర్‌గా ప్రకటించాడు. క్లోరోక్విన్ తమకు పంపకపోతే సంబంధాలు దెబ్బతింటాయని ఇండియాను హెచ్చరించాడు. ఇండియా నెలకు వంద టన్నుల క్లోరోక్విన్ తయారుచేయగలదు. అది ఏడుకోట్లమందికి సరిపోతుంది. రిసొచిన్ (Resochin - 500 mg) టాబ్లెట్ ఖరీదు ఒక్కరూపాయి ఇండియాలో. అమెరికాలో ఒక్క టాబ్లెట్ పది నుంచి ఇరవై డాలర్లు (ఒక డాలరుకు 73 రూపాయలు). ధనమూలమిదం జగత్ అంటే ఇదేనేమో! భారత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 'కిట్ల'లో క్లోరోక్విన్ టాబ్లెట్లూ ఉన్నాయి. ఎడాపెడా మింగేసి హమ్మయ్య అనుకున్నాక తెలిసిందేమిటంటే ఈ క్లోరోక్విన్ మాత్రలు అనుకున్నంత గొప్పగా ఏమీ పనిచేయలేదని. ఈలోగా ప్రపంచ మార్కెట్లలో క్లోరోక్విన్ కొరత ఏర్పడింది. కాకపోతే ఇండియాలో ఏజెన్సీ ప్రాంతాలలో వర్షాకాలం ఏడిపించే మలేరియా ఈసారి వెనక్కి తగ్గింది. కీళ్లనెప్పులున్న వాళ్లకు ఉపశాంతి దక్కింది.

ఈలోగా ప్రెసిడెంట్ ట్రంప్ గారి చెవిలో వినబడింది– అల్ట్రావయొలెట్ కిరణాలకు వైరస్ మటుమాయమవుతుందని. మంచి ఉద్దేశంతోనే అన్నాడు– 'అందరినీ Ultraviolet కిరణాలతో స్నానం చేయిస్తే ఈ వైరస్ గొడవ పోతుంది కదా!' అంతకు ముందు ట్రంప్ ఆల్కహాలు బ్లీచ్ గురించి ఇటువంటి వ్యాఖ్యలే చేసినాడు. ఒకప్పుడు సీజనల్ జ్వరాలు వచ్చినప్పుడు బెట్నసాల్ (Betamethosone) చుక్కలు, గోలీలు వాడేవారు. కొందరిలో దుష్ఫలితాలు కనబడడంతో వాటిని ఆపేసారు. ఈసారి Dexamethasone వాడిన పేషంట్లలో (వెంటిలేటర్ మీద చికిత్స తీసుకుంటున్నవారు) మరణాల సంఖ్య గణనీయంగా తగ్గిందని ప్రకటించడంతో స్టెరాయిడ్ల వాడకం పెరిగింది. అయితే డయాబెటిస్ పేషంట్లలో గ్లూకోజ్ లెవెల్స్ విపరీతంగా పెరగడంతో వాళ్లకు ఇన్సులిన్ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది".

భావన అడిగింది– "ఈ ప్లాస్మా థెరపీ ఏమిటి?"

యల్లెస్సారిన్ చెప్పసాగినాడు– "వందేళ్లక్రితం నుంచే ఈ ప్లాస్మాథెరపి మొదలయ్యింది. ఫ్లూ వచ్చి తగ్గిపోయిన వాళ్ల రక్తంలోని ప్లాస్మాను విడదీసి వ్యాధిగ్రస్తులైన పేషంట్లకు ఇచ్చేవారు. కోవిద్–19 వ్యాధికి కూడా ఈ చికిత్స పనిచేస్తుందనేసరికి వేలాది రోగులకు ప్లాస్మాథెరపీ ఇవ్వబడింది. చివరకు

తేలిందేమిటంటే ఈ ప్లాస్మాథెరపి ఖచ్చితంగా పనిచేస్తుందనేది అనుమానమే అని. ఈలోగా ప్లాస్మాథెరపీ వ్యాపారస్తుల దృష్టిలో పడి ప్లాస్మా బ్యాంకులు ప్రారంభమయ్యాయి".

అంతర్యామి అందుకున్నాడు– "కొంతమంది రోగులకు Monoclonal Antibodies (Sarilumab, Tocilizumab, Lenzilumab) వీటి ధర యూనిట్‌కు ముప్ఫై వేలరూపాయల పైనే. కొన్ని హాస్పిటల్స్‌లో వీటిని వాడారు. నాలుగు నుంచి ఎనిమిది డోసులకయ్యే ఖర్చు రెండు మూడు లక్షలుంటుంది.

ఇవికాక ఇంటర్‌ఫెరాన్‌లు, సైటొకిన్ 1L-6 ఇన్‌హిబిటార్సు, హెపారిన్ లాంటి మందులు వైద్యుల పర్యవేక్షణలో వాడుతున్నారు. బతికినవాడిలో మందులు పనిచేయడానికి, బతకనివాడిలో పనిచేయకపోవడానికి కారణాలను మేధావులు విశ్లేషిస్తున్నారు. ఈలోగా ప్రపంచం ఆర్థిక మాంద్యం (Corona Recession)లోకి వెళ్ళిపోయింది. దీని నుంచి బయటపడేదెలా?"

✧✧✧✧✧

**('అంచుకు వచ్చి నిలబడు!**
**వస్తే పడిపోతాము!**
**అంచుకు వచ్చి నిలబడు!**
**వస్తే పడిపోతాము'**
**వాళ్లు అంచుకు వచ్చి నిలబడినారు...**
**అతడు వాళ్లను నెట్టగానే, రెక్కలు వచ్చి ఎగిరిపోయారు.**
**– గిల్లామె అపొల్లినెయిర్)**

# 7. ఆ ఒక్కటీ అడక్కు
## (Don't ask that one! Please)

**"క్రితంసారి ఆర్థిక మాంద్యం వచ్చినప్పుడు మనలో నూటికి తొంభై తొమ్మిదిమంది ఆర్థికంగా నష్టపోయారు. కాని, మిగిలిన ఆ ఒక శాతం మంది సంపద అయిదురెట్లు పెరిగింది. ఎందుకంటే వాళ్లు సృష్టించిందే కదా ఈ ఆర్థిక మాంద్యం!"** –జెస్సె వెంచురా (Jesse Ventura)

"చైనాలో అభివృద్ధిరేటు ఆరుశాతం కన్నా తక్కువగా ఉంటే అక్కడ ఆర్థిక ఇబ్బందులొచ్చి సమస్యలెదురవుతాయి. అయితే ప్రపంచంలో అయిదవ పెద్ద ఆర్థిక వ్యవస్థ కొనుగోలు శక్తిలో మూడవస్థానం, గత కాలంలో రెండు సహస్రాబ్దాల పాటు (ఒకటి నుంచి 19 శతాబ్దం వరకూ) అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలది, యాభైరెండు కోట్ల శ్రామికులుండి బొగ్గు, సిమెంట్, స్టీల్ ఉత్పత్తిలో ప్రపంచంలోనే రెండోస్థానంలో ఉన్నదేశం, 3.2 ట్రిలియన్ డాలర్ల Gross Domestic Product (GDP), 540 బిలియన్ డాలర్ల ఫారెన్ కరెన్సీ రిజర్వ్‌లు, 540 బిలియన్ డాలర్ల అప్పునూ మెయింటెయిన్ చేస్తున్న భారతదేశం ఇప్పుడు ఆర్థిక సంక్షోభంలోకి కొట్టుకుపోయింది. నాయకులెంత మేకపోతు గాంభీర్యంతో కనిపిస్తున్నా దేశపు ఆర్థిక గుండెచప్పుడులో తేడా వినిపిస్తున్నది. కోవిద్–19 వైరస్ దెబ్బకు ఆర్థిక రక్తనాళాల్లో ధనరక్తకణాలు గడ్డకట్టి ఎకనమిక్ హార్ట్ఎటాక్ వచ్చేముందు నెప్పి (Angina), ఆయాసం మొదలయ్యాయి. చప్పట్లు కొట్టడం, దీపాలు వెలిగించడం, పూలు జల్లడం, ప్రవచనాలు వీటితో లాభమేమీ రానట్లున్నది. అందరి చూపులూ వాక్సీన్ చక్రం వస్తున్న వేపే స్థిరమై ఉన్నాయి" అన్నాడు అంతర్యామి.

"ఎక్కడో విదేశంలో మనవాళ్లకు పింక్‌స్లిప్ వస్తే అది తాత్కాలికం. మనదేశంలో పొరుగువాడికి ఉద్యోగం పోతే అది డిప్రెషన్! అదే మన ఉద్యోగం పోతే అది ఆర్థిక వాయుగుండం. ఆర్నెల్ల నుంచీ అందరూ పనీపాటా మరచి ఇంట్లోనే టిక్‌టాక్‌లూ, పబ్జీలూ, టి.వి. సీరియల్సూ, ఎక్సర్‌సైజులు, భోజనాలతో ఎలాగోలా కాలం గడిపారు. ఇప్పుడు అప్పు పుట్టదు. ఉద్యోగం దొరకదు. ఖరీదైన అలవాట్లూ, సుఖాలూ ఇప్పుడు భారమై కూర్చున్నాయి. ఉద్యోగుల్ని పోషించడానికి ప్రభుత్వాలు కొత్తరకం టాక్సుల్ని కనుక్కుంటాయి. టాక్సుల్ని ఎగ్గొట్టడానికి ప్రజలు కొత్త దారుల్ని

వెదుకుతుంటారు. 2018-2019లో 3.29 కోట్ల ఇండియన్లు టాక్స్‌పేయర్లుగా నమోదయ్యారు. వీరిలో యాభై లక్షలపైబడి ఆదాయమున్నవాళ్లు 3,16,000. అయిదుకోట్ల కన్నా ఎక్కువ ఆదాయమున్న వాళ్లు కేవలం 8,600 మంది. నమ్ముతావా అంతర్యామీ!" అన్నాడు యల్లెస్సారిన్.

అంతర్యామి తలూపాడు- "ఇండియాలో 138 మంది బిలియనీర్లున్నారు. వీళ్ల సంపద 313 బిలియన్ డాలర్లు. చైనాలో 799 మంది, అమెరికాలో 626 మంది బిలియనీర్లున్నారు. ఈ ఆర్థిక మాంద్యం తగ్గగానే వీళ్ల సంపదలు మరింత పెరుగుతాయనేది ఒక అంచనా!

ఒకపక్క మూడు కోట్లమంది యువత ఉద్యోగాలు కోల్పోయింది. వాళ్ల లైఫ్‌స్టైల్ - జీవన విధానంలో ఊహించని దెబ్బ తగిలి, మానసికంగా, ఆర్థికంగా కుంగిపోతున్నారు. 2020-2021 ఆర్థిక సంవత్సరంలో GDP '0' నుంచి మైనస్ ఏడుశాతం పడిపోతుందనేది అందరినీ పీడిస్తున్న భయం.

చైనా ఇప్పటికే కోలుకున్నది. అక్కడ క్రమేపీ సాధారణ పరిస్థితి నెలకొంటున్నది. కాని ఇండియా ఇప్పుడు 'Catch-22' ఘట్టంలో ఉంది. వ్యాపారాలు మొదలైతే వ్యాధి తీవ్రత ఎక్కువ కావచ్చు. వ్యాధి తీవ్రత ఎక్కువైతే వ్యాపారాలు మూసివేయవలసి రావచ్చు' - దీంట్లో పారడాక్స్ ఏమిటంటే - వ్యాపారాలు మూతబడిన లాక్‌డౌన్ పిరియడ్ వ్యాధినేమీ ఆపలేకపోయింది. ఏనాడైతే కోవిడ్-19 వ్యాధి ప్రపంచవ్యాధిగా పరిగణించబడిందో ఆనాడే అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదేలు చేయగలదని అందరూ అనుమానించారు. ఐసొలేషన్, లాక్‌డౌన్, మందులు ఏవీ ఈ వ్యాధిని ఆపకపోయేసరికి ఇప్పుడు అందరూ వ్యాక్సీన్ దీపం కోసం చీకట్లో అల్లల్లాడుతున్నారు".

యల్లెస్సారిన్ అన్నాడు- "ఒకరోజు లాక్‌డౌన్ (Lock Down) నష్టమెంతో తెలుసా ఇండియాకు? ముప్ఫైరెండు వేల కోట్ల రూపాయలు (4.5 బిలియన్ డాలర్లు). 21 రోజులకూ 6,72,000 కోట్ల రూపాయలు దాదాపు వంద బిలియన్ డాలర్లు (94.5) ఇప్పటివరకు జరిగిన నష్టం రెండు ట్రిలియన్ డాలర్లకు పైనే! ఉద్యోగులకా జీతాలివ్వక తప్పదు. వారి ఆరోగ్యపు ఖర్చులు భరించక తప్పదు.

బతికుంటే బలుసాకు తిని బతకొచ్చు - 'జాన్‌హైతొ జహాన్ హై' అన్నాడు భారత ప్రధానమంత్రి 24 మార్చి 2020న లాక్‌డౌన్ విధిస్తూ; 11 ఏప్రిల్ 2020

నాడు 'జాన్ బీ జహాన్ భీ' – ప్రాణమూ ముఖ్యమే, బతకడమూ ముఖ్యమే – అన్నాడు. 11 మే 2020 నాటి ముఖ్యమంత్రుల సమావేశంలో 'జాన్‌సె లేకర్ జగ్ తక్' – మనిషి నుంచి మానవత్వం వరకూ మనం ఆత్మనిర్భర భారతదేశంలో పయనించాలి – అని అంటున్నాడిప్పుడు.

ఆర్థిక ఊబిలోకి దాదాపు ఇరవై లక్షల కోట్ల రూపాయలు (280 బిలియన్ డాలర్లు) పోసారు. తడి ఇసుకలో పొడి ఇసుక మునిగినట్లు ఇంకా ఆర్థిక వ్యవస్థ మునిగిపోతూనే ఉన్నది. జీవన కాంతిదీపాలు మిణుకు మిణుకుమంటున్నాయి".

అంతర్యామి సాలోచనగా అన్నాడు– "రాత్రి దీపాల (Night Lights Radiance) వెలుగుకు, ఆర్థిక స్థితికి అవినాభావ సంబంధముంటుందని విజ్ఞుల అభిప్రాయం. దేశపు జీవకళ మూడోవంతు తగ్గిందని ఓ అంచనా!

ఇప్పటి ప్రభుత్వపు Shock Tactics ఏమీ ప్రయోజనం చేకూర్చవు. Demonetization, GST, ఇవన్నీ అనుకున్న ఫలితాలనివ్వలేదు. ప్రస్తుత ప్రభుత్వానికి ఈ కరోనా మూడోదెబ్బ.

రాజీవ్ బజాజ్ అన్నట్లు– 'లాక్‌డౌన్ వల్ల ఇండియా బాగా బలహీనపడింది. ఈ కరోనా వైరస్ వల్ల ఇండియా తనని తాను అమ్ముకోవాల్సి వస్తుంది'. ఆనంద్ మహీంద్రా అన్నాడు– 'లాక్‌డౌన్ అనేది భారతదేశానికి 'హరాకిరి'. ఆత్మహత్యా సదృశం'. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి హెచ్చరించినట్లు– 'లాక్‌డౌన్ వల్ల వ్యాధికన్నా ఎక్కువ మరణాలు ఆకలి వలన సంభవిస్తాయి" అన్నాడు అంతర్యామి.

యల్లెస్సారిన్ అన్నాడు– "మనదేశంలో శ్రామికుల సంఖ్య యాభైకోట్లు. 44 శాతం వ్యవసాయరంగంలో, 31 శాతం సేవారంగంలో, 25 శాతం పారిశ్రామిక రంగంలో ఉన్నారు. వీళ్లలో 94 శాతం మంది అసంఘటిత కార్మికులే.

గవర్నమెంట్ ఉద్యోగులలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 33 లక్షల మంది. అదనంగా పధ్నాలుగు లక్షలమంది సైన్యం, 52 లక్షలమంది పెన్షనర్లు ఉన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో మొత్తం 2.15 కోట్లమంది ఉద్యోగులున్నారు.

ఇండియా GDP స్థూల జాతీయోత్పత్తి – 124.88 ట్రిలియన్ రూపాయలు. ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు 10 ట్రిలియన్ రూపాయలకు

పైగానే (8.15% of GDP). పెన్షనర్లకు ఇస్తున్న మొత్తం– లక్షా ఎనభైవేల కోట్ల రూపాయలు. ఉద్యోగుల జీతభత్యాలు– లక్షా అరవైవేల కోట్ల రూపాయలు.

మనే దేశాధ్యక్షుడి జీతం నెలకు అయిదు లక్షలు. ప్రధానమంత్రికి రెండు లక్షలు. M.P. జీతం లక్షరూపాయలు అక్షరాలా. రఘురామన్ అనే NATGRID చైర్మన్‌కు మాత్రం పదిలక్షలు అధికారికంగా ఇస్తున్నారు. గవర్నర్ జీతం మూడు లక్షలు.

ప్రైవేట్ సెక్టార్‌లో– ముఖేష్ అంబానీ జీతం సంవత్సరానికి పదిహేను కోట్లు. అయితే వీళ్ల జీతభత్యాలు చూడండి–

| | | |
|---|---|---|
| టెక్‌మహీంద్రా –గుర్రాని | – | 150.7 కోట్లు |
| అనిల్‌మణిభాయి నాయక్ (L&T) | – | 66.14 కోట్లు |
| కళానిధి మారన్ (Sun Group) | – | 62 కోట్లు |
| పవన్ ముంజాల్ (Hero Motocorp) | – | 60 కోట్లు |
| విశాల్ సిక్కా (Infosys) | – | 45 కోట్లు |
| నటరాజన్ చంద్రశేఖరన్ (TCS) | – | 25.9 కోట్లు |
| రాహుల్ బజాజ్ (Bajaj) | – | 25.59 కోట్లు |

అందర్లోకీ ముఖేష్ అంబానీకే తక్కువ అనిపిస్తుంది కదా. అతడి సంపదల విలువ 88.8 బిలియన్ డాలర్లు. అతడికన్నా గొప్పవాడు ఆచంటమల్లన్న – అమెజాన్ జెఫ్‌బెజొస్ (186 బిలియన్లు), బిల్‌గేట్స్ (124 బిలియన్లు), ఎలన్‌మస్ (108 బిలియన్లు), ఫేస్‌బుక్–మార్క్ జుకర్‌బర్గ్ (103 బిలియన్లు), బెర్రార్డ్ ఆర్నాల్డ్ (90.5 బిలియన్లు).

ప్రపంచంలోనే అత్యంత ధనికులైన CEO (Chief Executive Officers)లు (రూపాయలలో)

| | | |
|---|---|---|
| 1) థామస్ కురియన్ (Google Cloud) | – | 10,600 కోట్లు |
| 2) జయశ్రీ ఉల్లాల్ (Arista) | – | 9800 కోట్లు |
| 3) నికేష్ అరొరా (Palo Alto Networks) | – | 6000 కోట్లు |
| 4) అజయ్ బంగా (Master Card) | – | 5200 కోట్లు |

5) సత్య నాదెళ్ల (Microsoft) - 5100 కోట్లు
6) శంతను నారాయణ్ (Adobe) - 4500 కోట్లు
7) సుందర్ పిఛాయ్ (Alphabet) - 3300 కోట్లు

(గమ్మత్తేమిటంటే సుందర్ పిఛాయ్ జీతం 6,50,000 డాలర్లు, భత్యాలు-281 మిలియన్ డాలర్లు సంవత్సరానికి).

ప్రపంచంలో ఎక్కువ జీతం తీసుకునేవాళ్లు CEOలు.

Elon Musk (Tesla - CEO) – జీతం 595 మిలియన్ డాలర్లు
Tim Cook (Apple - CEO) – జీతం 134 మిలియన్ డాలర్లు

138 కోట్ల జనాభా ఉన్న భారతదేశపు ప్రధానమంత్రి జీతం సంవత్సరానికి ఇరవై నాలుగు లక్షలు; 144 కోట్ల జనాభా ఉన్న చైనా అధ్యక్షుడి జీతం పదిహేను లక్షలు; 33 కోట్ల జనాభా ఉన్న అమెరికా అధ్యక్షుడి జీతం – మూడు కోట్లు; 14 కోట్ల జనాభా ఉన్న రష్యా అధ్యక్షుడి జీతం - దాదాపు కోటి! (రూపాయల్లో). అర్థమవుతుందా నీకు!"

అంతర్యామి తలపంకించాడు- "ప్రపంచ జనాభాలో మూడవ వంతు లాక్‌డౌన్‌లోకి వెళ్లిపోయింది. విదేశాలకు వలసపోయిన వాళ్లు స్వంత ఊరు విడిచి వేరే ఊరు పోయినవాళ్లు ఇంటిదారి పట్టి నానా దెబ్బలు తిని స్వంత గూడు చేరుకున్నారు. ఈ కరోనా చీకటిరాత్రి ఇంత దీర్ఘంగా ఉంటుందని ఎవరూ అనుకోలేదు. ఇంటికి వెళ్లినవాళ్లు అక్కడ పరిస్థితి అధ్వాన్నంగా ఉండడంతో మరల తిరుగు ప్రయాణం మొదలెట్టారు.

2020లో రష్యా – సౌదీఅరేబియా ఆయిల్ ప్రైస్ వార్ వలన క్రూడాయిల్ రేట్ల పతనం, టూరిజం, హాస్పిటాలిటీ, సేవారంగాల్లో నిస్తబ్దత, కొనుగోలు శక్తి తగ్గుదల, విమానయానం దాదాపుగా నిలిచిపోవడం – ఇవన్నీ ఆర్థిక మాంద్యానికి దారితీసాయి.

2019లో Corporate Debt 51 ట్రిలియన్ డాలర్లు. లాక్‌డౌన్ ఇలాగే సాగితే వడ్డీలు కూడా కట్టలేని పరిస్థితి. బ్రెక్సిట్ (Brexit), చైనా-అమెరికా వాణిజ్య యుద్ధం, కరోనా వ్యాధి ఇప్పటి ఆర్థిక మాంద్యమనే అగ్నికి సమిధలైనాయి" అన్నాడు అంతర్యామి.

"Panic Buying వలన ఆహార పదార్థాలు, మందులు, మాస్కులు, పి.పి.యి. కిట్ల కొరత ఏర్పడింది. Supply Chains తెగిపోవడంతో ముడిసరుకుల కొరత ఎక్కువైంది. రవాణా వ్యవస్థ నాశనం కావడంతో Perishable Goods వ్యర్థమైనాయి. బ్లాక్‌మార్కెట్ Price Gouging (రేట్ల పెంపుదల) ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది.

ఆసియా అభివృద్ధి బ్యాంకు (ADB) అంచనా ప్రకారం కోవిడ్–19 వల్ల ప్రపంచంలో 8.8 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం వస్తుంది. ఇండియా ఆర్థిక వ్యవస్థ చిక్కుల్లో పడుతుంది. స్థూల జాతీయ ఉత్పత్తి తగ్గి వ్యయం పెరిగితే సంపాదన అంతా అప్పులపై వడ్డీలు కట్టడానికే సరిపోతుంది. కొత్తగా ఋణం పుట్టదు" అన్నాడు యల్లెస్సారిన్.

"ఈ కోవిడ్–19 తుఫానుకు కారణమైన చైనా పరిస్థితీ ఏం బాగున్నట్లు లేదు. వ్యాధిగ్రస్తులు, మరణాల సంఖ్య చాలా తక్కువగానే ఉన్నా – అక్కడా ప్రజల్లో భయాందోళనలు విపరీతంగా ఉన్నాయి. ఈమధ్య వచ్చిన వరదల వల్ల మరింత నష్టం జరిగింది. ప్రపంచమంతా చైనాను వెలివేసినట్లు చూడడం, ఇప్పటికే చైనా వస్తువులపై ఉన్న దురభిప్రాయాలు చైనా మార్కెట్‌ను దెబ్బతీసాయి.

'ఒకే చైనా' నినాదంతో హాంకాంగ్, తైవాన్‌లపై బిగిసిన పిడికిలి ఇప్పుడు కాస్త వదులైంది. భారత్‌తో సరిహద్దుల ఘర్షణ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. తాము పెట్టుబడి పెట్టిన దేశాలు ఆర్థిక మాంద్యానికి గురవడంతో వడ్డీ డబ్బులు కూడా వచ్చే ఆశలేదు. విదేశీ పరిశ్రమలొక్కొక్కటే వెళ్లిపోతున్నాయి. విద్యావంతులైన యువత మరింత స్వేచ్ఛను కోరుకుంటున్నారు. అయితే 4 ట్రిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలతో చైనా పటిష్ఠ స్థాయిలో ఉన్నది. తాను త్వరలోనే ఆర్థిక మాంద్యం నుంచి బయటపడగలనన్న ఆశ చైనాలో ఉన్నది" అన్నాడు యల్లెస్సారిన్.

భావన వస్తూ అన్నది– "అంతర్యామీ, యల్లెస్సారిన్! గుడ్ ఆఫ్టర్‌నూన్! హాస్పిటల్ నుంచి ఇటే వస్తున్నాను. స్వేచ్ఛ ఆరోగ్యం కుదుటపడినట్లనిపిస్తోంది. దగ్గరకు వెళ్లకూడదు కదా! చూడడమంతా కిటికీ అద్దాల్లోంచే. నర్సులు, డాక్టర్లు, విజిటర్లూ అందరూ పి.పి.యి. కిట్ దుస్తుల్లో గ్రహాంతరవాసుల్లా కనిపిస్తున్నారు".

అంతర్యామి అన్నాడు– "సామాజిక దూరం కోసమని చుట్టూ బోలెడన్ని వలయాలు గీసుకున్నాముగా. ఇప్పుడవన్నీ చెరిగి, అదృశ్యమైపోతాయా! అందరూ

వ్యాధిని పంచుకున్నట్లే, ప్రేమను, సంపదల్ని పంచుకుంటారా? శ్రమ విలువ పెరిగి ఒకరినొకరు గౌరవించుకుంటారా! వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకుని యుద్ధాలు మాటెత్తని కొత్త ప్రపంచం రానున్నదా! కోవిద్-19 లాంటి వైరసుల్ని, మస్టర్డ్‌గ్యాస్ లాంటి రసాయనాల్ని, అణుబాంబుల్ని తయారు చేయడం ఆపేసి మానవులంతా ఒకే తాటిపై నడుస్తూ భూతల స్వర్గాన్ని నిర్మించుకుంటారా? కోవిద్-19 సృష్టించిన విధ్వంసపు అగ్నిజ్వాలలుపశమించినాక, చల్లని ప్రేమగాలులు వీచి మానవత్వం పరిమళించనున్నదా!" అన్నాడు అంతర్యామి అరమోడ్పు కళ్లతో ఆకాశం వేపు చూస్తూ.

భావన, యల్లెస్సారిన్ ఒక్కసారిగా అన్నారు- "ఆ ఒక్కటీ అడక్కు!"

✧✧✧✧✧

**('నాకు కోపం, నాకు అయిష్టం, నాకు చిరాకు ఈ జలుబు - ఫ్లూ అంటే' - అన్నాడు అతడు.**

**డాక్టర్ సముదాయించబోయినాడు- 'కొంచెం ఓపిక ఉండాలి. జలుబుతో! వినలేదా మందులతో వారం, మందుల్లేకుండా ఏడు రోజుల్లో ఈ జలుబు తగ్గిపోతుందని'**

**'ఏదో ఒక సలహా ఇవ్వాలి మీరు' -అన్నాడతడు.**

**'అవును! అయితే చన్నీళ్లతో తలస్నానం చేసి, చల్లగాలిలో తిరుగు ఒక గంటసేపు!'**

**'అట్లయితే న్యుమోనియా వస్తుంది కదా!' అన్నాడతడు.**

**'దానికి మందున్నది మా దగ్గర' అన్నాడు డాక్టరు నింపాదిగా)**

# 8. అదృశ్య హస్తం - అక్షయపాత్ర
## (Invisible Hand - CORNUCOPIA)

**"ఏ వ్యక్తీ ఒక సంపూర్ణ ద్వీపం కాజాలదు (No Man is an island entire of itself). ఒక గొప్ప ఖండంలో భాగమతడు. మట్టిబెడ్డ సముద్రంలో కొట్టుకుపోయినా, యూరప్ అంతా అయినా నాకు ఒకటే. ఉన్నత శిఖరాలైనా, గొప్ప భవనాలైనా, నీ స్నేహితులవి, నీవి కూడా! మనిషి మరణం నన్ను కలవర పరుస్తుంది. ఎందుకంటే నేను మానవత్వంతో ముడిపడి ఉన్నాను. ఎవరికోసం మృత్యుఘంటిక మోగుతున్నదో నేను తెలుసుకోవడానికి ప్రయత్నించను. అది నీకోసమూ మోగుతుంది"** – జాన్ డొని (John Donne 1572-1631).

"మృత్యుఘంటికలు మోగుతున్నపుడు అతడు రక్తమోడుస్తూ దట్టమైన అరణ్యంలో నేలపై పడి ఉన్నాడు. సూదుల్లాంటి పైన్ ఆకులను కదిలిస్తూ అతడి గుండె శబ్దిస్తున్నది. అడవిని దగ్ధం చేసుకుంటూ వస్తున్న దావాగ్నిని తన శీతల దేహంతో కాసేపయినా ఆపాలని అతడి ప్రయత్నం. మానవత్వం గెలిచి సమసమాజం ఏర్పడుతున్న అద్భుత దృశ్యం కానవచ్చిందేమో అతడి కంటిపాపలు విప్పారినాయి. అతడి గుండెనుంచి ప్రవహించిన నిశ్శబ్దం అడవంతా పాకింది. అతడి శరీరం నుంచి వెలువడిన చల్లని గాలి దావాగ్నిని ఎదుర్కోడానికి ముందుకు దూకింది. అయినా ఇంకా తెల్లవారలేదు" యల్లెస్సారిన్ అన్నాడు– అంతర్యామీ, నాలుగు వందలేళ్ల క్రితం జాన్‌డొని వ్రాసిన కవితలోని 'For whom the Bell Tolls' అనే వ్యాక్యాన్ని ఎర్నెస్ట్ హెమింగ్‌వే (Ernest Hemingway 1899-1961) 1940లో ప్రచురింపబడిన తన నవలకు పేరుగా పెట్టాడు. ఆ నవల అతడికెంతో పేరు తెచ్చిపెట్టింది.

ఈ కోవిడ్–19 కాలంలో ఈ నవలతోపాటు ఆల్బర్ట్ కామస్ (Albert Camus 1913-1960) వ్రాసిన 'La Peste' (The Plague) నవలలు నన్నెంతో కలవర పరచాయి. The Plague నవల 1947లో ప్రచురించబడింది. ఇప్పుడున్న కోవిడ్–19 పరిస్థితిని ఈ నవల దాదాపుగా ప్రతిబింబిస్తుంది".

భావన, అంతర్యామిలు ఉత్సుకతతో అడిగారు– "ఇన్నేళ్ల తరువాత మరల పునరావృతమా? మనుషులు సమాజం మారలేదా?"–

యల్లెస్సారిన్ అన్నాడు– “ఈ కథను సంక్షిప్తంగా చెబుతాను విన్నాక మీరే చెప్పాలి మీ అభిప్రాయాన్ని.

ఒరాన్ అనే పట్టణంలో వందలాది ఎలుకలు ఎక్కడబడితే అక్కడ గిలగిలా కొట్టుకుంటూ రక్తం కక్కుకుని చచ్చిపోవడాన్ని డాక్టర్ బెర్నార్డ్ రీక్సు (Doctor Bernard Reiux) అనే వైద్యుడు గమనిస్తాడు. అతడి హెచ్చరికలను అధికారులు సీరియస్‌గా తీసుకోరు. వ్యాధి మనుషులకు సోకి ముప్ఫైమంది మరణించేసరికి ఆ పట్టణంలో లాక్‌డౌన్ ప్రకటిస్తారు.

లాక్‌డౌన్‌కు ముందే డాక్టర్ బెర్నార్డ్ భార్య శానిటోరియం వైద్యం కోసం వేరే పట్టణానికి వెళ్తుంది.

ఆ పట్టణంలోనే ఉన్న రేమండ్ రాంబెర్ట్ (Raymond Rambert) పారిస్‌లో ఉన్న తన భార్యను కలవడానికి పర్మిషన్ అడిగితే అధికారులు ఒప్పుకోరు. అందుకని అతడు పట్టణంలోని నేరస్తుల మాఫియాకు తనను పారిస్‌కు స్మగుల్ చేయడానికి డబ్బులిస్తాడు.

ఫాదర్ పానెలుక్స్ (Father Paneloux) అనే మతబోధకుడు తన ప్రాపకం పెంచుకోవడం కోసం ఈ వ్యాధి పాపులెక్కువ కావడంతో వచ్చిందని, అది పోవాలంటే సామూహిక ప్రార్థనలొక్కటే మార్గమని ఉద్బోధిస్తుంటే అతడికి అనేకమంది అనూయాయులేర్పడ్తారు.

కొట్టార్డ్ (Cottard) అనే నేరస్తుడు పశ్చాత్తాపంతో ఆత్మహత్య చేసుకోవాలని సంకల్పించి తరువాత మనసు మార్చుకుని స్మగ్లర్‌గా మారతాడు.

జీన్ టార్రొ (Jean Tarrou), ఇంజనీర్ జోసెఫ్ గ్రాండ్ (Joseph Grand), వైద్యుడు డాక్టర్ బెర్నార్డ్ రీక్సులు రోగులకు శాయశక్తులా సేవలనందిస్తుంటారు. రాంబెర్ట్ తను పట్టణం విడిచి పోవాలనుకుంటున్న సంగతిని ‘టార్రొ’కు చెబుతాడు. చాలామందికి అటువంటి ఉద్దేశమే ఉంది కాని ఇప్పుడు అది తప్పు అనడంతో రాంబెర్ట్ రోగులకు సేవలందించడానికి ముందుకు వస్తాడు.

ఆగష్టు నాటికి వ్యాధి తీవ్రతరమవుతుంది. పట్టణం నుంచి పారిపోయే వాళ్లను కాల్చివేయమని ఆదేశాలు జారీ అవుతాయి. అంత్యక్రియలు ఏ ఆర్భాటాలు లేకుండా జరగడం, కడసారి చూపు కూడా దక్కకపోవడం కొందరికి బాధ

కలిగిస్తుంది. ఒంటరితనం, సమాజం నుంచి వెలివేయబడిన పట్టణ ప్రజలుగా తాము పరిగణించబడడం అందరినీ కలచివేస్తుంది.

సెప్టెంబరు, అక్టోబర్‌లలో ప్లేగువ్యాధి తీవ్రతరమై మరణమృదంగ ధ్వనులతో పట్టణం భయకంపితంగా కాగా ప్రజలు వణికిపోతారు. తన భార్య ఆరోగ్య పరిస్థితి క్షీణించిందన్న వార్త విని డాక్టర్ దుఃఖభరితుడవుతాడు.

అక్టోబరు చివరివారంలో ఏంటి ప్లేగు సీరమ్ లభ్యమవుతుంది. ఫాదర్ పానెలుక్స్ కూడా వైద్యబృందంతో కలిసి పనిచేస్తాడు. ఒరాన్ పట్టణ మెజిస్ట్రేటు ఒథన్ (Othon) కుమారుడు, ఫాదర్ పానెలుక్స్‌లు వ్యాధితో కన్నుమూస్తారు. ఇంజినీర్ గ్రాండ్‌కు వ్యాధి సోకుతుంది కాని నయమవుతుంది.

జనవరికల్లా ప్లేగు తగ్గుముఖం పడ్తుంది. ఒథన్, టార్రొలు వ్యాధితో మరణిస్తారు. అక్కడ శానిటోరియంలో డాక్టర్ బెర్నార్డ్ రీక్సు భార్య చనిపోతుంది. ప్లేగు వల్ల లాభపడిన కొట్టార్డ్ వ్యాధి తగ్గుతున్నందుకు నిరాశపడతాడు.

ఫిబ్రవరిలో పట్టణం ద్వారాలు తెరుస్తారు. రాంబెర్ట్ పారిస్ వెళ్లి తన భార్యను కలుసుకుంటాడు. కొట్టార్డ్‌కు మతిస్థిమితం తప్పుతుంది. అతడిని పోలీసులు అరెస్టు చేస్తారు. ఇంజినీర్ గ్రాండ్ తన నవల పూర్తి చేయడానికి పూనుకుంటాడు. డాక్టర్ బెర్నార్డ్ రీక్సు ఈ కథని చెప్పినట్లు మనకు అవగతమవుతుంది.

"There are many things to admire in men than to despire"

1347-1351 మధ్యకాలంలో యూరప్‌లో పదికోట్ల మందిని పొట్టన పెట్టుకున్నది- The Black Death, The Dance of Death గా పేరుబడ్డ ప్లేగు వ్యాధి. దాని దెబ్బకు ప్రపంచ జనాభా 475 మిలియన్ల నుంచి 375 మిలియన్లకు తగ్గింది".

భావన అన్నది- "ఇప్పుడూ అదే పరిస్థితి. ఏడు వందల ఏళ్ల తరువాత కూడా మరల అదే కన్‌ఫ్యూజన్. అదే ఏమరుపాటు. అవే మనుషుల మనస్తత్వాలు".

అంతర్యామి అడిగాడు- "కోవిడ్-19 దెబ్బకు కుదేలయిన ఆర్థిక పరిస్థితిని ఏ అదృశ్య హస్తం చక్కదిద్దుతుంది? ఏ అక్షయపాత్ర నుంచి ప్రజలకు సంపదలను తిరిగి తెచ్చియిస్తుంది?".

యల్లెస్సారిన్ బదులిచ్చినాడు– "అంతర్యామీ! కాపిటలిజం, సోషలిజంల మధ్య పోటీ ఈ కోవిడ్–19 పుట్టుకకు కారణమనిపిస్తుంది. The Father of Capitalism, The Father of Economics గా పేరుగాంచిన స్కాటిష్ ఆర్థికవేత్త ఏడమ్ స్మిత్ (Adam Smith)– 'దురాశా రహితమైన స్వలాభం' (Enlightened Self-interest - do well by doing good) ఇతరులకు మేలుచేస్తూ తనకు కూడా మేలు చేసే అదృశ్యహస్తం (The invisible Hand)' అన్నాడు. (The theory of Morah Sentiments, 1759).

అమెరికన్ బిజినెస్ హిస్టారియన్ ఆల్ఫ్రెడ్ డి. ఛాండ్లర్ (Alfred D. Chandler Jr) 1977లో 'ఇప్పుడు మిడిల్ మేనేజ్‌మెంట్ అనే దృశ్యహస్తం– Visible Hand - అమెరికన్ ఆర్థిక వ్యవస్థలో అత్యంత శక్తివంతమైన సంస్థగా అదృశ్యహస్తాన్ని వెనక్కినెట్టింది' అన్నాడు.

రిఛర్డ్ నార్మండ్ లాంగ్‌లూయిస్ (Richard Normand Langlois) అనే ఆర్థికవేత్త – 'Visible Hand క్రమేపీ అదృశ్యమై మరల అదృశ్యహస్తం మార్కెట్ శక్తులను తన అధీనంలోకి తెచ్చుకుంటుంది' అన్నాడు.

పెట్టుబడీదారి వ్యవస్థ – కాపిటలిజమ్‌లో మరో ప్రధాన అంశం స్వేచ్ఛా వాణిజ్యం (Free Trade)" అన్నాడు యల్లెస్సారిన్.

భావన అడిగింది– "లైసెజ్–ఫెయిర్ అనే మాట తరచుగా వినవస్తుంది కదా, ఇదేమిటి?"

అంతర్యామి చెప్పాడు– "Laissez - Faire alone అనే ఫ్రెంచి పదానికి అర్థం– 'Let go, leave alone' అంటే స్వేచ్ఛావాణిజ్యం. ప్రభుత్వాన్ని ఆర్థిక వ్యవస్థను విడదీయాలి అనేది దీని అభిమతం.

1681లో ఫ్రెంచి కంట్రోలర్ జనరల్ జీన్ బాప్టిస్టె కొల్బర్ట్ (Jean Baptiste Colbert)కు వ్యాపారస్తుల మండలి అధ్యక్షుడు M. Le Gendre కు మధ్య జరిగిన సమావేశంలో ప్రభుత్వం మీకు ఎలా సహాయపడాలి అని అడిగినప్పుడు లె జెండ్రె (Le Gendre) అన్నాడు– 'Laissez-nous Faire - Leave it to us - Let us do it - Let go - మాపై నియంత్రణలు మాని మా వ్యాపారాల్ని మమ్మల్ని చేసుకోనివ్వండి' అని.

అందరికీ నచ్చింది ఆ సిద్ధాంతం. ఫ్రాన్సులో ధాన్యపు అమ్మకాలపై ఆంక్షలు తొలిగించారు. పంటలు పండినంత కాలం అందరూ ఆనందంగా ఉన్నారు. పదేళ్ల తరువాత కరవు వచ్చింది. తిండిగింజలు కరువై ప్రజలు ఆకలితో అల్లాడుతుంటే వ్యాపారస్తులు ధరలను పెంచేసారు. మరల ప్రభుత్వ జోక్యం తప్పలేదు. 1847లో జేమ్స్ విల్సన్ అనే ఆర్థికవేత్త వ్రాసినాడు– 'It is no man's business to provide for another' – 'ఎవడి తిండి వాడే సంపాదించుకోవాలి'. ఇటువంటి వాదనలే క్రమేపీ విప్లవాలకు నాంది పలికాయి. ఏమంటావు యల్లెస్సారిన్?" అడిగాడు అంతర్యామి.

"కోవిద్–19 చైనాలో పుట్టినట్లు ఈ స్వేచ్ఛావాణిజ్యం, Laissez Faire అనే మాట 'వు వెయి' (Wu Wei)గా చైనాలో కన్ఫ్యూషియస్ కాలం నుండే ఉంది.

Wu wei అంటే Inexertion, in action or efforless action. చైనా రాజనీతిలో ఇది ముఖ్యాంశం. సంయమనం పాటించడం దీని ఉద్దేశం. 771–476 B.C. 'Spring & Autumn Period'లో, కన్ఫ్యూషియస్ (551–479 B.C.) ఆలోచనలలో, తావొయిజపు (Taoism) (క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దం) భావనలలో వికసించిన ఆలోచన Wu wei.

జువాంగ్ జి (Zhuang Zi) పుస్తకంలో (476–221 B.C.) మాస్టర్ జువాంగ్ చెప్పినట్లు సరైన మార్గం (Way) - తావొ (Tao) చెబుతుంది–

– మానవ వ్యవహారాలపై ఆసక్తి చూపించకపోవడం

– కాని, మానవ వ్యవవహారాలను నియంత్రించగలగడం.

ఎవరి పనులు వాళ్లను చెయ్యనివ్వాలి. వాటితో సంబంధం లేనట్లే ఉండాలి కాని అవసరమైనప్పుడు నియంత్రించాలి. నాయకుడు అద్దంలా కాంతిని ప్రతిబింబించాలి. ఏమీ చేయకూడదు, సమతుల్యతను పాటించాలి. శూన్యత, నిశ్చలత, నిష్క్రియ (Emptiness, Stillness, non-action) ఈ మూడు తావొ–Tao మార్గపు లక్షణాలు.

తావొ అంటే Way-మార్గం అనేకాదు, అది డైరెక్షన్ (Direction). దిశానిర్దేశం. అది జ్ఞానమార్గం. ధారణ, ధ్యాన, సమాధి సంయమ భావనం.

ఇప్పుడు చైనా చేస్తున్నదదే. అక్టోబర్ 1, 1949 నాడు 'People Republic' గా మారింది. 1.4 బిలియన్ల జనాభా, తొంభై ఆరు లక్షల చదరపు కిలోమీటర్ల

విస్తీర్ణం, Unitary Marxist - Leninist One Party Socialist Republic - ఏక పార్టీ పాలన. 73.6 శాతం ప్రజలు మతాన్ని నమ్మనివారు (No Religion); ముప్ఫై ట్రిలియన్ల స్థూల వస్తూత్పత్తి (GDP), తలసరి ఆదాయం 21,000 డాలర్లు. 799 మంది బిలియనీర్లను సృష్టించిన దేశం ఇప్పుడు 'ఒకే చైనా' 'One China' నినాదంతో ముందుకు నడుస్తున్నది.

ప్రస్తుత చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ (Xi Jinping) - Socialism with Chinese Charecterstics for a new era - లో పధ్నాలుగు సూత్రాలను ప్రతిపాదించినాడు.

1) అన్ని రంగాలలో కమ్యూనిష్టు పార్టీ నాయకత్వం
2) ప్రజల కోసం ప్రజలే కేంద్రంగా వ్యవస్థ
3) సంస్కరణలను వేగవంతం చేయడం
4) సైన్సు పరిజ్ఞానాన్ని సర్వతోముఖాభివృద్ధికై వాడడం
5) ప్రజలే ప్రభువులు
6) చట్టం-న్యాయం సక్రమంగా అమలుచేయడం
7) చైనీయుల తత్వమున్న సోషలిజాన్ని అభివృద్ధి చేయడం
8) ప్రజల జీవనోపాధిని మెరుగు పరచడం ప్రథమ లక్ష్యం
9) ప్రకృతిని సంరక్షించడం
10) దేశ రక్షణా వ్యవస్థను మరింత బలపరచడం
11) చైనా ప్రజావిముక్త సైన్యంపై చైనా కమ్యూనిష్టు పార్టీకి పూర్తి అధికారం
12) 'ఒకే చైనా' పాలసీ.
13) శాంతియుత అంతర్జాతీయ వాతావరణంలో కామన్ డెస్టినీ (Common Destiny) అందరూ సుఖపడాలనే అంతిమలక్ష్యం వేపు పయనించడం
14) చైనా కమ్యూనిస్ట్ పార్టీలో క్రమశిక్షణను మెరుగు పరచడం

On the inevitability of Socialism (సమసమాజ స్థాపన) తప్పదు అని షి జిన్‌పింగ్ వ్యాఖ్యానించాడు. పెట్టుబడీదారీ వ్యవస్థ పతనం ప్రారంభమయ్యింది.

సోషలిస్టుల ముందడుగు మొదలయ్యింది. పాశ్చాత్య పెట్టుబడీదారీ వ్యవస్థ ఇప్పుడు ప్రతికూలతల నెదుర్కుంటున్నది. భవిష్యత్తును తాకట్టుపెట్టుకుని వాళ్లు పతనమవుతున్నారు. క్రమేపీ వాళ్లు చైనా రాజనీతి, ఆర్థిక మార్గం వేపు మళ్లతున్నారు. అంతర్యామీ, ఇప్పుడు చైనా అవలంబిస్తున్నది State Capitalism. పెట్టుబడీదారీ కాపిటలిస్టులు చూస్తున్నదీ ఆ దిక్కు వేపే!

కోవిద్–19 దెబ్బకు కాపిటలిస్ట్ వ్యవస్థలు కుదేలయిపోయినాయి. Black Death - ప్లేగు దెబ్బకు ఫ్యూడలిజం నుంచి క్యాపిటలిజం వ్యవస్థ రూపొందినట్లు, కోవిద్–19 విలయం తరువాత కాపిటలిజం స్థానంలో సోషలిజం లేదా చైనా మార్కు స్టేట్ కాపిటలిజం రానున్నదా?

ప్రభుత్వాలు తమ అక్షయపాత్రలైన బ్యాంకుల్లోకి ట్రిలియన్ డాలర్ల ధనాన్ని ఇంజెక్ట్ చేయడం ద్వారా ఈ ఆర్థిక మాంద్యాన్ని తమ అదృశ్య హస్తంతో కాపాడుకో గలుగుతాయా? 2008లో మార్కెట్లు దెబ్బతిన్నప్పుడు తీసుకున్న చర్యలు ఇప్పుడు పనిచేస్తాయా? పొదుపు సూత్రాలు, టాక్సులు, ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలు ఆర్థిక వ్యవస్థను బతికిస్తాయా?

Macquaire Wealth విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం– 'Conventional Capitalism is dying or atleast mutating into some thing closer to a version of communism' రాజరికం పోయి పెట్టుబడీదారీ వ్యవస్థ వచ్చింది. ఇప్పుడున్న యువతరానికి మార్కెట్ వ్యవస్థ రహస్యాలు తెలుసు. వారిని నియంత్రించాలంటే స్థానిక లక్షణాలున్న సోషలిజం అనగా స్టేట్ కాపిటలిజం ఒక్కటే శరణ్యమా? అక్షయపాత్ర ప్రభుత్వం చేతిలో ఉన్నపుడు అది ప్రజా ప్రభుత్వపు ముసుగు కప్పుకున్న రాజరికం కాదా! షి జిన్‌పింగ్ జీవితాంతం ప్రెసిడెంట్‌గా ఉండడానికి పదవీకాలంపై ఆంక్షలు ఎత్తివేయడంలో జూలియస్ సీజర్ పోకడలు కనిపించడం లేదా! కోవిద్–19 సృష్టిరహస్యం Laissez-Fair లేదా Wu-weiలో ఉన్నదా? ఈ మృత్యుఘంటికా ధ్వనుల మర్మమేమిటి?

✧✧✧✧✧

**("శూన్యం నుంచి అనంత ప్రపంచాల నిచ్చే మహామాత తావొ. అది నీలోనే ఉన్నది. నీకు నచ్చిన విధంగా వాడుకోవచ్చు నీవు" –తావొ తె ఛింగ్)**

# 9. ఎవరి కోసం మోగుతున్నాయీ మృత్యుఘంటికలు?
## (For Whom Tolls these Death Bells?)

**"మరణమంటే శూన్యం. దాని గురించి అతడికి ఏ మనోచిత్రమూ లేదు, భయమూ లేదు. బతకడమంటేనే కొండవాలులో వేగంగా వీస్తున్న గాలికి కొట్టుకుపోతున్న ధాన్యంలా అనిపిస్తున్నది. కాని, బతకడం అంటే గాలిలో డేగలా ఎగరడం. బతకడం అంటే కుప్ప నూర్చేప్పుడు ఎగిరే దుమ్ములో నీళ్లకుండలా నిలబడడం. బతకడమంటే నీ కాళ్ల మధ్య కొండలు, లోయలు, నదులు దాటుతున్న గుర్రం, కాలికింద లోడ్ చేసిన తుపాకీ ఉండి, కొండకవతలవేపుకు స్వారీ చేయడం".**

**"Oh, now, now, now, the only now, and above all now, and there is no other now but thou now and now is thy prophet".**

– ఎర్నెస్ట్ హెమింగ్‌వే (For Whom the Bell Tolls)

భావన అడిగింది– "ప్రవక్త ఇప్పుడు అవసరం ఉన్నది కరక్టే. కాని, ఇప్పట్లో కోవిద్–19 ముగిసేట్లు లేదుకదా! అంతేకాకుండా ప్రపంచంలోని దేశాల నాయకులంతా నియంతృత్వ పోకడలో పయనిస్తున్నపుడు బతకడమంటే భయమనిపించడం లేదా?"

అంతర్యామి ఆలోచిస్తూ అన్నాడు– "ఈ మహమ్మారి మూడు చిక్కుల్ని తెచ్చిపెట్టింది. 1) మనం దాచుకున్న డబ్బులు మాయమైపోయాయి. 2) ఇన్నాళ్లూ మనల్ని నడిపించిన ఆశ అదృశ్యమవడంతో ధైర్యం మనల్ని విడిచి వెళ్లిపోయింది. 3) ఇప్పుడు అంబులెన్సు శబ్దమన్నా, మరణ ఘంటికానాదాలన్నా భయం తగ్గిపోయింది.

అనాది కాలంలో ఎవరి తిండి వారు సంపాదించుకునేవారు. ఎవరి గుడిసె వాళ్లు వేసుకునేవారు. ఆ స్థితి నుంచి మనం అత్యంత సంక్లిష్టమైన మార్కెట్ వ్యవస్థలోకి వచ్చాం. అన్నిటికీ ఏదో రకమైన Supply Chain. లింక్ తెగితే గందరగోళమే! అన్నీ Processed, Controlled, Regularised జీవితాలే. ప్రతి దానికి ఓ Process - పద్ధతి. క్లాక్–వర్క్ (Clock-Work) జీవితాలు. ఏదో అదృశ్య

హస్తం, ఆకాశవాణి, అక్షయపాత్ర - ఉన్నట్లు; ఏదీ కనిపించదు. కనిపించీ వినిపించినట్లు అనిపించి వెదుక్కుంటూ వెళ్తాం! జీవితపు రహదారుల మీద ట్రాఫిక్ జాముల్లో ఊపిరాడదు. వ్యాపారం పేరు మీద ఒకరినొకరు మోసం చేసుకుంటాం. మన జీవితాల్ని స్టాటిస్టిక్స్ లెక్కల ప్రకారం క్రెడిట్, డెబిట్ కార్డులుగా మార్చుకుని అప్పుల ఊబిలో బతకడం అలవాటైపోయింది. అప్పుచేసి పప్పుకూడు, అప్పు తీర్చాలి కాబట్టి తప్పుకూడు తినడం సర్వసాధారణమైంది".

యల్లెస్సారిన్ అన్నాడు- "మార్కెట్ వ్యవస్థ, మతం రెండూ నమ్మకంపై బతుకుతాయి. కోవిడ్-19 లాంటి మహమ్మారులు సైతానులా వచ్చి సవాలు విసిరినపుడు నమ్మకం సడలిపోతుంది. అదృశ్య హస్తాలు పేదవాళ్ల జేబులు కొట్టి భాగ్యవంతుడి పర్సును నింపుతుంటాయి. ఎనభై రెండు కోట్లమంది ఆకలితో బక్కచిక్కి ఉంటే వాళ్లని బాలెన్స్ చేసే అరవై ఏడు కోట్లమంది ఊబకాయులున్నారు. నలభై శాతం ఉత్పత్తి చేయబడిన ఆహారం కుప్పతొట్టెల పాలవుతుంటే వాటి దగ్గరకు కూడా వెళ్లలేని పరిస్థితుల్లో పేదలున్నారు. కొనేవాళ్లు లేక కోళ్లను కోళ్లఫారాలలో చంపివేస్తున్నారు. పళ్లు, కూరగాయలు ఫ్లోరిడాలాంటి రాష్ట్రాలలో పొలాల్లోనే మగ్గిపోతున్నాయి. స్కూళ్లు, పార్కులు, రెస్టారెంట్లు మూసేసరికి బల్క్‌ఫుడ్ సేల్స్ తగ్గిపోయాయి.

విమానయానం, స్థానిక రవాణా వ్యవస్థలు మందగించడంతో క్రూడాయిల్ నిల్వలు పేరుకుపోయాయి. రష్యా-సౌదీ అరేబియాలో పోటాపోటీలో తగ్గిన ధరలకు తోడు, కోవిడ్-19 దెబ్బకు పెట్రోలు స్టొరేజిలు నిండిపోయి, సరఫరా నౌకలు తీరాల్లో నిలిచిపోయాయి. భారతదేశం కూడా క్రూడాయిల్‌ను నిల్వ ఉంచే మార్గాలు వెదుకుతున్నది".

భావన అన్నది- "ఒక్కోసారి నాకు భయం వేస్తుంది. ఈ ప్రపంచమంతా ఏకవ్యక్తి పరిపాలనలోకి వెళ్లిపోయినట్లు. అది సాధ్యమేనా?"

అంతర్యామి అన్నాడు- "సైన్సు అభివృద్ధి చెందుతున్న కొద్దీ ఆచారాలపై నమ్మకాలు సడలిపోయాయి. బహుదేవతారాధన ఉన్న మతాలు, పరస్పర సంఘర్షణలతో, ఒకే దేవుడనే మతపు అనుయాయులకు లొంగిపోతాయి. కాపిటలిస్ట్ వ్యవస్థలలో వ్యక్తి స్వేచ్ఛకన్నా సమాజ శ్రేయస్సు ముఖ్యమనే స్టేట్ కాపిటలిజమ్ ఉన్న దేశం శక్తివంతమవుతుంది. చీలికలు పీలికలుగా ఉన్న మత విశ్వాసులకు,

మతమనేది ఒక మానసిక వైపరీత్యమనే సిద్ధాంతాన్ని నమ్మిన హేతువాదులకు మధ్య యుద్ధంలో ఎవరు గెలుస్తారో ఊహాతీతం కాదు. కోవిడ్–19 ఉత్పాతం ఓ హెచ్చరిక".

యల్లెస్సారిన్ అన్నాడు– "18 సెప్టెంబరు 2020 నాటికి ముప్ఫై మిలియన్ల మంది కోవిడ్–19 వ్యాధిగ్రస్తులైనారు. 9,44,000 మరణాలు, ఇరవై మిలియన్లకు పైగా కోలుకున్నారు. అరవై ఏళ్లకు పైబడి, డయాబెటిస్, రక్తపోటు లాంటి వ్యాధులతో బాధపడ్తున్న వాళ్లలో మరణాల సంఖ్య ఎక్కువగా ఉండటం గమనార్హం. మగవాళ్లలో వ్యాధి (57%) ఎక్కువగా, స్త్రీలలో (43%) తక్కువగా ఉండడానికి క్రోమోజోములలో (XX) కారణమని ఓ అభిప్రాయం. మృతులలో 72 శాతం మగవాళ్లే.

6 అక్టోబరు 2019, 11 డిశంబర్ 2019 మధ్యకాలంలో కోవిడ్–19 వైరస్ జంతువుల నుండి మానవులకు సంక్రమించిందని భావిస్తున్నారు. ఇప్పుడది మన శాస్త్ర విజ్ఞానానికి సవాలుగా మారింది".

భావన అన్నది– "ధర్మారావు చనిపోయిన రోజే ఇంకో ముగ్గురు మగవాళ్లు చనిపోయారు. వారిలో ఒకరికి అంతకుముందు బైపాస్ సర్జరీ అయ్యిందట. రెండవ వ్యక్తికి ఒబెసిటి. మూడో అతనికి డయాబెటిస్, రక్తపోటుతో పాటు అతడు ఛెయిన్ స్మోకర్ కావడంతో అప్పటికే ఊపిరితిత్తులు పాడై త్వరగా ఆరోగ్యం విషమించిందట. కాని, ధర్మారావుకు ఏ జబ్బూ లేదు. చిన్నవయసులోనే అతడిని కరోనా కాటువేసింది. స్వేచ్ఛకు కన్నీరు, మానసిక క్షోభ మిగిలింది".

అంతర్యామి అన్నాడు– "విధి ప్రవర్తన వింతగా ఉంటుంది. అనుకోకుండా మనం ఒక రెస్టారెంట్‌లోకి వెళతాం. అక్కడంతా అస్తవ్యస్తంగా ఉండి మనకు నచ్చదు. వెయిటరు విసుక్కుంటూ మాట్లాడతాడు. మనం అడిగింది లేదని తన దగ్గర ఉన్నది వడ్డిస్తాడు.

ఎదురుగా గోడమీద ఉన్న పెయింటింగ్ నీవేపు చూస్తున్నట్లుంటుంది. కాసేపటికి దాంట్లో నీవుంటావు. నీ ముఖం మాసిపోతూ కనిపిస్తుంది. ఏమీ ఆస్వాదించకుండానే బిల్లు, టిప్పు ఇచ్చి బయటపడతావు. వెయిటర్ చూపులు నిన్ననుసరిస్తూనే ఉంటాయి. ఎక్కడో గంట మోగిన ధ్వనికి గుండె ఒక్కక్షణం కొట్టుకోవడం మానేస్తుంది. విధి చేస్తున్న వికటాట్టహాసానికి ఎండుటాకులు రాలి పడతాయి".

"కోవిద్-19 ఇప్పుడు మృత్యుదూతగా (Psychopomp), Death midwife, death doula గా మారింది. అచేతన, చేతనా స్తరాల మధ్య నడచే Grim reaper లా పంటను కోసివేస్తున్నది.

జులు, బంటు తెగల ప్రజలు ఊసరవెల్లి, తొండలు ఈ ప్రపంచంలోకి మృత్యువును తెచ్చాయని భావిస్తారు. తమ తెగలో ఎవరన్నా చనిపోతే ఊసరవెల్లిని పట్టుకుని దాని నోట్లో ఇంత నశ్యం (పొగాకు పొడి) వేసి అది రంగులు మారుస్తూ చస్తుంటే పగ తీరిందని సంతోషపడతారు. ఈ కరొనా ఊసరవెల్లిని నాశనం చేయడానికి ఏ వ్యాక్సీన్ నశ్యం వాడాలో!" అన్నాడు అంతర్యామి.

"బాగుంది నీ కథ" అన్నాడు యల్లెస్సారిన్. "ఇట్లాంటిదే ఆస్ట్రేలియా, ముర్రే (Murray) నది దగ్గర నివసించిన స్థానిక తెగలలో చెప్పుకునేవారు. తొలి మానవుడు, మానవిని సృజించాక వాళ్లను నది పక్కన ఉన్న చెట్టు వద్దకు వెళ్లకుండా నిషేధించారు. కట్టెల కోసమని ఓరోజున మానవి నిషేధించిన చెట్టు దగ్గరకెళ్లి గొడ్డలితో కొట్టేసరికి ఆ చెట్టు విపరీతంగా ఊగి దాని తొర్రలో ఉన్న గబ్బిలం ఎగిరిపోయి గుహల్లో దాక్కుంది. అప్పట్నుంచి అది మృత్యుదూతలా మానవుల వెంటబడుతోంది. ఈ కథ ఇప్పటి కరోనా వాస్తవానికి దగ్గరగా ఉంది కదూ!".

"అవును" అన్నది భావన. "Death is not a necessary part of the order of nature" అనేది కొందరు ఆటవిక జాతుల అభిప్రాయం. దానినే ప్రొఫెసర్ వీస్‌మాన్ (Weissmann), ఆల్ఫ్రెడ్ రస్సెల్ వాల్లస్ (Alfred Russel Wallace) లు బలపరచారు. మైటాసిస్ (Mitosis) ఉన్నంతకాలం అమరత్వమే ఉన్నది. Sexual reproduction తో చావు మొదలయ్యింది. అమరకణాలకు, పరిమిత ఆయుర్దాయమున్న జీవ కణాలకు జరుగుతున్న యుద్ధమే ఈ కోవిద్-19 రోగమా! మనల్ని మనం రక్షించుకునే క్రమంలో సైటొకిన్ స్టార్మ్ (Cytokine Storm)తో మనల్ని మనం చంపుకుంటున్నామా? ప్రకృతిలో సమతుల్యతను సాధించే ఆవర్తనాలలో మృత్యువు ఒక భాగమయ్యిందా! ఏకకణ జీవులు బహుకణజీవులుగా పరిణామం చెందాక మృత్యువనేది జీవధర్మమయ్యింది. గమ్మత్తేమిటంటే జీవపు అంచున ఉన్న నిర్జీవి వైరస్, జీవకణాన్ని తన అధీనంలోకి తీసుకుని తన జాతిని వృద్ధి చేసుకుని జీవిస్తుంది. జీవులలో అత్యంత ఉన్నత స్థానంలో ఉన్న మానవుడు నిర్జీవ వైరసు తనలో చేరగానే గజగజ వణుకుతూ తన కణజాలపు సైటొకిన్

తుఫానులో తానే మునిగి మరణిస్తున్నాడు. ఇంతకూ ఎవరిశక్తి గొప్పది? అమరత్వమనేది సూక్ష్మజీవుల సహజధర్మం కాగా మరణమనేది పరిణామం చెందిన బహుకణ, బహువ్యవస్థలు గల జీవుల జీవధర్మమైంది.

అంతర్యామి అన్నాడు వేదాంత దృక్కులతో– "భూమి సౌరకుటుంబంలో భాగం. ప్రత్యక్ష నారాయణుడు సూర్యుడు. ఇప్పటి ఏడవ మన్వంతరపు ప్రభువు సత్యవ్రతుడు సూర్యపుత్రుడు (సూర్యుడు–శరణ్యల కుమారుడు, సూర్యుడికి సంధ్యకు పుట్టిన కవలలు యముడు–యమి; సూర్యుడికి ఛాయకు పుట్టినవాడు శని. భూమిపై తొలిసారిగా మరణించి దక్షిణ దిక్కుకు అధిపతైన నరకలోకాధీశుడు యముడు. జీవుల ఆయుర్దాయాన్ని, పాప పుణ్యాలను బేరీజు వేస్తాడతడు. మనం ఏడవ మన్వంతరంలో ఉన్నాం. జీవులలోని జీవగడియారాన్ని ప్రభావితం చేసేది సూర్యుడు. జీవన కాలం ముగిసేయగానే తన దగ్గరకు రప్పించుకునేది యముడు. జీవితాన్ని ప్రభావితం చేసేది 'శని'. మొత్తానికి ఈ కరోనా ప్రపంచానికి పట్టిన శని కావచ్చు" అన్నాడు అంతర్యామి నవ్వుతూ.

"ఒక్కోసారి అనిపిస్తుంది ఏ అదృశ్య హస్తమో వీటిని ముందే నిర్ణయించిందేమో, ఆ తరువాత సంఘటనలన్నీ గొలుసుకట్టు చర్యల్లా ఆగకుండా ఒక అంతిమస్థితికి చేరుకున్నాయని. మన ఆలోచనలు, ఎన్నికలు, క్రియలు అన్నీ అంతకు పూర్వమే నిర్ణయమైన ముగింపు వేపుకు నిర్దేశింపబడ్డాయని.

మన తెలుగు సంవత్సరాల్లాగే చైనాకు కూడా అరవై సంవత్సరాలు. ప్రతి అరవై ఏళ్లకు మరల అవే వస్తుంటాయి. చైనాలో నూతన సంవత్సరపు వేడుకలను వసంతోత్సవం–'Spring Festival' వేడుకగా జరుపుకుంటారు.

ఒకప్పుడు చైనాలో సముద్ర తీరంలోని పర్వతాలలో ఉండే నియాన్ (Nian) అనే రాకాసి జంతువు ఉగాది అర్ధరాత్రి వచ్చి పిల్లలను ఎత్తుకుపోయి తినేసేది. దాని బారి నుండి తప్పించుకోడానికి గ్రామస్థులు ఊళ్లు విడిచి వెళ్లిపోతుంటే ఓ జ్ఞాని అయిన వృద్ధుడు ఊళ్లోనే ఉండిపోయాడు. అతడు ఊరంతా ఎర్ర కాగితాలు అంటించి, తారాజువ్వలు, మందుగుండు సామాను కాల్చి రాకాసి జంతువు నియాన్‌ను బెదరగొట్టాడు. వాళ్లకు అర్థమయ్యింది యాన్ హువాంగ్ (Yan Huang) దేవత వృద్ధుడి రూపంలో వచ్చి తమను కాపాడి, నియాన్‌ను బెదరగొట్టే రహస్యం చెప్పాడని. ఆరోజు నుంచి ప్రజలు ఎర్రటి దుస్తులు ధరించి, టపాసులు కాలుస్తూ

పెద్దపెద్ద శబ్దాలు చేస్తుంటే ఆ రాకాసి జంతువు భయపడిపోయింది. హాంగ్‌జున్ లావొజు (Hong Jun Laozu) అనే తావో సాధువు ఆ జంతువును పట్టుకుని పర్వతగుహలో బంధించి, పెద్ద బండరాయితో ముఖద్వారాన్ని సీలు చేసాడు.

25 జనవరి, 2020 ఈసారి చైనా నూతన సంవత్సరం. మూషిక నామ సంవత్సరం. జనవరి 24 నుంచి 30 వరకు సెలవులు ప్రకటించారు. ఈ వసంతోత్సవ సమయాన్ని చున్‌యున్ (Chunyun) అని పిలుస్తారు. ఓ నలభై రోజులపాటు చైనాలో మిలియన్ల ప్రజలు స్వస్థలాలకు, వర్క్‌ప్లేసులకు రాకపోకలు సాగిస్తారు. 'The largest annual Human migration in the World' గా దానిని విశ్లేషకులంటారు. చైనాలోనే కాక జపాన్, వియత్నాం, దక్షిణ కొరియాలలో ట్రాఫిక్ జాములేర్పడి ప్రజలు నానా అవస్థలు పడతారు. విద్యార్థులు, ఉద్యోగులు ఇళ్లకు వచ్చి పోవడంతో రైళ్లూ, బస్సులూ, విమానాలు దాదాపు ఊపిరి సలపనంత 'రష్'తో నడుస్తాయి. దొంగతనాలు, దొంగటిక్కెట్లు, ఏక్సిడెంట్లు సర్వసాధారణం. ఈ విషయంలో మనం, చైనీయులు ఒకే పద్ధతిలో బతుకుతున్నా మనిపిస్తుంది.

విధి నిర్ణయమో లేక మరొహటో ఈసారి కోవిద్-19 రూపంలో నియాన్ (Nian) రాకాసి భూతం వుహాన్‌లో ప్రత్యక్షమయ్యింది. అద్భుతమైన వసంతోత్సవ ఏర్పాట్లు అన్నీ రద్దు చెయ్యాల్సి వచ్చింది. సెలవులు ఫిబ్రవరి పది వరకు పొడిగించారు. మాస్కులు, పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్‌లకు డిమాండ్ వందరెట్లు పెరిగింది. ధరలు ఇరవై రెట్లు పెరిగాయి.

విచిత్రమేమిటంటే నియాన్ రాకాసి జంతువు మరొక పేరు షి (Xi). నియాన్ అంటే పంట బాగా పండింది- Good harvest అనే అర్థం.

షి (Xi) అంటే అరుణ లేదా సంధ్యాసమయం; ఇష్టమైన, సంతోషకరమైన అనేవి ఇతర అర్థాలు. కోవిద్-19 వైరస్‌ను గబ్బిలాలలో కనుగొన్న యువతి పేరు షి జెంగ్లి. ప్రస్తుత చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ (Xi Jinping).

తప్పనిసరి పరిస్థితుల్లో చైనాలో నూతన సంవత్సర వేడుకలు రద్దయినాయి. నియాన్ (Nian) లేదా 'షి' రాకాసి జంతువు వుహాన్‌లో ఎవరూ ఊహించకమునుపే జనాల్లోకి దూకింది. నూతన సంవత్సర వేడుకల కోసం అప్పటికే అయిదు మిలియన్ల జనం రాకాసి అంశ వున్న కరోనా వైరస్‌తో వుహాన్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు.

పదకొండు మిలియన్ల జనాభా ఉన్న వుహాన్ 23 జనవరి, 2020 నాడు లాక్‌డౌన్‌లోకి వెళ్లి, 76 రోజుల తరువాత 8 ఏప్రిల్ 2020న లాక్‌డౌన్ ఎత్తివేయబడింది. 10 జనవరి 2020 నాడు వినబడిన తొలి మృత్యు ఘంటారవం వుహాన్‌లో 4,632 సార్లు మ్రోగింది. మృత్యురాకాసి గంటల చప్పుడు విశ్వవ్యాప్తమై 18 సెప్టెంబర్ 2020 నాటికి 9,51,517 సార్లు మ్రోగి, ఇంకా వినవస్తూనే ఉన్నాయి. ఎర్రటి దుస్తులు ధరించి, టపాకాయలు కాల్చి, ఎంత చప్పుడు చేసినా ఈ రాకాసి జంతువు పారిపోవడం లేదు. మరణమృదంగాల మోత ఆగడం లేదు. అవునూ, వినిపిస్తున్నాయా మృత్యుఘంటికారవాలు? చావు బాజాలు?

✧✧✧✧✧

**('ఇవ్వాల్టిని మించినదేముంది? నిన్న అనేది లేదు అలాగే రేపు అనేదీ లేదు. ఎన్నేళ్లు పడ్తుంది నీకా విషయం తెలియడానికి? ఇవ్వాళ అనేది ఒకరోజు కావచ్చు, రెండు రోజులు కావచ్చు – రెండు రోజులే నీ జీవితం. జీవిత ఘట్టాలన్నీ దానిలోని భాగాలు. నీకు దొరకని దాని గురించి ఆందోళన పడకుండా, ఫిర్యాదు చేయకుండా ఉంటే ఆనందకరమైన జీవితం గడుపుతావు. మంచి జీవితాన్ని మన ఆయుష్షును బైబిల్ కాలంలోని సాధువులు, తాతతండ్రులతో పోలిక తేరాదు"**

**– ఎర్నెస్ట్ హెమింగ్‌వే (For whome the Bell tolls)**

# 10. ప్రతి సాధువూ, అతడి ప్రత్యేక దీపమూ!
## (To each Saint his Candle)

**"ఒక తాళం చెవిని ఆరాధించగానే మనం క్రైస్తవులం, కాథలిక్కులం అయిపోలేదు. మనం ఆ తలుపు తెరిచి, మానవ సమూహం ఊదుతున్న స్వేచ్ఛాశంఖపు గాలిని స్పర్శిస్తున్నాం కనుకనే మనం నిజమైన క్రైస్తవులం!"**

– గిల్బర్ట్ కె. ఛెస్టర్టన్

**"ఎందుకు నాకు చావాలనిపిస్తోంది? ఏమిటీ పీడకలలు? దేవదూతల బాకాల ధ్వనులా లేక కోపించిన రాకాసి భూతాల గజ్జెల చప్పుడా నాకు వినిపిస్తున్నది? బహుశా, నేను ఇప్పటికే చనిపోయానేమో?"**

– లారీ హల్సె ఏండర్సన్

స్వేచ్ఛ ఇంకా హాస్పిటల్‌లోనే ఉంది. భావనకు డాక్టర్లు చెప్పినదాని ప్రకారం ఆమె ఇంకా కొన్నిరోజులు హాస్పిటల్‌లో ఉండడమే శ్రేయస్కరం. స్వేచ్ఛ మామూలు మనిషి కావడానికి అవుతున్న హాస్పిటల్ బిల్లుతో ఆమె తల్లిదండ్రులు బానిసలయ్యే పరిస్థితి వచ్చేట్లుంది.

అంతర్యామి కంప్యూటర్‌లో సెర్చ్ చేస్తున్నాడు. ప్రపంచంలో శక్తివంతులైన నాయకుల కోసం. Forbes లిస్టు మొదటి పదిమంది (Powerful People)– 1) షి జిన్‌పింగ్ (చైనా), 2) వ్లదిమిర్ పుతిన్ (రష్యా), 3) డొనాల్డ్‌ట్రంప్ (అమెరికా), 4) ఏంజెలా మెర్కెల్ (జర్మనీ), 5) జెఫ్‌బెజోస్ (అమెజాన్), 6) పోప్ ఫ్రాన్సిస్ (రోమన్ కాథలిక్ చర్చి), 7) బిల్‌గేట్స్ (మైక్రోసాఫ్ట్), 8) మహమ్మద్ బిన్ సల్మాన్ (సౌదీ అరేబియా), 9) నరేంద్రమోడి (ఇండియా), 10) లారీపేజ్ (ఆల్ఫాబెట్).

అదే CEO World Magazine 2020లో డొనాల్డ్‌ట్రంప్ మొదటి స్థానంలోకి వచ్చాడు. మిగతావాళ్ల స్థానాలు కాస్త అటూ యిటూ మారాయి.

యల్లెన్స్పారిన్ అన్నాడు– "మొండివాడు రాజుకన్నా బలవంతుడంటారు. మరి రాజు, మొండివాడు ఒకడే అయినప్పుడు వాడింకెంత బలవంతుడో కదా! ఇప్పటి ప్రపంచ రాజకీయాల్లో ప్రముఖులందరూ మొండివాళ్లకే మొండివాళ్లులా ఉన్నారు. డొనాల్డ్ ట్రంప్ (అమెరికా), షి జిన్‌పింగ్ (చైనా), పుతిన్ (రష్యా), మోడి

(ఇండియా), కిమ్ జాంగన్ (ఉత్తర కొరియా), రొడ్రిగొ దుతెర్తె (ఫిలిప్పిన్స్) ఇంకా అనేకులు జగత్ మొండివాళ్లు.

ప్రపంచ రాజకీయాలెలా పోతున్నాయో, వీళ్లు కోవిద్-19ను హాండిల్ చేసిన విధానం చూస్తే మనకు తెలుస్తుంది.

కిమ్ జాంగన్ (Kim Jang-un) ఉత్తరకొరియా అధ్యక్షుడు. ముప్ఫై ఆరేళ్ల వయసు (8-1-1984). తాత కిమ్ II సంగ్ (1948-1994 వరకూ), తండ్రి- కిమ్ జాంగిల్ (1994-2011 వరకూ) ఉత్తర కొరియాను పాలించగా 2011 నుండి ఇతడు మార్షల్‌గా ఉక్కుపిడికిలి, ఇనుప బూట్లతో రాజ్యమేలుతున్నాడు. తన సవతి సోదరుడైన కిమ్ జాంగ్-నామ్‌ను మలేసియా-కౌలాలంపూర్ విమానాశ్రయంలో VX nerve agent విష ప్రయోగంతో చంపించినాడని ఆరోపణ (13-2-2017). కోవిద్-19 రాగానే (జనవరి 23, 2020) సరిహద్దులు మూసివేసాడు. ఎవరైనా సరిహద్దులు దాటివస్తే 'Shoot to kill' కాల్చిపారేయండని ఆజ్ఞలు జారీ చేసినాడు. కాబట్టి, కేసులు సున్నా, మరణాలు సున్నా. ఎవరూ నమ్మినా, నమ్మకపోయినా మా లెక్కలంతే అన్నాడు కిమ్ జాంగ్ అన్. ఉత్తరకొరియా అధికారికంగా State Atheism ను అనుసరిస్తుంది. విదేశీ ప్రయాణాలు పూర్తిగా నిషేధించబడినాయి 'ఫ్లూ' అని అనుమానం వచ్చినవాళ్లను క్వారంటెయిన్‌లో ఉంచారు. 23 ఏప్రిల్ 2020 నాడు తుమెన్ (Tumen) నది దాటి పారిపోతున్న నార్త్ కొరియా వ్యక్తిని సరిహద్దు దళాలు కాల్చిచంపాయి. అతడు కోవిద్ పాజిటివ్ అని Daily NK పత్రిక వ్రాసింది గాని నిర్ధారణ కాలేదు అధికారికంగా. జులై 25న కీసాంగ్ (Kaesong) పట్టణంలో ఒక వ్యక్తికి వ్యాధి సోకిందని అనుమానించడంతో మొత్తం పట్టణాన్ని లాక్‌డౌన్‌లో ఉంచేసారు. కాబట్టి కోవిద్-19 సోర్కు- సున్నా. (పొరుగు దేశాలైన దక్షిణ కొరియాలో వ్యాధిగ్రస్తులు/మరణాలు: 22,783/377; చైనాలో- 85,255/4,634).

అంతర్యామి అన్నాడు- "ఫిలిప్పీన్స్‌లో పరిస్థితి ఇంకోరకం. రౌడి, డిగాంగ్‌గా పిలువబడే రొడ్రిగొ రొవ ద్యుతెర్తె (Rodrigo Roa Duterte - born 28th March 1945) ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు Davao నగర మేయర్‌గా 22 ఏళ్లు పనిచేసాడు. మాదకద్రవ్యాలు (Drugs) వాడేవాళ్లన్నా, నేరస్తులన్నా సరిపడదు. స్వయంగా గన్ను పట్టుకొని కాల్చేయడమే కాక Death Squads ను నియమించాడు స్మగ్లర్‌లను ఏరిపారేయడానికి.

తనను మైనర్‌గా ఉన్నపుడు ఫాదర్ మార్క్ ఫాల్వే లైంగిక హింసకు గురిచేసాడని ఆరోపణ చేసాడు ద్యుతెర్తె. (మార్క్ ఫాల్వే లాస్‌ఏంజిల్స్‌లో కూడా తొమ్మిదిమంది పిల్లలను వేధించినది ఋజువై Society of Jesuits పదహారు మిలియన్ డాలర్ల నష్టపరిహారం చెల్లించింది). ఆ ప్రభావం తనపై పడగా తానూ 'గే' (హోమోసెక్సువల్)గా బతికానన్నాడు. కాథలిక్ చర్చి ఫాదర్లు మాదక ద్రవ్యాలపై యుద్ధాన్ని (War on Drugs) వ్యతిరేకించినపుడు వాళ్లను తీవ్రంగా దుర్భాషలాడడమే కాక, పోప్ ఫ్రాన్సిస్‌ను Son of Whore అని తిట్టాడంటారు. అమెరికా ప్రెసిడెంట్ ఒబామాను కూడా ఆ మాట అనడంతో వాళ్లిద్దరి మధ్య సమావేశం రద్దయ్యింది.

Gay, Son of Whore లాంటి ఊత పదాలతో Street Language మాట్లాడుతూ Duterte ఎందరికో కంటగింపుగా మారినాడు. నేను 'సగం ముస్లిం'ను అని చెప్పుకున్నాడు ద్యుతెర్తె. Myasthenia gravis, Buerger's desease, Barrett's Esophagus వ్యాధులున్నాయి అతడికి. తాను ఫెంటానిల్ అనే నెప్పిని తగ్గించే మందు వాడతాడు. వయాగ్రా మీద ప్రేమ. డ్రగ్స్ స్మగ్లింగ్ చేసేవాళ్లను చంపేస్తాడు.

ఫిలిప్పీన్స్‌లో తొలి కోవిడ్-19 కేసు 30 జనవరి, 2020 నాడు గుర్తించబడింది. చైనాకు అవతల తొలి కోవిడ్-19 మరణం మనిలా, ఫిలిప్పీన్స్‌లో సంభవించింది. లాక్‌డౌన్‌లు, కమ్యూనిటి క్వారంటైన్లు అన్ని జాగ్రత్తలూ తీసుకున్నా సెప్టెంబర్ 18 నాటికి వ్యాధిగ్రస్తులు 2,79,526; మరణాలు- 4,830. ఇరవై-ఇరవై తొమ్మిది సంవత్సరాల వయసులో ఉన్న యువకులు ఎక్కువగా ఈ వ్యాధికి గురైనారు".

భావన బ్రౌజ్ చేస్తూ అన్నది- "నేను మనదేశం స్టాటిస్టిక్సు, మన ప్రధానమంత్రి గురించి చెబుతాను. సెప్టెంబరు 19, 2020 నాటికి కోవిడ్-19 వ్యాధిగ్రస్తులు 5,308,014, మరణాల సంఖ్య- 85,625.

17 సెప్టెంబరు 1950లో జన్మించిన నరేంద్ర దామోదర్‌దాస్ మోడి (Narendra Damodar Das Modi) భారతదేశపు 14వ ప్రధానమంత్రి. 1971 నుంచి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లో (RSS) పూర్తికాలపు కార్యకర్తగా పనిచేసినాడు. 1975 ఎమర్జన్సీ కాలంలో అజ్ఞాతానికి వెళ్లి, 1985లో భారతీయ జనతాపార్టీలో చేరి, 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎన్నికైనాడు. 2002 గుజరాత్ ఘర్షణలు కొంత వ్యతిరేకతను తెచ్చిపెట్టినా నాయకత్వ సమర్థత, ఆర్థికస్థితిలో మెరుగుదల మోడీకి మంచిపేరు తెచ్చాయి.

2014 సాధారణ ఎన్నికలలో బి.జె.పి. నాయకత్వాన ఉన్న NDA (National Democratic Alliance) 543 సీట్లకు గాను 336 సీట్లు గెలుచుకోగా మోడీ ప్రధానమంత్రి అయినాడు. ప్లానింగ్ కమిషన్‌ను రద్దుచేయడం, పెద్దనోట్లను (High Denomination Bank Notes) రద్దు చేయడం లాంటి సాహసోపేతమైన నిర్ణయాలు వివాదాస్పదమైనాయి.

2019 ఎలక్షన్లలో 353 సీట్లు గెలుచుకుని రెండోసారి, ప్రధానమంత్రి అయ్యాక 'ట్రిపుల్ తలాక్'ను నేరంగా పరిగణించే చట్టాన్ని తెచ్చాడు. జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లను ప్రత్యేక ప్రాంతాలుగా విడదీసి ఎన్నాళ్లుగానో రగులుతున్న వివాదానికి ముగింపు పలికాడు. 2019లో రామజన్మభూమి వివాదం పరిష్కరింపబడింది.

ఇండియాలో కోవిద్-19 మొదటి కేసు 30 జనవరి 2020 నాడు రికార్డు చేయబడింది. 19 మే నెలకల్లా లక్ష కేసులు, 17 జులైకల్లా ఒక మిలియన్ కేసులు, సెప్టెంబర్ 19న 5,308,014 కేసులు పాజిటివ్‌గా తేలాయి. మరణాల శాతం 2.41 మాత్రమే.

24 మార్చి 2020 నాడు ఇండియాలోని 1.3 బిలియన్ల ప్రజలు లాక్‌డౌన్‌లోకి వెళ్లిపోయారు. జూన్ ఒకటి నుంచి 'అన్‌లాకింగ్' ప్రక్రియ అమలులోకి వచ్చింది.

12 మార్చి 2020 నాడు తొలి కోవిద్-19 మరణం నమోదయ్యింది. సెప్టెంబరు 19 నాటికి మరణాల సంఖ్య- 85,625.

సిక్కుల పండుగ, తబ్లిగి జమాత్ సమావేశం, దేవాలయాల్లో జనసందోహం వ్యాధి వేర్వేరు చోట్లకు వేగంగా వ్యాపించడానికి తోడ్పడినాయి. వ్యాధికంటే వేగంగా 'No Meat No Corona Virus' దేవుని ఆగ్రహం, గోమూత్రపు టీపార్టీలు, చప్పట్లు, రాందేవ్ మస్టర్డ్ ఆయిల్ ఫార్ములా, వలస కూలీలు స్వస్థలాలకు వెళ్తున్నపుడు పడ్డ కష్టాలు, సామాజిక మాధ్యమాలలో వైరల్ కాగా అనేక గొడవలు జరిగాయి.

గోద్రా గొడవ, Demonetization, GST, బాలాకోట్, ఆర్టికల్ 370, కరొనా వైరస్, లాక్‌డౌన్ నిర్ణయాలు చాలామందిలో అసంతృప్తిని, వ్యతిరేకతను కలిగించాయి. మోడీకి ఎంతో ఇష్టమైన 'మన్‌కీ బాత్'లో చాలామంది తమ అయిష్టాన్ని ప్రకటించారు. దేశం ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుతున్నది.

జశోదాబెన్‌తో 1968లో వివాహమైనా, వైవాహిక జీవితానికి స్వస్తి చెప్పినాడు నరేంద్రమోడి. జశోదాబెన్‌తో ఇంటర్వ్యూను టెలికాస్ట్ చేసినందుకు (1 జనవరి 2015) నాడు అహ్మదాబాదు దూరదర్శన్ డైరెక్టర్‌ను 2500 కిలోమీటర్లు దూరంలో ఉన్న అండమాన్ దీవులకు (పోర్ట్‌బ్లెయిర్)కు ట్రాన్స్‌ఫర్ చేసారు.

సూపర్ CMగా, సుఖరామ్‌తో డీల్ నడిపిన వాడిగా, గుజరాత్ అల్లర్లకు ఆజ్యం పోసినవాడిగా, గుల్బర్గ్ సొసైటి ఇళ్ల దహనానికి బాధ్యుడిగా, తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పిన పోలీస్ అధికారి సంజయ్‌భట్‌ను సర్వీస్ నుంచి తొలగించినవాడిగా, మాజీ గుజరాత్ ముఖ్యమంత్రి హరేన్ పాండ్యా హత్య (2003)లో, ఇస్రత్ జహాన్ ఫేక్ ఎన్‌కౌంటర్ (2004)లో, సొహ్రాబుద్దిన్ షేక్ ఎన్‌కౌంటర్‌లో; జశోదాబెన్ వృత్తాంతం; అమెరికా వీసా తిరస్కరణ, శశిథరూర్ యాభైకోట్ల గర్ల్‌ఫ్రెండ్ వ్యాఖ్య, ఫేకు బిరుదు, Louis Vuitton Shawl, ఇరవై లక్షల సూటు, చాయ్‌వాలా టు ప్రధానమంత్రి, ఈ ఆరోపణలు, వాస్తవాలు, అన్నిటిలో నరేంద్రమోడీ వ్యక్తిత్వం కొట్టవచ్చినట్లు మనకు కనిపిస్తుంది". ఇప్పుడు పుతిన్ గురించి యల్లెస్సారిన్ చెబుతాడు".

యల్లెస్సారిన్ అన్నాడు– "వ్లదిమిర్ వ్లదిమిరొవిచ్ పుతిన్ (7 అక్టోబరు 1952)లో జన్మించాడు. మాజీ KGB ఆఫీసర్‌గా పదహారేళ్లు పనిచేసి లెఫ్టినెంట్ కల్నల్ హెూదాకు చేరుకున్నాక 1991లో రాజీనామా చేసి రాజకీయాల్లో దిగాడు. ప్రెసిడెంట్‌గా, ప్రధానమంత్రిగా అనేక సంస్కరణలు తెచ్చి రష్యా ఆర్థికస్థితిని ఎంతో మెరుగు పరచినాడు. పుతిన్ నాయకత్వంలో డెమొక్రసి దెబ్బతిన్నదని (Democratic Back sliding), రాజకీయ ప్రత్యర్థులను నిర్దాక్షిణ్యంగా జైళ్లలోకి నడ్తున్నారని, ఎలక్షన్లలో మోసాలు జరుగుతున్నాయని ఆరోపణలున్నాయి. హిల్లరి క్లింటన్‌కు వ్యతిరేకంగా అమెరికా అధ్యక్ష ఎన్నికలలో పనిచేసి పుతిన్ ట్రంప్ గెలుపుకు తోడ్పడ్డాడనేది అభియోగం. 2006లో అలెగ్జాండర్ లిట్‌వినెన్‌కో అనే మాజీ KGB ఏజంట్‌ను పొలొనియంతో చంపించాడనేది మరో ఆరోపణ

మాజీ వరల్డ్ ఛెస్ ఛాంపియన్ గారీ కాస్పరోవ్ ప్రస్తుతం పుతిన్‌కు రాజకీయ ప్రత్యర్థి. అతడు పుతిన్‌ను డిక్టేటర్ – నియంతగా అభివర్ణించాడు. హిల్లరి క్లింటన్ అతడిని Bully, Arrogant, మొండిఘటం అని పిలిచింది. అమెరికన్ డిప్లొమాట్‌ల మాటల్లో పుతిన్ ఒక ఆల్ఫాడాగ్ (Alphadog)... వర్చువల్ మాఫియా స్టేట్‌ను నడుపుతున్న నియంత.

పుతిన్ మాటలు (Putinisms) ఛలోక్తులుగా Dunk the terrorists in Toilets, like a slave on a gallery, Ears of a dead donkey, Give my Pen Back, At the very least, a civil servant should have a head; Oinking along చాలా పాపులర్ అయ్యాయి.

రష్యాలో కోవిద్-19 మొదటి ఇద్దరు రోగులు చైనా జాతీయులు, 31 జనవరి 2020న పాజిటివ్ నమోదు కాగానే చైనా రష్యా సరిహద్దులు మూసివేసారు. 23 ఫిబ్రవరిలో 'డైమండ్ ప్రిన్సెస్' విహారనౌక నుంచి వచ్చిన వారిని కార్వంటెయిన్‌కు తరలించారు. 19 సెప్టెంబరు 2020 నాటికి వ్యాధిగ్రస్తుల సంఖ్య 1,097,351, మరణాలు- 19339. మృతుల సంఖ్య ఇంత తక్కువగా ఉండడాన్ని Russian Miracle గా అలెగ్జాండర్ మ్యాస్నికొవ్ వర్ణించాడు.

11 ఆగష్టు 2020 నాడు కోవిద్-19 రష్యా వ్యాక్సిన్- Gam-Covid-Vac-స్పుత్నిక్-V గురించి పుతిన్ అధికారిక ప్రకటన చేసినాడు. తన కుమార్తె ఇప్పటికే రెండు డోసులు తీసుకున్నదని స్పష్టం చేసినాడు. అయితే ఈ వ్యాక్సీన్ క్లినికల్ ట్రయల్స్ సక్రమంగా జరగలేదని, దాని ప్రభావం ఎంత ఉంటుందో తెలియదని విశ్లేషకుల అభిప్రాయం. ఈలోగా డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీ- 'స్పుత్నిక్-V' వ్యాక్సీన్ పదికోట్ల డోసులు ఇండియాలో రోగులకు ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకుంది".

అంతర్యామి నవ్వాడు- "ఎవడి గోల వాడిది. ఎవరు ముందు మార్కెట్ కాప్చర్ చేసుకోవాలనేదే తాపత్రయం. ఇప్పుడు ఫైనల్స్‌కు వచ్చాం. షి జిన్‌పింగ్- డొనాల్డ్‌ట్రంప్ - ఇద్దరూ హేమాహేమీలే.

చైనాలో షి జిన్‌పింగ్ ఇప్పుడు తిరుగులేని నాయకుడు. Worker - Soldier Student స్థాయి నుంచి Leadership Core గా, లింగ్‌క్షియు (Lingxiu) - నాయకుడు (ఛియాంగ్ కై-షెక్, మావొ జెడాంగ్, హువా గువొఫెంగ్‌లకు మాత్రమే ఇవ్వబడిన టైటిల్)గా, మహా కర్ణధారి (Great Helmsman)గా, ప్రజానేత (People's leader-మావొ జెడాంగ్ ఒక్కడికే ఉన్న పేరు) స్థాయి కెదిగినవాడు. చైనా అధ్యక్ష పదవికి, ఉపాధ్యక్ష పదవికి పదవీకాలపు నిబంధన తొలిగించేట్లు చేసినాడు.

Socialism with Chinese Characteristics, One China; One Belt-One Road (Belt and Road Initiative - BRI) ఇవన్నీ షి జిన్‌పింగ్ ఆలోచనలు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో గాఢ మైత్రిని ఏర్పరచుకున్నాడు.

చైనా వుహాన్‌లో మొదలైన కోవిద్-19 వైరస్ విషవాయు ప్రభంజనం ప్రపంచం మొత్తం వ్యాపించినా, 140 కోట్ల జనాభా ఉన్న చైనాలో కేవలం 85,269 మందికి మాత్రమే వ్యాధి సోకడం, 4634 మంది మాత్రమే మరణించడం చైనాపై ప్రపంచమంతటా అనుమానాలు రేకెత్తించాయి. చైనా ప్రతిష్ఠ మసకబారింది. హాంకాంగ్ అల్లర్లు, తైవాన్‌తో గొడవ, ఇండియాతో సరిహద్దు ఘర్షణ; వీటికితోడు కోవిద్-19 వైరస్ వుహాన్ ప్రయోగశాలలో సృష్టించబడిందని చాలామంది అనుమానపడుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోవిద్-19 వైరస్‌ను 'చైనా వైరస్' అని పిలిచి మరింత కలకలాన్ని రేకెత్తించాడు".

యల్లెస్సారిన్ అన్నాడు- "రియల్ఎస్టేట్ బిజినెస్‌లో తలపండినవాడు, ప్రపంచమే ఓ రియల్ఎస్టేట్‌గా భావించేవాడు, అబద్ధాల్ని సునాయాసంగా పలికి కనీసం ఉలిక్కిపడనివాడు డొనాల్డ్ ట్రంప్ ఇంపీచ్‌మెంట్ నుంచి కొద్దిలో బయటపడినాడు.

ఫెడరల్ న్యాయవ్యవస్థలో మార్పులు, Space Force Establishment, టాక్స్ రిఫార్మ్‌లు, First Step Act, ఇరాన్ లీడర్ అబు బకర్ అల్-బాగ్దాది టెర్రరిస్టు నాయకుడి హత్య - ఇవన్నీ విజయాలు. ఫ్లాయిడ్ మరణంతో తలెత్తిన రేసియల్ విభేదాలు, అమెరికా పేరు ప్రతిష్ఠలకు విఘాతం, ఇరాన్, సిరియా, ఆఫ్ఘనిస్తాన్‌లలో వెనుకంజ, ఒబామాకేర్ కు ఉద్వాసన, కోవిద్-19ను నిలువరించడంలో తాత్సారం, దెబ్బె నాలుగేళ్ల డొనాల్డ్ ట్రంప్‌కు అపకీర్తి తెచ్చిపెట్టాయి.

20 జనవరి, 2020 నాడు అమెరికాలో తొలి కోవిద్-19 కేసు గుర్తించబడింది. మార్చి 13న National Emergency ప్రకటించినాడు అమెరికా అధ్యక్షుడు. 19 సెప్టెంబర్, 2020 నాటికి అమెరికాలో వ్యాధిగ్రస్తుల సంఖ్య 6932705; మరణాల సంఖ్య 203282.

ఇన్నాళ్లూ తమ తమ అగ్రరాజ్య గొప్పతనపు బాకాలూదినవారు తలలు దించుకుంటున్నారు. మృత్యువు ఊదుతున్న బాకా ధ్వనులు ఇంకా మార్మోగుతూనే ఉన్నాయి.

✧✧✧✧✧

**(మృదువుగా, వినయంగా నడుచుకునేవాళ్లు జీవితమనే గురువుకు శిష్యులు. పెనుగాలి వీచినపుడు గట్టిగా ఉన్నాయనుకున్న చెట్లు విరిగి నేలకూలుతాయి. మెత్తని మొక్క నేలకు వంగినా తిరిగి నిలబడుతుంది. - తావొ తె ఛింగ్ (Tao Te Ching)**

# 11. ఎవరి బాకా వారే ఊదుట...

## (Blow one's own trumpet)

**"ప్రపంచంలోని ఏ దేశమైనా - నా ప్రజలంతా సుఖంగా ఉన్నారు, పేదరికం లేదు, అజ్ఞానం కాని దుఃఖం కాని కానరాదు, మా దేశపు జైళ్లు ఖైదీలు లేక ఖాళీగా ఉన్నాయి, వీధుల్లో బిచ్చగాళ్లు లేరు, వృద్ధులకు దిగులు లేదు, పన్నులు చాలా తక్కువ, మంచీ చెడూ ఆలోచించే లోకం మాది ఎందుకంటే మేము ఆనందానికి ఆప్తమిత్రులం' అని చెప్పగలిగిన దేశం తన రాజ్యాంగం గురించి ప్రభుత్వం గురించి గొప్పలు చెప్పుకోవచ్చు. 'స్వాతంత్ర్యం నా సంతోషం, ఈ ప్రపంచమంతా నా దేశం, మంచిచేయడం నా మతం!' అని"**

– థామస్ పెయిన్ (Thomas Paine, Rights of Man)

యల్లెస్సారిన్ అన్నాడు– "గర్వమనే తాడు కట్టుకుని, అహంకారమనే కత్తి పట్టుకుని, మూర్ఖత్వపు చెప్పులు తొడుక్కుని జ్ఞానవృక్షం ఎక్కాలనుకుంటే జారి పడతావు. గర్వం సర్వం చెరుచును. అధికారం గర్వాన్నిస్తుంది. గర్వం అధికారాన్ని పోగొడ్తుంది. అధికారం నిలబెట్టుకోవడానికి కుట్రలు, కుట్రల సిద్ధాంతాలు సృష్టించబడతాయి. కుట్రలు, కుటిల నీతులు, అబద్ధాలలోని ఆకర్షణ, ఉద్వేగాలు ఆలోచించడం ఇష్టంలేని వాళ్లను ఆకట్టుకుంటాయి. నిజమేమిటంటే అసత్యపు సునామీ అలల్లో ప్రపంచపు నావ కొట్టుకుపోతున్నది. కర్ణధారులు కలహాల్లో పడి దిక్సూచి, తెడ్లూ, చుక్కాని విరిగిపోతున్నా పట్టించుకోవడం లేదు. అదుగో చూడు అతడేమంటున్నాడో, ఆమె గురించి"–

తెరపై 'స్టెల్లా ఇమ్మాన్యుయెల్' ప్రత్యక్షమైంది. భావన, అంతర్యామిలు ఆశ్చర్యంగా చూసారు.

యల్లెస్సారిన్ అన్నాడు– "ఈమె స్టెల్లా ఇమ్మాన్యుయెల్. కెమరూన్‌లో పుట్టింది. నైజీరియాలో మెడిసిన్ చదువుకుని అమెరికా–టెక్సాస్‌లో పీడియాట్రిషియన్ (Paediatrician) - చిన్నపిల్లల వైద్యనిపుణురాలిగా ప్రాక్టీస్ చేస్తున్నది. Fire Power Ministries అనే సంస్థను స్థాపించి వైద్యం, మతబోధనలతో అనేకమంది ఫాలోవర్స్‌ను సంపాదించుకున్నది. Human Sexuality అంశంగా ఎండొమెట్రియోసిస్, సంతానలేమి, గర్భవిచ్ఛిత్తి, సుఖవ్యాధులు – వీటిపై తన ప్రసంగాలను సామాజిక మాధ్యమాలలో వైరల్ చేసింది.

ఆమె దృష్టిలో సుఖవ్యాధులు, ఎబార్షన్లు, గర్భస్రావాలూ 'దెయ్యాల విత్తనాల' (Demon Seeds) వల్ల సంభవిస్తాయి. గాఢనిద్రలో ఉన్న స్త్రీలతో సంభోగం చేసే ఇంకుబస్ (Incubus) భూతం వలన Demon Seeds స్త్రీల గర్భాలలో ప్రవేశించడం వలన Monster సంతానం, గర్భస్రావాలు జరుగుతాయి. నీతివంతులైన మగవాళ్లను చెడగొట్టేందుకు సక్కుబస్ (Succubus) అనే ఆడదయ్యాలు, మగవాళ్లను ఆకర్షించి వాళ్లతో సంభోగించి సుఖవ్యాధులను కలుగచేస్తాయి అనేది ఆమె ప్రచారం చేసింది. ఇంకుబస్, సక్కుబస్‌లతో ఎక్కువసార్లు కలిసినవాళ్లు క్రమేపీ మతిస్థిమితం కోల్పోయి, బలహీనులై మృత్యువాత పడతారని ఆమె హెచ్చరించింది.

Space Alien DNA ను శాస్త్రజ్ఞులు వైద్య విధానాల్లో వాడుతున్నారని, అమెరికా ప్రభుత్వంలో గ్రహాంతరవాసులు, రెప్టిలియన్ స్పిరిట్లు మారువేషాల్లో ఉన్నారని, హారీపోటర్ (Harry Potter)లో వర్ణించబడిన Illuminate (ఇల్యుమినాటి–కాంతి స్వరూపులు) గర్భస్రావాలు, స్వలింగ సంపర్కుల ద్వారా ప్రపంచాన్ని ధ్వంసం చేస్తున్నారని ఆరోపించింది. Homo Sexual Terrorism ఇప్పుడు ప్రపంచవ్యాప్త మయ్యిందని, దాని పరిణామాలు HIV/AIDS, ఇతర వ్యాధుల రూపంలో అమాయకుల్ని పొట్టనపెట్టుకుంటున్నాయని ఆమె విశ్లేషించింది.

స్టెల్లా ఇమ్మాన్యుయెల్ డొనాల్డ్‌ట్రంప్‌కు సపోర్టర్. 2019లో ఆమె తన క్లినిక్‌ను హూస్టన్‌కు మార్చుకున్నది. జనవరి 2020న ఆమెపై టెక్సాస్‌లో మెడికల్ నెగ్లిజెన్స్ కేసు పెట్టారు.

అమెరికా ఫ్రంట్‌లైన్ డాక్టర్స్ సుప్రీంకోర్టు భవనపు మెట్ల దగ్గర 27 జులై 2020 నాడు నిర్వహించిన Tea-Party Patriots Backed Event లో ఆమె పాల్గొన్నది. ఎజిత్రొమైసిన్, క్లోరోక్విన్, జింక్ మాత్రలతో 350 మంది రోగులకు కోవిద్–19 నయం చేసానని చెప్పుకున్నది. మాస్కులూ, సామాజిక దూరమూ అవసరం లేదని ఆమె సలహా ఇచ్చింది. ఆ సమావేశానికి రిపబ్లికన్ రిప్రజెంటేటివ్ రాల్ఫ్ నార్మన్ హాజరైనాడు.

ఈ వీడియోను సామాజిక మాధ్యమాలలో వేలాదిమంది చూసారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అతడి కుమారుడు దానిని retweet చేసారు. తరువాత Face Book, Twitter, You Tube లు ఆ వీడియోను తొలగించాయి. స్టెల్లా ఇమ్మాన్యుయెల్ హెచ్చరించింది– You are not bigger than God - నా పేజీని Restore చేయకపోతే మీ కంప్యూటర్లు క్రాష్ అవుతాయని' శాపనార్థాలు పెట్టింది.

అగ్రదేశపు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను – 'ఎందుకు మీరు ఆమెను సమర్థిస్తున్నారంటే' 'ఆమె చాలా చక్కగా మాట్లాడ్తుంది. అంతే' అని తన సమావేశాన్ని అర్థాంతరంగా ముగించాడు"

"మొత్తానికి డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు ఈ విషాద వాతావరణంలో హాస్యపు జల్లులు కురిపిస్తున్నాయి" అన్నాడు అంతర్యామి.

భావన అందుకున్నది– "ఛీర్‌లీడర్ ఆఫ్ అమెరికా కదా డొనాల్డ్ ట్రంప్. అతడి ఆశయమల్లా 'Give people Hope' – అయితే, ప్రజలు కోల్పోయిందీ అదే – ఆశ".

యల్లెస్సారిన్ అన్నాడు– "The Office of the Director of National Intelligence ప్రతిరోజూ ప్రెసిడెంట్ మాట్లాడే వివరణను తయారుచేసి ప్రెసిడెంట్ కిస్తుంది.

జనవరి 21, 2020 నాడు అమెరికాలో మొదటి కోవిద్–19 కేసు నిర్ధారించబడింది.

జనవరి 22న ప్రెసిడెంట్ ట్రంప్ మీడియాతో మాట్లిడినాడు– 'పరిస్థితి అదుపులో ఉన్నది. Just fine! It is one person coming from China!'

10 ఫిబ్రవరి – 'ఈ వ్యాధి ఏప్రిల్ ఎండలకు అదృశ్యమైపోతుందని ఎందరో నమ్ముతున్నారు'.

26 ఫిబ్రవరి – 'This is a flu, This is like flu'

27 ఫిబ్రవరి – 'అదృశ్యమైపోతుంది ఒక అద్భుతంలా!'

28 ఫిబ్రవరి – 'అమెరికాలో ప్రతి ఏడాది 35,000 మంది ఫ్లూతో చనిపోతున్నారు. ఈ వ్యాధితో ఇంతవరకూ ఒక్కరూ చనిపోలేదు'.

29 ఫిబ్రవరి – కొత్త కేసులు వస్తాయి, కంగారు పడనక్కరలేదు.

4 మార్చి – మరణాల సంఖ్య 1% కూడా ఉండదు. చాలా మంది డాక్టర్ల దగ్గరకు కూడా వెళ్లరు.

16 మార్చి – కరోనా అదుపు తప్పుతున్నట్లున్నది. ఇది 'చైనా' వైరస్.

17 మార్చి - నాకెప్పుడో తెలుసు ఇది మహమ్మారి అని.

19 మార్చి - ప్రజలను కంగారు పెట్టకూడదని నేను అలా చెప్పాల్సి వచ్చింది.

27 మార్చి - సొరంగానికి ఆవలివేపు ఉన్న వెలుగు కనిపిస్తున్నది.

31 మార్చి - ఇది సాధారణమైన 'ఫ్లూ' కాదు, ఇది మహమ్మారి.

27 ఏప్రిల్ - మరణాలు 60-70 వేల మధ్య ఉంటాయి. ఎక్కడన్నా మంటలు లేస్తే ఆర్పేస్తాము వాటిని వెంటనే.

1 మే - లక్షలోపు ఆగుతాయేమో మరణాలు.

8 మే - వ్యాక్సీన్ అవసరం ఉండకపోవచ్చు. డాక్టర్లు చెప్పిన దానిని నేను నమ్ముతున్నాను.

17 జూన్ - ఈ మహమ్మారి అదృశ్యమవబోతున్నది.

21 జులై - 'Gets worse before it gets better - ఆరిపోయే దీపానికి వెలుగెక్కువలా!' - అలా అంటూనే ఉన్నాడు ట్రంప్.

భావన అడిగింది- "'అవును యల్లెస్సారిన్! ప్రజలపై పట్టు ఉన్న నాయకులు, మత ప్రవక్తలు ఏది చెప్పినా వాళ్ల అనుయాయులు వాటిని వెంటనే పాటిస్తారు. మనదేశంలో కూడా - గోమూత్రపు పార్టీలు, ఆవుపేడ ఒంటికి పూస్తే కోవిడ్-19 వైరస్ దరిదాపులకే రాదన్న ప్రచారాలు విరివిగా సాగాయి కదా!

అలాగే 5G టెక్నాలజీపై రూమర్లు వచ్చాయి. అనేక చోట్ల సెల్‌ఫోన్ టవర్లపై విధ్వంసక దాడులు జరిగాయి. మనదేశంలో కూడా రాందేవ్ బాబా పతంజలి ఆయుర్వేద లిమిటెడ్ సంస్థ తయారుచేసిన 'Coronil' పై పెద్ద గాలిదుమారం చెలరేగింది".

యల్లెస్సారిన్ అన్నాడు- "ప్రభుత్వంలో ప్రధాన పదవులలో ఉన్నవాళ్లకు అధికారాలతో పాటు ఇబ్బందులూ ఉంటాయి. ఎందుకైనా మంచిదని డిఫెన్స్ స్ట్రాటజీతో డొనాల్డ్ ట్రంప్ - 'ఈ కరొనా వ్యాధి ప్రాణాంతకమైన వ్యాధి. ప్రభుత్వం తను చేయగలిగిన సాయం చేస్తుంది. మిగిలింది ఆ దేవుడి దయ!' అని చేతులెత్తేస్తే బాగుండేదా? విమర్శలు చేయడం, జరిగిపోయిన వాటిని సమీక్షిస్తూ- 'ఇలా జరిగితే, ఇలా చేస్తే ఎంతో బాగుండేది' అని అనడం కేవలం అనేవాడి ఆత్మ సంతృప్తికి పనికి వస్తుందనుకుంటా!

డొనాల్డ్ ట్రంప్ మొదట్నుంచి మాస్కులకు, సామాజిక దూరానికి వ్యతిరేకంగా ఉన్నాడు. 'We cannot let the cure be worse than the problem itself' – 'కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోకూడదన్నట్లు – ఈ ఐసొలేషన్ల వలన నష్టం ఎక్కువ' అన్నాడు. Herd Immunity రావాలి కాని ఈ దూరాలేమీ వైరస్ వ్యాప్తిని అడ్డుకోలేవు. మనం టెస్టులెక్కువ చేస్తే ఎక్కువ మందికి పాజిటివ్ వస్తుంది. దాని వలన భయం పెరుగుతుంది" – అది అతడి ఆలోచన.

"నిజమే కదా!" అన్నాడు అంతర్యామి. "ఎవరికి చెయ్యాలి పరీక్షలు? ఎవరికి చెయ్యకూడదు? ప్రపంచంలోని ఏడున్నర బిలియన్ల జనాభాకు చెయ్యాలంటే ఎంత వనరులు కావాలి? పుట్టిన పసిపిల్లల నుంచి అందరికీ చెయ్యాలా, వీళ్లలో పాజిటివ్ వచ్చిన వాళ్లందరికీ ఏంటివైరల్ ట్రీట్‌మెంట్ అవసరమా? మరి ఒకే ఇంట్లో ఉన్నవాళ్లలో ఒకరికి పాజిటివ్ వచ్చి ఐసొలేషన్‌లో ఉంటే మిగతావాళ్లకు ప్రస్తుతం నెగటివ్ వచ్చినా తరువాత వ్యాధి రాదని గ్యారంటీ ఉందా? పాజిటివ్ వచ్చి తగ్గినవాళ్లకు రెండోసారి వ్యాధి రాదా?

ఎప్పటికప్పుడు 'గైడ్‌లైన్స్' మారుస్తుంటే, ఒక సరైన పద్ధతి లేకుంటే లోపాలు, దుష్ఫలితాలు ఎక్కువ కావా?.

"మే 18న డొనాల్డ్ ట్రంప్ తాను స్వయంగా క్లోరొక్విన్ తీసుకుంటున్నానని ప్రకటించాడు. What have you got to lose?

స్టెల్లా ఇమ్మాన్యుయెల్ 27 జులై ప్రసంగాన్ని Retweet చేసాడు క్లోరోక్విన్ వాడకాన్ని బలపరుస్తూ.

'ఈ అల్ట్రావయొలెట్ కిరణాల ధాటికి వైరస్ మాయమవుతుందంటున్నారు కదా! Hit the body with tremendous light. పీడ విరగడవుద్ది'. –

న్యూయార్క్ టైమ్స్ పేపర్ విశ్లేషణ ప్రకారం– మార్చి 9–ఏప్రిల్ 17 మధ్య డొనాల్డ్ ట్రంప్ 2,60,000 పదాలు మాట్లాడినాడు. వాటిలో 600 సార్లు ఆత్మస్తుతి (Self Congratulations), 110 సార్లు పరనింద చేసినాడు.

అమెరికా ప్రధాన ఛీర్‌లీడర్‌కు తోడు డాక్టర్ ఏంథొని ఫౌసి (Dr. Anthony Fauci) అమెరికన్ ప్రజల్ని Good humour లో ఉంచడానికి ప్రయత్నించాడు కాని వాళ్ల హావభావాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు చందమైనాయి".

యల్లెస్సొరిన్ అన్నాడు– "ఈజిప్టు, కేమరూన్, ఇథియోపియా, కెన్యా, నైజీరియాలలో చైనా, జపాన్ దేశస్థులను దూషించడం, టాక్సీలోంచి దించి వేయడం లాంటి సంఘటనలు జరిగాయి. సౌతాఫ్రికా, ఆస్ట్రేలియాలో ఆసియా దేశస్థులపై పరుష పదజాలం వాడినారు. 'Hope this virus gets all of them'.

ఇదిలా ఉంటే చైనాలోనే ఇతర ప్రాంతాల వాళ్లు వుహాన్ ప్రావిన్స్ వాళ్లను వెలివేసినట్లు చూసారు. హెూటల్స్ వాళ్లకు గదులివ్వడానికి నిరాకరించాయట. షాంఘై ప్రయాణీకులు వుహాన్ ప్రయాణీకులతో కలిసి ఒకే విమానంలో వెళ్లడానికి అంగీకరించలేదు. ఇతర దేశాల నుంచి స్వదేశానికి వస్తున్న చైనీయులకు కూడా ఇదే పరిస్థితి ఎదురైంది.

చైనాలో నివసిస్తున్న నైజీరియన్లను ఖాళీ చేయించడం చైనా–ఆఫ్రికా సంబంధాలను చెడగొట్టింది. హాంకాంగ్‌లో చాలా రెస్టారెంట్‌లు మెయిన్‌లాండ్ చైనా నుంచి వచ్చిన వాళ్లకు ప్రవేశాన్ని నిరాకరించాయి.

ఇజ్రాయెల్‌కు వచ్చిన 1000 మంది దక్షిణ కొరియా యాత్రికులలో కొందరిని ఐసొలేషన్‌లో ఉంచారు. కొరియా పత్రికలలో– 'Israel is treating Tourists like Corona Virus' అనే వార్త ప్రముఖంగా వచ్చింది. జపాన్‌లో చైనా టూరిస్టులను 'Bio terrorists' 'డర్టీ పీపుల్' అని నిందించారు.

ఇండియా, మలేషియాలలో తబ్లిగి జమాత్ అనుయాయులను వైరస్‌ను వ్యాపింపచేస్తున్న వారిగా అనుమానించారు.

అన్ని దేశాలలోనూ కోవిద్–19 వ్యాధి విస్తరించడంతో చైనా, చైనా దేశీయులు అనేక రకాలుగా అవమానింపబడ్డారు. Anti Chinese Sentiment లేదా సినొఫొబియా, 'చైనా భయం' అందరికీ దయ్యంలా పట్టుకున్నది".

భావన అన్నది– "చైనా భయం (సినొఫొబియా-Sinophobia) రెండు ఓపియం యుద్ధాల కాలం నుంచే (1835–1860) ఉన్నది. చైనీయులు ఇతర దేశాల వ్యాపారస్తులపై హింసాయుతంగా తిరగబడడంతో సినోఫోబియా మరింత ఎక్కువైంది. నాగసాకిలో చైనా నావికుల హింసాయుత బలప్రదర్శనతో (ఆగష్టు 1886) జపాన్‌లో చైనాపై ద్వేషం తరువాత కాలంలో తొలి చైనా–జపాన్ యుద్ధానికి దారితీసింది.

ఇంగ్లాండ్, అమెరికా, రష్యాలాంటి దేశాల్లో కూడా 'చైనా టౌన్'లు తమ ప్రత్యేక ఆచారాల్ని పాటిస్తూ ఒక్కోసారి నేరాలకు, మాఫియాలకు నిలయంగా మారడంతో చైనా భయం అందరిలోనూ పట్టుకుంది. కొరియా విభజనకు కారణం చైనా అనేది చాలామంది కొరియన్ల అభిప్రాయం.

మంగోలియా, తైవాన్, హాంగ్‌కాంగ్‌లలో Anti-Chinese Sentiment మరింత ఎక్కువ; యుయిఘుర్ ముస్లిములు (Vyghurs), టిబెటన్లు చైనాను తీవ్రంగా వ్యతిరేకిస్తారు.

ఇండియా చైనాల మధ్య 1962 చైనా-ఇండియా యుద్ధం తరువాత సత్సంబంధాలు లేవు. 15-16 జూన్, 2020 నాడు జరిగిన సరిహద్దు సంఘర్షణలో ఇరవైమంది ఇండియా సైనికులు, 43 మంది చైనా సైనికులు మరణించారు. ఇంకా ఆ మంటలు చల్లారలేదు.

ప్రపంచ దేశాలకు చైనా భయం, చైనా వ్యతిరేక భావనలున్నట్లే, చైనీయులకూ పాశ్చాత్య దేశాల పోకడలు నచ్చవు. 1990 ప్రాంతం నుంచి Anti Western Sentiment చైనా యువతరంలో ఎక్కువయ్యింది. 1839 నుంచి 1949 కాలాన్ని The Century of Humiliation గా చైనీయులు భావిస్తారు. పాశ్చాత్య దేశాలు, రష్యా, జపాన్‌లు చైనాను దారుణంగా అవమానించి, అణగదొక్కిన శతాబ్దమది.

1999 NATO Bombing of the Chinese Embassy in Belgrade, One World - One Dream నినాదంతో 129 రోజులు, 137000 కిలోమీటర్లు సాగిన The Journey of Harmony - ఒలింపిక్ జ్యోతి పరుగులో - చైనాకు వ్యతిరేకంగా పాశ్చాత్య దేశాలలో ప్రదర్శనలు జరగడం, మార్చి 2008 టిబెట్ అల్లర్లను పాశ్చాత్య మీడియా చైనాకు వ్యతిరేకంగా వార్తలు వ్రాయడం ఇవన్నీ చైనీయులకు పాశ్చాత్య దేశాలపై వ్యతిరేకతను, ద్వేషాన్ని పెంచాయి.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ కోవిద్ మహమ్మారిని చైనా వైరస్, వుహాన్ వైరస్, కుంగ్ ఫ్లూ అని ఎగతాళి చేసిన విషయాన్ని చైనీయులు మరచిపోలేదు. ఈ వైరస్ జననం చైనాలోని వుహాన్ కావడం అది పాశ్చాత్య దేశాలలో విలయాన్ని సృష్టించడం వాళ్లూ మరచిపోలేరు. 2005 CIA Report లో పేర్కొన్నట్లు ప్రపంచంలోని మూడవ వంతు జనాభా నశిస్తేనే ఈ వైరస్ అంతమవుతుందా? ఏమో!"

✧✧✧✧✧

# 12. మృత్యు నృత్యం
## (Dance of Death)

**"యుద్ధరంగం నా దేవాలయం. కత్తిమొన నా పూజారి. మృత్యు నృత్యం నా ప్రార్థన, మరణఘాతం నా నిష్క్రమణ"** - సబా తాహిర్

"అర్ధరాత్రి వనరక్షకుడు తొంగిచూసాడు స్మశానంలోని సమాధుల వేపు. మసక వెన్నెలలో ఒక్కొక్క సమాధి మూత తెరుచుకుని పురుషులు, స్త్రీలు వస్తున్నారు బయటకు.

చిన్నా పెద్దా, పేదా-గొప్పా అందరూ త్వరపడుతున్నారు నృత్యం చేసేందుకు. అడ్డం వస్తున్నాయి వారిపై కప్పిన తెల్లని వస్త్రాలు. వాటిని కింద పడేసి చేస్తున్నారు నృత్యం.

కదిలాయి పాదాలు, కదిలాయి కాళ్లు, కంకాళాల చప్పుళ్లు, ఖాళీడబ్బాలో రాళ్లు; కదిలాయి చేతులు, కదిలాయి ఎముకల గూళ్లు. రకరకాల భంగిమలు, కరకరా లాడేను కీళ్లు.

వన రక్షకుడి చెవిలో గుసగుసలాడినాడు ప్రలోభపరుడు- "వెళ్లు, వెళ్లు వేసుకో వెనక పడి ఉన్న అంగీ ఒకటి". ఉత్సుకతో వెళ్లిన వనరక్షకుడు కప్పుకున్నాడొక వస్త్రం. చడీ చప్పుడు చేయకుండా చర్చిపైకెక్కి దాక్కున్నాడు మరుక్షణం.

నృత్యం ముగియగానే ఒక్కొక్కరే తమ వస్త్రాలను కప్పుకుని జొరబడ్తున్నారు సమాధుల్లోకి. ఒక కంకాళానికి దొరకలేదు తాను కప్పుకునే వస్త్రం. తడబడుతూ వెదికింది, తలుపుల్ని తడిమింది. వాసనను పసిగట్టి, వనరక్షకుడికై వెదికింది. పొడుగుకాళ్ల సాలెపురుగులా ప్రతి అడుగూ వేసింది.

వస్తున్న మృత్యువును వనరక్షకుడు చూసాడు. చర్చిపై గంటచాటున దాక్కున్నాడు మెల్లగా! వస్త్రం లేకుండా వెళ్లలేదు కంకాళం సమాధిలోకి. అది కూడా ఎక్కింది నెమ్మదిగా చర్చిపైకి. భయంతో కొయ్యబారినాడు వనరక్షకుడు. వణికిపోతూ ప్రాణాన్ని వదిలిపెట్టినాడు. తన వస్త్రాన్ని లాగబోతే రాలేదు ఆ క్షణం. ఇనుప కొక్కేనికి తగులుకుని ఇరుక్కుంది వస్త్రం. అప్పుడే మోగింది చర్చి గంట గణగణమని. ఆ శబ్దానికి విస్ఫోటించి ముక్కలైంది కంకాళం!

నిన్నటి వనరక్షకుడు ఇవ్వాళొక శవం. రేపు అతడూ చేస్తాడు వెన్నెలలో మృత్యునృత్యం”.

“నువ్వు చదువుతుంటే నాకు భయం వేసింది అంతర్యామీ!” అన్నది భావన.

“గెథె వ్రాసాడు కదా!” అడిగాడు యల్లెస్సారిన్.

“అవును” అన్నాడు అంతర్యామి. “జులై 1518లో ఆనాటి రోమన్ సామ్రాజ్యంలోని స్ట్రాస్‌బర్గ్ పట్టణం పౌరులను ఓ రకమైన ఉన్మాద స్థితి ఆవహించింది. ఫ్రా ట్రోఫియా ((Frau Troffea) అనే యువతి వీధిలోకి వచ్చి నాట్యం చేయసాగింది. ఒకరోజు కాదు, రెండు రోజులు కాదు – మొత్తం వారం రోజులపాటు. ఒక వారం పాటు ఆమె Solo-dance-a-thon చేస్తుంటే ముప్ఫై నలభై మంది ఆమెతో కలిసి సామూహిక నాట్యం చేయడం మొదలెట్టారు. ఆగష్టు కల్లా వాళ్ల సంఖ్య నాలుగు వందలు దాటింది.

వైద్యులన్నారు– ‘జ్వరం వల్ల వొళ్లు వేడెక్కింది. శరీరం నుంచి జ్వరాన్ని విసిరేయడానికి డాన్స్ వాళ్లకు ఉపయోగపడ్తుందనుకుంటా!’ నగరపాలకులు డాన్స్ చేసేవాళ్ల కోసం ‘స్టేజి’ ఏర్పాటు చేసారు, సంగీతంతో సహా! అయితే కొందరు డాన్సర్లు నృత్యం చేస్తూనే కిందపడి చనిపోయారు. అధికారులు మిగతా వాళ్లను బలవంతంగా కొండపై దేవాలయానికి తీసుకువెళ్లి దేవ ప్రార్థనలు చేయించారు తప్పులు క్షమించమని.

సెయింట్ వైటస్ అనే మతసాధువు శాపం పెడితే శాపగ్రస్తులు ఇలా మృత్యునృత్యం చేస్తారని ఆనాటి ప్రజలు నమ్మారు. ఎర్గాట్ విష ప్రభావమని, టరాంట్యులా సాలెపురుగు లేదా తేలు కుట్టడం వలన గాని, మాస్ హిస్టీరియా వలన గాని ఇలాంటి Dancing Mania వస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడినారు”.

యల్లెస్సారిన్ అన్నాడు– “దీనికన్నా భయంకరమైనది– ప్లేగువ్యాధి-Black Death, Pestilence, Great Mortality గా మానవ చరిత్రలోనే అత్యంత దారుణమైన మహమ్మారిగా పేర్కొనబడి, 75–200 మిలియన్ల జనాల్ని పొట్టన పెట్టుకున్నది 1347–1351 ప్రాంతంలో. ఎర్సినియా పెస్టిస్ అనే బాక్టీరియా దీనికి కారణం. ఈగలు ఈ వ్యాధి వ్యాప్తికి కారణం.

అంతకు ముందు 1315-1322 మధ్యకాలంలో వచ్చిన The Great Famine - మహాకరువులో పదిలక్షల మంది చనిపోయారు.

ఆ తరువాత వెంటనే వచ్చిన ప్లేగు వ్యాధికి ప్రపంచ జనాభా 47.5 కోట్ల నుంచి 35 కోట్లకు తగ్గిపోయింది. దాదాపు 150 సంవత్సరాలు పట్టింది మరల 1300 నాటి జనాభా సంఖ్యను చేరడానికి. అప్పుడప్పుడూ ఈ ప్లేగు తన ఉనికిని చాటుతూనే ఉన్నది ఇప్పటికీ. ఈగలకూ ఎలుకలకు మధ్య బాక్టీరియా వ్యాపించే ఆవర్తనాన్ని Sylvatic Cycle or Transmission Cycle అంటారు. మానవుడు సాధారణంగా Incidental or Dead end host.

డెంగు జ్వరాలు, ట్రిఖినోసిస్, ప్లేగు, ఛాగస్ వ్యాధి, రెబిస్ లాంటి వ్యాధులందుకనే అడపాదడపా ప్రత్యక్షమై వాటి Transmission Cycle ను పునరుద్ధరిస్తుంటాయి.

ఈ ప్లేగు కూడా చైనాలో మొదలై సిల్కురోడ్ ద్వారా ఇండియా, యూరప్, ఈజిప్టులలో వ్యాపించిందంటారు. నైలునది నిండిపోయిందట శవాలతో ఆ మహమ్మారి తాండవానికి.

ఇటాలియన్ ప్రయాణీకుడు అగ్నొలో డి తురా (Agnolo Di Tura) మే 1848లో ఇలా వ్రాసినాడు.

-'తండ్రి పిల్లల్ని, భార్య భర్తను, భర్త భార్యను, సోదరులు ఒకరినొకరు వదిలేసి పారిపోయారు. చనిపోయిన వాళ్లను పాతిపెట్టే దిక్కులేదు. డబ్బు, స్నేహం వీటికి విలువ పోయింది. చనిపోయిన వాళ్లను ఏ కర్మకాండలు లేకుండా గోతుల్లోకి విసిరిపారేసేవాళ్లు. సామూహిక ఖననాలే ఎక్కడచూసినా! నేను నా పిల్లలు అయిదుగురిని ఈ చేతుల్తో పూడ్చిపెట్టాను. శవాలను కుక్కలు పీక్కుతింటున్న దృశ్యాలెన్నో చూసాను. చచ్చిన వాళ్ల కోసం ఏడ్చేవాళ్లే లేరు. చావుకోసం ఎదురు చూస్తూ ప్రళయకాలమనీ, ప్రపంచం ముగింపుకు వచ్చిందనీ అందరూ భావించారు". -

భావన అడిగింది- "స్పానిష్ ఫ్లూ కూడా అంత విలయాన్ని సృష్టించింది కదా!"

"అవును" అన్నాడు అంతర్యామి. "1918-1920లో H1N1 ఇన్‌ఫ్లుయెంజా వైరస్ వలన యాభై కోట్లమంది వ్యాధిబారిన పడగా దాదాపు అయిదు కోట్లమంది

ప్రాణాలు కోల్పోయారు. ప్రపంచ యుద్ధకాలపు సెన్సారు నిబంధనల వలన మిగతా దేశాలలో ఈ వ్యాధి గురించి పెద్దగా వార్తలు లేవు. ప్రపంచ యుద్ధంలో స్పెయిన్ తటస్థంగా ఉండడంతో అక్కడ వార్తాపత్రికలు పదమూడవ ఆల్ఫోన్సొ రాజు ఆరోగ్యం గురించి ప్రముఖంగా వార్తలు వ్రాయడంతో అందరూ ఈ వ్యాధిని స్పానిష్ 'ఫ్లూ' అని పిలిచారు. దీనికి Naples Soldier, Brazilian Flu, German Flu, Bolshevic Disease అనేవి ఇతర పేర్లు.

ఈ ఫ్లూ మొదలైంది కన్సాస్ (Kansas)లో అని కొందరు, UK Troops in France వలన అని, చైనా పనివాళ్ల వలన చైనానుంచి వచ్చి యూరప్‌కు చేరిందని కొందరు అభిప్రాయపడినారు. నాలుగు అలల్లా 1918 మార్చి, 1919 ఆగష్టు, 1919, 1920లో వచ్చి అప్పటి ప్రపంచ జనాభాలో 5 శాతం మంది (ఇండియాలో 12–17 మిలియన్లు; అమెరికాలో ఎనిమిది లక్షల మంది, రష్యాలో నాలుగున్నర లక్షలమంది) మొత్తం కోటి, కోటిన్నరమంది ప్రాణాలు తీసిందీ మహమ్మారి. మరల 2009లో స్వైన్‌ఫ్లూగా దర్శనమిచ్చింది.

వీటితో పోల్చి చూసుకుంటే మొదటి ప్రపంచ యుద్ధంలో నాలుగు కోట్లమంది, రెండవ ప్రపంచయుద్ధం వలన ఏడు నుంచి ఎనిమిదిన్నర కోట్ల మంది అసువులు బాసినారు. ఒక్క ఇరవయ్యవ శతాబ్దంలోనే 108 మిలియన్ల మంది, మానవజాతి చరిత్రలో 150 మిలియన్ల నుంచి ఒక బిలియన్ (వంద కోట్లు) మంది యుద్ధాల వల్ల మరణించారు.

ఒక్క ఇరవైవ శతాబ్దంలోనే కరవు కాటకాల వల్ల 70–100 మిలియన్ల ప్రజలు మరణించారు. ఇప్పటికీ ఆఫ్రికాలాంటి దేశాలలో కరువు విలయతాండవం చేస్తూనే ఉన్నది.

ప్రపంచంలో ప్రతిరోజూ 1,50,000 మంది మృత్యువాత పడుతున్నారు. గుండె రక్తనాళాల వ్యాధులు, కాన్సర్, శ్వాసకోశ వ్యాధులు, రహదారి ప్రమాదాలు, ఇన్‌ఫెక్షన్లు, డయాబెటిస్, ఇన్‌ఫ్లుయెంజా–న్యుమోనియా ఇవి ముఖ్యమైన మృత్యు వాహకాలు.

2002లో మరణాల సంఖ్య 57 మిలియన్లు. 2016లో 56.7 మిలియన్లు. ప్రతి సంవత్సరం మరణాల సంఖ్య 50–60 మిలియన్ల మధ్య ఉంటున్నది.

ఇప్పటి వరకు భూమి మీద నివసించిన మానవుల సంఖ్య 80-150 బిలియన్లని ఓ అంచనా (107 బిలియన్లు). పదివేల సంవత్సరాల క్రితం 1-5 మిలియన్లున్న మానవులు సెప్టెంబరు 19, 2020 నాడు 7818 మిలియన్లు అయినారు (781 కోట్లు). ప్రతి సంవత్సరం 80 మిలియన్ల జనాభా పెరుగుతున్నది. 821 మిలియన్ల ప్రజలకు సరైన ఆహారం లభించడం లేదు. ప్రపంచ జనాభా 1.5-2 బిలియన్ల లోపుంటే మానవ మనుగడ సౌఖ్యంగా ఉంటుందని, 7.7 బిలియన్ల దగ్గర సమస్యలు మొదలవుతాయని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. మనం క్రిటికల్ పాయింట్-లక్ష్మణరేఖ దాటాము".

"1997లో U.S. Secretary of Defence విలియం కొహెన్ Ethnic Bio Weapon గురించి ప్రస్తావించాడు" అన్నాడు యల్లెస్సారిన్. "Race : the reality of Human Differences (2004) by Vincent Sarich and Frank Miele లో 'జెనెటిక్ బాంబు' గురించి వ్రాసినారు. 2004లో The Guardian పత్రిక - ఆల్జీమర్ వ్యాధిని నయం చేయడానికి వాడే పద్ధతులతో Ethnic Bioweapon తయారు చేయవచ్చని British Medical Association ఆందోళన చెందడం గురించి ప్రస్తావించింది. 2005లో International Committee of the Red Cross, 2008లో U.S. Congress Committee - దీనిని A new kind of arms race గా అభివర్ణించింది. 2012లో The Atlantic పత్రికలో Personalized gene therapy లానే వైరస్‌ను కూడా ఓ ప్రత్యేకమైన తెగకు మాత్రమే హాని చేసేలా మార్చవచ్చునని సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. 2016లో Foreign Policy అనే పత్రిక వైరస్‌ను జీవాయుధంగా వాడి 'Genetically related ethinic population' ను Sterilize - పిల్లలు పుట్టకుండా చేయవచ్చునని పేర్కొన్నది. (Terminator Seeds లా).

నవంబర్ 1998లోనే ఇజ్రాయెల్ Ethno Bomb తయారు చేస్తున్నదని పుకార్లు వచ్చాయి. మే 2007లో రష్యాలో Human Bio samples ఎగుమతిని నిషేధించారు.

Dark Forest అనే నవలలో (రచయిత Liu Cixin) ఓ టెర్రరిస్టు సంస్థ ఒక వ్యక్తి లక్ష్యంగా అతడి DNA ను దెబ్బతీసే బయోవెపన్ తయారు చేయడం గురించి వ్రాసినాడు.

Arma 3 లో కొన్ని తెగలపై మాత్రమే దాడిచేసే Engineered Variant of Malaria గురించి (Atrox Strain) పేర్కొనబడింది.

జొనాథన్ మాబెర్రి తన రెండవ నవల- 'The Dragon Factory'లో Ethnic Bioweapons గురించి ప్రస్తావించినాడు. Extinction Wave ను సృష్టించి కొన్ని తెగలను సమూల నాశనం చేయడమనేది దాంట్లో విలన్ ప్లాన్.

జీవాయుధాలపై నిషేధ ఒప్పందంపై ఏప్రిల్ 2013న 170 దేశాలు సంతకాలు చేశాయి. అంతకుముందు చాలాదేశాలు రసాయన, జీవాయుధాలను తమ ప్రత్యర్థులపై ప్రయోగించిన బాపతే!

తులరిమియా, ఆంథ్రాక్స్, బ్రుసెల్లోసిస్, బొటులిజం లాంటి విషాల్ని ఇంగ్లండ్, జపాన్, అమెరికా, రష్యా ఇంకా అనేక దేశాలు జీవాయుధాలుగా పరీక్షించినాయి.

ఇప్పుడు Clustered, Regularly Interspaced Short Palindromic Repeat (CRISPR-Cas 9) టెక్నిక్‌లో DNA వరుసను కత్తిరించి, కొత్త సీక్వెన్సు ప్రవేశపెడ్తారు. ఆ కొత్త సీక్వెన్సు జీవిలో కావాల్సిన ప్రొటీన్లను తయారుచేస్తుంది. ఈ జీనోమిక్ ఎడిటింగ్ జీవాయుధాల తయారీకి ఉపయోగపడ్తుంది. వీటితో

1) వ్యాక్సీన్‌లను పనికిరాకుండా చేయవచ్చు.

2) మందులకు రెసిస్టెన్స్ తెప్పించవచ్చు

3) ప్రమాదకరం కాని వైరస్, బాక్టీరియాలను ప్రమాదభరితంగా మార్చవచ్చు.

4) విషక్రిమి ప్రవేశాన్ని త్వరితగతం చేయవచ్చు.

5) పరీక్షలకు దొరకకుండా జన్యులిపిని మార్చవచ్చు.

మామూలు ఫ్లూ వైరస్‌ను ఒక దేశపు నాయకుడికి ప్రాణాంతకంగా మిగతావాళ్లకు సాధారణ జలుబును కలిగించేట్లు చేయవచ్చు ఈ జీవాయుధాలతో.

చైనాలో SARS Cov 1 (2003) బయట పడినపుడు అవి Measles - Mumps వైరస్ మిశ్రమమని Sergei Kolesnikov అనే రష్యన్ సైంటిస్ట్ ప్రకటించాడు. కాని రెండు పారామిక్స్ వైరస్‌ల నుంచి కరోనా వైరస్‌ను సృష్టించడం

సాధ్యం కాదని శాస్త్రజ్ఞులన్నారు. చైనాలో దానిని USA తయారు చేసిన Bioweapon గా ప్రచారం చేసారు.

Tony Zeng అనే రచయిత The Last Defense Line : Concerns About the loss of Chinese Genes - అనే పుస్తకాన్ని 2003లో ప్రచురించాడు. దానిలో అమెరికా సైంటిస్టులు చైనా ప్రజల రక్తం నమూనాలు సేకరించి (1990 ప్రాంతంలో) వాటితో చైనా ప్రజలకు అపాయం కలిగించేలా Bioweapon-జీవాయుధం తయారుచేసి SARS రూపంలో చైనాలో వదిలారని వ్రాసినాడు. కథలుగా ఇవి చదవడానికి బాగానే ఉన్నా అదే నిజమైతే?

కోవిద్-19 వైరస్ వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ నుంచి బయట పడిందని పాశ్చాత్య మీడియా కథనాలు వ్రాస్తుంటే, అది అమెరికాలోని Fort Detrick లో U.S. Army BSL-4 లో తయారుచేసి చైనాలో వదిలారని చైనా సామాజిక మాధ్యమాలలో ప్రచారం జరిగింది. ఎవరు నిజం చెబుతున్నారో, ఎవరు అసత్యమాడుతున్నారో మనకు అర్థం కావడంలేదు. 'తిలాపాపం తలా పిడికెడు' అన్నట్లు – అందరూ ఆ పని చేసినవాళ్లే ఇంతకు ముందు. 'ఈ కోవిద్-19 వైరస్ మాత్రం మా వ్యవహారం కాదు. అది గబ్బిలాల నుంచి పంగొలిన్లకు, వాటి నుంచి మనిషికి సోకింది' అని తప్పుకుంటున్నారు.

ఛార్లెస్ బొదలెర్ (Charles Baudelaire) అన్నట్లు– "మృత్యునృత్యపు పుకార్లను విని ఊపిరి బిగబట్టినట్లై దూరదేశాలకు పారిపోతావు. సియనె (Seine) శీతల లోయల్నుంచి, వేడి అవిర్లు విరజిమ్మే గంగానదీ ప్రవాహాల వరకూ, మర్త్య సమూహాలు నృత్యం చేస్తూ స్వప్నవీధుల్లో పోతున్నపుడు దేవదూతల ప్రళయబాకా పైకెత్తబడడం ఎవరూ చూడరు. ప్రతి చోటా, ప్రతి సూర్యుడి కిందా మృత్యువు పగలబడి నవ్వుతుంది, పిచ్చిమనుషులు పిరికితనంతో పరుగులు తీస్తుంటే! తనపై సాంబ్రాణి, గుగ్గిలాలను అలుముకుంటుంది మృత్యువు మీ తీరుగనే, మీ ఉన్మత్తతలో మీతో కలిసి చేస్తుంది మృత్యునృత్యం".

యల్లెస్సారిన్, అంతర్యామి, భావన చూస్తుండగానే బయట అంబులెన్స్ వస్తున్న శబ్దం వినబడింది. గుండెలు దడదడలాడుతుండగా, ఊపిరి బిగబట్టుకుని వాళ్లు ఆ అంబులెన్సు ఇటే రావడాన్ని చూస్తున్నారు.

# 13. నలుగురు అశ్వికులు
## (The Four Horsemen)

**"ఆ అపురూప, అద్భుత, అలౌకిక సమావేశంలో అత్యంత ప్రకాశపు సన్నిధిలో గొర్రెపిల్ల–**

**మొదటి సీలు తెరవగానే వచ్చినాడు**

**తెల్లటి గుర్రంపై అశ్వికుడు= మహమ్మారి (Pestilence-Conquest)**

**రెండవ సీలు నుంచి ఎర్రటి గుర్రంపై అశ్వికుడు = యుద్ధం (War),**

**మూడవ సీలు నుంచి – నల్లటి గుర్రంపై అశ్వికుడు = కరువు (Famine).**

**నాలుగవ సీలు నుంచి – పాలిపోయిన గుర్రంపై అశ్వికుడు = మృత్యువు (Death)**

**రాగా అతడిని నరకం అనుసరించింది. వారికి ఒక్కొక్కరికి నాలుగవ వంతు భూమిపై అధికారం ఇవ్వబడింది. కరకు వ్యాధితో, యుద్ధాలతో, కరువు కాటకాలతో, క్రూరమృగాలతో విలయాన్ని సృజించడానికి!"**

– జాన్ – రివిలేషన్స్

"అక్కడ ఉన్న నాలుగు జీవ జంతువులు– సింహం, ఎద్దు, మనిషి, గద్ద, ఆరు రెక్కలతో ఉండి దేవుని స్తుతిస్తున్నవి.

అయిదవ సీలు విప్పగానే దేవుని మాట విశ్వసించి ప్రాణాలు కోల్పోయిన పవిత్ర ఆత్మలు వచ్చినారు.

ఆరవసీలు విప్పగానే భూమినేలిన రాజులు, నాయకులు, బానిసలు, స్వేచ్ఛాజీవులు అందరూ బయటకు వచ్చారు. వాళ్లు చేసిన దుష్కార్యాలకు సింహాసనంపై ఉన్న మహాశక్తి రూపునికి, గొర్రెపిల్లకు తమ ముఖాలను చూపలేక పర్వతాలను తమపై పడమని వేడుకుంటున్నారు.

శ్వేతవస్త్రాలు ధరించి, గొర్రెపిల్ల రక్తంతో తడిచి పునీతులైన వారి నుదుటిపై స్వర్గలోకపు గుర్తు వేయబడినది.

ఏడవ సీలు విప్పగానే– ఓ అర్ధగంటసేపు స్వర్గం నిశ్శబ్దమయ్యింది.

ఏడుగురు దేవదూతలు బాకాలు (ట్రంపెట్స్) చేత బట్టినారు. (కొమ్ము బూర–బాకా).

మొదటి దేవదూత బాకా ఊదగానే – రక్తంతో తడిచిన అగ్ని వడగళ్లు కురిసి మూడవ వంతు భూమి నాశనమయ్యింది.

రెండవ దేవదూత బాకా ఊదగానే మండుతున్న అగ్నిపర్వతాలు సముద్రంలో పడి మూడవ వంతు సముద్రాలు, నౌకలు ధ్వంసమయ్యాయి.

మూడవ దేవదూత బాకా ఊదగానే ఓ గొప్ప జ్వాలానక్షత్రం (Worm Wood) నదుల్లో పడగా మూడవ వంతు నదులు, జలధారలు చేదెక్కి విషమయమై ఆ నీళ్లు తాగిన మనుషులు మరణించారు.

నాలుగ దేవదూత బాకా ఊదగానే మూడవ వంతు సూర్యుడు, చంద్రుడు, తారలు నాశనం కాగా వాటి కాంతిలో మూడవ వంతు నశించింది.

'Woe, woe, woe to those who dwell on the earth – భూమిపై నివసించేవాళ్లకు దుఃఖాలూ, కష్టాలూ...

అయిదవ దేవదూత బాకా ఊదగానే ఓ ప్రచండ నక్షత్రం నేలపై పడి అడుగులేని గోతిని ఏర్పరచగా దానిలోంచి వచ్చిన పొగలో అసంఖ్యాకమైన మిడతలు, తేలుకాటుకు సమానమైన విషంతో మనుషుల్ని కుట్టసాగినాయి. మనిషి ముఖం, స్త్రీల శిరోజాలతో యుద్ధాశ్వాల్లా అవి రొదచేస్తూ అబడ్డాన్ అనబడే అపొలియాన్ నాయకత్వాన భూమిపై కారుమేఘాల్లా కమ్ముకున్నాయి.

ఆరవ దేవదూత బాకా ఊదగానే నలుగురు దేవదూతలు వచ్చారు. అగ్ని, పొగలు, గంధకాలతో మూడవ వంతు మనుషుల్ని నాశనం చేసారు.

ఏడవ దేవదూత బాకా ఊదగానే అనేక స్వరాలు దేవుని ప్రస్తుతిస్తూ వినవచ్చాయి. స్వర్గంలోని దేవుని ఆలయం తెరవబడగా Ark of Covenant దర్శనమిచ్చింది. మెరుపులు, ఉరుములు, శబ్దాలు, పిడుగులు, భూకంపాలు, వడగళ్లతో ఆలయం దద్ధరిల్లింది.

స్వర్గంలో కానవచ్చింది ఓ స్త్రీ. సూర్యుడు తన వస్త్రంగా, చంద్రుడు ఆమె పాదాల కింద ఉండగా ఆమె శిరస్సుపై పన్నెండు తారలున్న కిరీటం మెరవగా, పుటినెప్పులతో ఆమె జన్మనిచ్చిన శిశువు ఆమె పక్కన ప్రకాశిస్తున్నాడు.

మరల భయంకర శబ్దాల మధ్య కానవచ్చింది, అక్కడ ఓ మహా డ్రాగన్ రక్తవర్ణంతో. ఏడుతలలు, పది కొమ్ములు, ఏడు కిరీటాలున్నాయి దానికి. తన తోకతో మూడవ వంతు నక్షత్రాలను నేలరాల్చింది. ఆ స్త్రీ వద్దనున్న శిశువును

మింగాలని చూసింది డ్రాగన్. ఆ శిశువు రేపటి నాయకుడు. శిశువుని దేవునికి చూపించి ఆమె, దైవం నిర్ణయించిన చోటుకు పారిపోయింది. అక్కడ 1260 రోజులు ఉంటుందామె.

మైఖెల్ నాయకత్వాన ఉన్న దేవదూతలకు డ్రాగన్ అనుయాయులకు జరిగిన యుద్ధంలో డ్రాగన్ (సాతాను లేదా డెవిల్ అని పేరుగల వంచకుడు) ఓడిపోయి తన అనుచరులతో భూమిపైకి నెట్టివేయబడతాడు. పారిపోతున్న స్త్రీ వెంటబడ్తూ, డ్రాగన్ కక్కుతున్న విష ప్రవాహాలను భూమి అడ్డుకుంటుంది.

నలభై రెండు నెలలు డ్రాగన్ దైవనింద చేస్తూ భూమిని వణికిస్తుంది" అన్నాడు అంతర్యామి.

భావన అన్నది– "అంబులెన్సు శబ్దం మనవేపు రాగానే చూసావా ఎంత భయం వేసిందో! దానికి తోడు నీ రివెలేషన్స్ వ్యాఖ్యానం మరింత భయాన్ని కలుగజేస్తున్నది".

యల్లెస్పారిన్ అన్నాడు– "2005 CIA రిపోర్టు నమ్మితే ఈ వైరస్ ప్రపంచంలో మూడవవంతును మింగెయ్యాలి. అప్పుడుగాని ఇది శాంతించదు''.

భావన అడిగింది– "అన్ని మతగ్రంథాల్లోనూ మానవుల దుష్ప్రవర్తన మితిమీరితే దైవాగ్రహానికి గురౌతారని చెప్పబడింది కదా! మరి ఎందుకు మనుషులు మారరు?"

అంతర్యామి అన్నాడు– "వైఫల్యాలన్నీ మనలో ఉంచుకుని ప్రకృతిపైన, దేవుడిపైన నెపం, భారం వేస్తున్నది మానవజాతి. పవిత్ర గ్రంథాలలో ప్రతీకాత్మకంగా చెప్పబడిన (Allegorical) విషయాలను అర్థం చేసుకోవాలి మనం".

యల్లెస్పారిన్ అన్నాడు– "మొదటి అశ్వికుడు (First Horseman) - తెల్లటి గుర్రంపై వచ్చినాడు అతడి చేతిలో విల్లున్నది. ఆరు రెక్కల సింహం అరుస్తూ ఉండగానే నాలుగవ వంతు భూమిని ఆక్రమించుకున్నాడు మహమ్మారిగా మారి.

రెండవ అశ్వికుడి చేతిలో ఖడ్గమున్నది, ఎర్రటి గుర్రంపై అతడు నాలుగో వంతు భూమిపై శాంతిని తొలగించి నిత్య కలహాలతో నింపినాడు. ఆరురెక్కల ఎద్దు లేదా గోవు అరుస్తూనే ఉన్నది.

మూడవ అశ్వికుడు నల్లటిగుర్రంపై, త్రాసు (తుల)ను చేతబూని వస్తున్నాడు. కరువు కాటకాలతో నాలుగోవంతు నేల కంపించిపోతున్నది. ఆయిల్, వైన్‌కు కరువు లేదు కాని గోధుమ, బార్లీలకు చీడపట్టుకున్నది. ఆరురెక్కలున్న మనిషి ముఖం ఆకలితో అరుస్తూనే ఉన్నది.

నాలుగవ అశ్వికుడు పాలిపోయిన బూడిద రంగు గుర్రంపై, నరకం వెంటరాగా మృత్యువుగా విషవ్యాధుల్ని విరజిమ్ముతూ వచ్చి నాలుగవ వంతు నేలను పొగతో కమ్మినాడు ఆరు రెక్కలున్న గద్ద ఆక్రందనలు చేస్తూనే ఉన్నది.

'నేను మృత్యువును!'

'కావచ్చు! మేం అలవాటు పడిపోయాం! నీపని నీవు కానివ్వు!'

'ఎవరు మిమ్మల్ని రక్షించగలరు?'

'ఎవరో రక్షిస్తారన్న నమ్మకం ఒకప్పుడుండేది. ఇప్పుడు మాకర్థమయ్యిం దేమిటంటే ప్రకృతి మాకిచ్చిన రక్షణ కవచాల్ని మేమే నాశనం చేసామని. క్రమేపీ మాలోని దైవభావన నశిస్తున్నది'

'ప్రేమించు! ప్రేమ నిన్ను కాపాడ్తుంది ఈ మహమ్మారుల నుంచి!'

'ప్రేమ! ఏమిటా ప్రేమ? అన్నిటికన్నా పెద్ద మహమ్మారి ప్రేమ. చంపకుండానే చంపుతుంది. జ్వలిస్తూనే శీతలమవుతుంది'.

'ఇది నా శీతల కరవాలం! ఇది నా చల్లని స్పర్శ! ఇది నా మంచు వాహనం'.

'జీవితం నిప్పుల గుండం మీద నడవడమయినప్పుడు నీ శీతల పవనాలే మాకు స్వాంతననిస్తాయి. రా! నీ కరవాలాన్ని నా మెడకానించు'.

'నీకు ఆఖరి అవకాశాన్నిస్తాను. పో! వెళ్లి చేసిన తప్పుల్ని సరిదిద్దుకో!' అన్నది మృత్యువు.

అంతర్యామి అన్నాడు "యల్లెస్సారిన్! నలుగురు అశ్వికులు నాలుగు వేపులా కల్లోలాన్ని సృష్టిస్తున్నారు సరే! డ్రాగన్ అగ్నిజ్వాలల్ని జిమ్ముతూ వస్తుంటే సింహాలూ, ఎద్దులూ, మనుషులూ, గద్దలూ దానికి ఫలహారమే కదా!"

యల్లెస్సారిన్ అన్నాడు– "మానవజాతి ఒక్కటిగా ప్రకృతి వనరుల్ని పంచుకుని జీవిస్తుంటే ఇంత కల్లోలం జరిగుండేది కాదు. ఇప్పుడు భూమిపై ఉన్న మానవుల సంఖ్య 7.8 బిలియన్లు. ప్రపంచ జాతీయోత్పత్తి (2017) 81 ట్రిలియన్ డాలర్లు. అమెరికా–21, చైనా–14, జపాన్–5, జర్మనీ–4, UK-3, ఇండియా–3, ఫ్రాన్స్–3, ఇటలీ, బ్రెజిల్, కెనడా–2 ట్రిలియన్ డాలర్ల GDP సాధించాయి. పంచితే ఒక్కొక్క మానవుడికి GDP=10,000 డాలర్లు. సమసమాజమే సాధ్యమైతే పదివేల డాలర్లు (ఏడు లక్షల రూపాయలు) సరిపోయేవి కావా? ప్రతి ఏడుగురిలో ఒక్కరికి తింటానికే సరైన తిండి లేదు ఇవ్వాల్టి రోజున.

ఏ దేశం గొడవ దానిదే! ఏ రాష్ట్రం గొడవ దానిదే! ఏ ప్రాంతం గొడవ దానిదే! ఏ మతం గొడవ దానిదే! ఏ భాష గొడవ దానిదే! ఎవడి గొడవ వాడిదే! ఏకాభిప్రాయం సాధ్యపడేనా?"

భావన అన్నది– "శాస్త్రజ్ఞానం రెండంచుల కత్తిగా మారింది. చేసేది చేస్తూనే మేం చేసేది మీరు చెయ్యవద్దంటారు ఇదివరకే తప్పులు చేసిన వాళ్లు. అణ్వాయుధాలు, రసాయన, జీవాయుధాలు గుట్టలు గుట్టలుగా దాచిపెట్టుకుని కొత్తవి వద్దు పాతవి నెమ్మదిగా ధ్వంసం చేద్దామంటారు. ఒకరినొకరు నమ్మరు. పాతగాయాలు పగిలి చీమూ రక్తం కారుతూ సలుపుతుంటే మానవత్వం సంగతి మరచి జాతి మత కుల వర్ణ వైరాలతో ఒకరినొకరు చంపుకుంటున్నారు. ఈ పరిస్థితి మారి అందరూ హాయిగా ఉండే ప్రపంచం వస్తుందా?"

"మనం తార్కికంగా కొన్ని వాదనలను పంచుకుందాం" అన్నాడు యల్లెస్సారిన్. "ఈ కరోనా కాస్త ఉపశమించాక మరల పునరుజ్జీవనపు చర్యలు మొదలవుతాయి. కొన్నేళ్లపాటు యుద్ధం మౌనం వహిస్తుంది. మానవులకు మరపు సహజం కదా! గాయాలు నయమైనాక మచ్చలు దురద పెడ్తుంటాయి. మనుషులందరినీ మత్తులో ముంచి తానొక్కడే అధినేతను కావాలనుకున్నవాడు కొత్త మాదక ద్రవ్యాన్ని ఇన్ఫినిటి టెక్నాలజీగా అభివృద్ధి చేస్తాడు. దైవకణాల్ని (హిగ్స్‌బొసాన్), మృత్యు కణాలను మదర్ బోర్డ్‌పై సంధించి, టెస్ట్‌ట్యూబుల్లో, జీన్ ఎడిటింగ్‌తో సరికొత్త వైరస్‌ను సమ్మోహనాస్త్రంగా మలిచి మానవ మెదళ్లను నిద్రపుచ్చి జోంబీల సైన్యాన్ని తయారుచేస్తాడు".

అంతర్యామి అన్నాడు– "నాకైతే రేపటి యుద్ధాలన్నీ నీటికోసమో, మతం కోసమో జరుగుతాయనిపిస్తుంది. మొదట బహుదేవతారాధన ఉన్న మతాలు వర్గ

విభేదంతో నశిస్తాయి. ఒకే దేవుడనే మతంలో అందరికీ అందుబాటులో ఉన్న మతం తనకు పూర్వం ఉన్న మతాలను ఓడించి ఆ Conquest లో విజయాన్ని సాధిస్తుంది. దేవుడిని నమ్మని దేశాలు తూర్పు నుంచి విస్తరించి, దేవుడిని నమ్మే దేశాలపై దండయాత్ర చేస్తాయి".

"ముసుగులో గుద్దులాట ఎందుకు అంతర్యామీ!" అన్నది భావన. "నిజం నిష్ఠూరంగా ఉన్నా చెప్పక తప్పదు. ప్రస్తుతం ప్రబలంగా ఉన్నవి పాశ్చాత్య క్రైస్తవ దేశాలు, ఆఫ్రికా ఖండపు ఇస్లాం దేశాలు, భారతదేశం, చైనా.

అబ్రహామ్ మతాల్లో ఏదో ఒకటి మిగిలి ఒక పక్కన, స్టేట్ ఎథియిజం ఉన్న చైనా, ఉత్తర కొరియాలాంటివి మరో పక్కన ఉండి అగ్రపీఠానికై కొట్టుకుంటాయి. మరల శాంతి జెండాల్ని పక్కన పడేసి కత్తుల్ని చేబడతారు. మనుషుల్ని నడిపించేది భక్తి, భయం అయినపుడు భక్తి క్రమేపీ నశిస్తున్నది. Fear is the key - భయమొక్కటే మిగిలింది. శత్రు భయంకరుడే విజేత. విజేత గాథలు విజయ కావ్యాలవుతాయి. శాంతిపర్వం చప్పగా ఉంటుంది. యుద్ధం ఉప్పు, మృత్యుకారం నోటికి తగిలి జివ్వుమంటేనే నరాలు ఉప్పొంగి ప్రతీకారాలు పడగవిప్పుతాయి".

అంతర్యామి అన్నాడు– "అవును భావనా! మనుషులంతా ఒక్కటే అనేమాట వినీ వినీ విసుగు పుడుతున్నది. వాస్తవంలో ఆ అభిప్రాయాలన్నీ మిథ్యగా కానవచ్చి మారని సమాజాన్ని చూసి ఏవగింపు పుడుతున్నది. నవంబరు 3, మంగళవారం నాడు అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికలు. అక్కడా సత్యహరిశ్చంద్రులెవరు లేరు. కాపిటలిస్టులలో అగ్రనేత ఎవరో తెలిసాక స్టేట్ కాపిటలిస్ట్ అగ్రనేత తన ప్రణాళిక, వ్యూహాన్ని తిరగరాస్తాడు. ఈలోగా– 'వ్యాక్సీను లన్నిటిలో ఏ వ్యాక్సీను మేలు?' అన్న పాట పల్లవి దగ్గరే ఆగిపోతుంది. ఆర్థిక నిపుణులు స్టాక్ ఎక్స్చేంజీల దగ్గర కూర్చుని తమ సిద్ధాంతాలెందుకు ప్రపంచంలో ఆకలి సమస్యను పరిష్కరించలేకపోయాయో అర్థంకాక రాజకీయవేత్తలపై నిందలు మోపుతారు. రాజకీయవేత్తలు తమ చూపుడువేలును ప్రజలవేపు చూపిస్తారు. ప్రజలు కరోనావ్యాధి కాలంలో తమకు తగిలిన దెబ్బకు చాలీచాలని మందు పూసుకుంటూ దాచుకున్న కన్నీళ్లను పొదుపుగా వాడుకుంటూ జీవన పరుగుపందెంలో చెమటలు కక్కుతుంటారు.

ఈలోగా కరోనా వ్యాధిగ్రస్తులు తమకు పనిచేస్తుందో లేదో తెలియని మందుల్ని గ్రాములెక్క మింగి ఇంకో కొత్త రోగం రాకూడదని కొండదేవరలకు మొక్కుతుంటారు.

బర్బరీకుడి మూడు బాణాలలో మొదటిది మంచివాళ్ల నుదుటిపై దేవుని ముద్ర వేస్తుంది. రెండవ బాణం చెడ్డవాళ్ల భుజాలు, నుదుటిపై సాతాను ముద్ర వేస్తుంది. మూడవ బాణం సాతాను ముద్ర వున్న వాళ్లను నాశనం చేస్తుంది".

యల్లెస్సారిన్ అన్నాడు– "క్రోమోజోము 6లో ఉండే హ్యూమన్ ల్యూకోసైటిక్ ఏంటిజన్లు (HLA) ఈ విధంగానే స్వపర నిర్ణయం చేయడానికి తోడ్పడుతాయి. జీన్ ఎడిటింగ్ చేసేప్పుడు శాస్త్రజ్ఞులు ఒక వ్యక్తిని ప్రత్యేకంగా గుర్తించే జన్యువులను గుర్తించేందుకు DNA Micro array technology వాడతారు. ఈ టెక్నాలజీ ద్వారా వివిధ రకాల కణజాలాన్ని, కాన్సర్ కణాలను గుర్తించడం వీలవుతుంది.

వైరస్‌లను కూడా జెనెటిక్ ఇంజినీరింగ్ ద్వారా మార్చి Ethnic Bombలో RNA Interference తో ఒక సమూహంలోని ముఖ్య జీవరసాయన చర్యలను ఆపివేయవచ్చు. డాక్టర్ Vivienne Nathavson అభిప్రాయం ప్రకారం - "With an ethinically targeted weapon, you could even hit groups within a population". ఈ Ethnic Bomb తయారీలపై ఇజ్రాయెల్, అమెరికాలను ఇతర దేశాలు వేలెత్తి చూపుతున్నాయి. ఇరవై ఏళ్లలో (1998–2020) జెనెటిక్ ఇంజినీరింగ్ చాలా అభివృద్ధి చెందింది. అన్ని దేశాలలో రహస్య ఆయుధాలు తయారవుతూనే ఉన్నాయి. సర్వమానవ కళ్యాణం కన్నా స్వార్థ జీవనంపై దృష్టి పెరిగింది. ఈలోగా కోవిడ్–19 విషపు పొగలు ప్రపంచాన్ని చుట్టుముట్టి వణికిస్తున్నాయి".

భావన అన్నది– "హాలాహలం జగాలనెల్లటినీ చుట్టుముట్టినపుడు శివుడు తన ప్రియసతి పార్వతితో అన్నాడట–

'కంటే జగముల దుఃఖము
వింటే జలజనిత విషము వేడిమి ప్రభువై
యుంటకు నార్తుల యాపద
గెంటింపగ ఫలముగాదె కీర్తి మృగాక్షీ!'

కోవిద్–19 విషాన్ని వ్యాక్సీనులతో తొలగించేందుకు రష్యా, చైనా, అమెరికా, ఇంగ్లండ్ తదితర దేశాల సైంటిస్టు శివుళ్లు వాళ్ల ప్రయత్నాలు వాళ్లు చేస్తున్నారు.

శిక్షింతు హాలాహలమును
భక్షింతును మధుర సూక్ష్మ ఫల రసముక్రియన్
రక్షింతు ప్రాణి కోట్లను
వీక్షింపుము నీవు నేడు వికచాబ్జముఖీ!

గొంతులోనే గొడవ చేస్తున్న కోవిద్–19ను గొంతులోనే ఆపేసే గరళకంఠ క్రియలు త్వరలో వస్తాయని ఆశ.

మహమ్మారి, యుద్ధం, కరువు, మృత్యువు అనే నాలుగు అశ్వికులకు ప్రజా, ప్రభుత్వ వైఫల్యాలు తోడై ప్రపంచమంతా మృత్యువుకు రంగస్థలమైనది.

ఆశలు, స్వప్నాలు వీధుల పాలైనపుడు తలుపుల వెనకాల (లాక్‌డౌన్) కిటికీలు మూసుకుని దాక్కోవడం మంచిది, ఆ విషపు ఆగ్రహజ్వాలలు ఉపశమించేంత వరకూ!

నాకు భయం వేసింది. వాళ్లంటున్నారు– ఎంత అద్భుతమైన ప్రపంచం ఇది! నూతన సంవత్సరపు వేడుకల కోసం ఎంతగా ముస్తాబైనది! ఇంతలో ఎంత మార్పు! నలుగురు అశ్వికులూ ఆమెను చుట్టుముట్టినారు. వారి స్వార్ధపూరిత దాడులకూ, విధ్వంస జ్వాలలకూ మానవత్వపు మూర్తి మసకబారిపోయింది'.

అప్పుడు నేను చూసాను. తూర్పుదిక్కున అరుణకాంతుల మధ్య ప్రేమ అనే అత్యంత తెల్లని గుఱ్ఱంపై మెరుపులా వస్తున్న మహావీరుడిని! సమస్త మానవాళిలో మిగిలి ఉన్న మంచితనం దైవభావన కాగా, దివ్యమూర్తి మాట (Word of God) గా రూపొందిన అతడు ఆశాసైన్యసమేతంగా వస్తున్నాడు. అతడిని చూసి డ్రాగన్, సింహం, గరుడపక్షి, మహా వృషభాలూ, సర్పాలూ, నెమళ్లూ అచేతనమైనాయి.

సమస్త విషాలకూ విరుగుడు అతడి ప్రేమలో ఉన్నది. ఆ ప్రేమామృత ధారలకు తడిచిన మానవతాకన్య పునరుజ్జీవితురాలై సమసమాజ వనంలో నిర్భీతిగా సంచరించసాగింది" అన్నాడు యల్లెస్సారిన్.

"సమసమాజమనేది అద్భుత స్వప్నం" అన్నది భావన. "కల నిజమయితే బాగుండును".

"నిజమవుతుంది తప్పక" అన్నాడు అంతర్యామి. "ఇప్పటి వరకూ మనం నేర్చుకున్న పాఠాలను పునశ్చరణ చేయాలి. మన వైఫల్యాలను పునఃసమీక్షించి ప్రకృతి సంపదలు అందరికీ అందేట్లు చేయాలి. దానికి జవాబుదారీగా ప్రపంచ సంస్థలు పనిచేయాలి" అన్నాడతడు.

"నేను హాస్పిటల్‌కు వెళ్లాలి. స్వేచ్ఛను చూసి వస్తాను" అన్నది భావన.

"నేను కూడా భావనకు తోడుగా వెళ్లి వచ్చేప్పుడు మనకు కావాల్సిన సరుకులు తెస్తాను" అన్నాడు అంతర్యామి.

వాళ్లిద్దరూ వెళ్లాక యల్లెస్సారిన్ ఏదో ఆలోచిస్తూ నిద్రలోకి ఒరిగాడు. ఎంతసేపు నిద్రపోయాడో తెలీదు. తనను ఎవరో పిలుస్తున్నట్లు అనిపించి బయటకు వచ్చాడు. ఎవరూ కనిపించలేదు. వీధి అంతా నిర్మానుష్యంగా ఉంది. వీధిమలుపు వరకు వెళ్లివద్దామని ముందుకు నడిచాడు. వెనక నుంచి ఓ Light ash - బూడిద రంగు కారు వేగంగా వచ్చి కాస్త ముందుకు వెళ్లి ఆగింది. ముందుసీట్లో డ్రైవర్ తనవంకే నిశితంగా చూస్తున్నాడు. అతడి శిలాసదృశ ముఖంలో ఏ భావమూ కనిపించలేదు. కార్‌డోర్ అద్దాన్ని దించి యల్లెస్సారిన్ వేపు చూసాడు.

"లిఫ్ట్ కావాలా!" అన్నట్లు.

ఎయిర్ కండీషన్డ్ కారులోంచి శీతల వాయువులు ఒక్కసారిగా యల్లెస్సారిన్‌ను చుట్టుముట్టాయి.

వద్దన్నట్లు తల ఊపాడు యల్లెస్సారిన్. వచ్చినంత వేగంగానే అతడు అదృశ్యమైనాడు. ఆ కారు వెళ్తుంటే ఎందుకో కాని యల్లెస్సారిన్‌కు పాలిపోయిన గుర్రంపై వచ్చిన నాలుగో అశ్వికుడు గుర్తుకొచ్చాడు. ఇప్పటికీ అతడి చూపులు తనను వెంటాడుతూనే ఉన్నాయి.

✧✧✧✧✧

# 14. కలల రహదారి

## (The Highway of Dreams)

**"ఆ దారి మామూలు రహదారి కాదు. సంధ్యాసమయానికి చీకటిరాత్రికి మధ్య నీవు నడుస్తున్నపుడు నిన్నెవరూ అనుసరించకపోవచ్చు, బహుశా ఆ దారి నీ అడుగుల కొరకే ప్రత్యేకించినదేమో!"** – రాబర్ట్ హంటర్.

ప్రతి మనిషీ రోజుకు 7500 అడుగులు వేస్తాడట. అరవై ఏళ్లు బతికితే 164,250,000; డెబ్బై ఏళ్లు బతికితే 191,625,000, ఎనభై ఏళ్లు బతికితే 216,262,500 అడుగులు వేస్తాం. ఆగకుండా నడిస్తే ఎనభై ఏళ్లలో 110,000 మైళ్లు నడిచి– భూమి చుట్టూ అయిదు ప్రదక్షిణాలు (భూమధ్యరేఖ దగ్గర) చేయవచ్చు. భూమి చుట్టుకొలత 28,735 మైళ్లు (40 వేల కిలోమీటర్లు) ఆదిదంపతుల కుమారులలో చిన్నవాడు కుమారస్వామి నెమలినెక్కి నలభై వేల కిలోమీటర్లు తిరిగి భూప్రదక్షిణం చేసి వచ్చేప్పటికి, పెద్ద కుమారుడు తల్లి పార్వతి చుట్టూ ఎలుక మీద ఎక్కి తన ప్రదక్షిణాలు పూర్తిచేసాడు.

510 మిలియన్ చదరపు కిలోమీటర్ల ఉపరితలమున్న నేలపై వెన్నెలలు కురిపించే చంద్రుడు 384,400 కిలోమీటర్ల దూరంలో ఉండి కాంతిలీనుతుంటాడు. 150 మిలియన్ కిలోమీటర్ల దూరంలో సూర్యుడు, మనకు దగ్గరలో ఉన్న నక్షత్రం Proxima Century 40,208,000,000,000 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. మనకింకా చాలా దూరాలు తెలుసుకాని, మనిషికి మనిషికి మధ్య ఉన్న దూరం తెలియదు.

ఈ దూరాలు పెరిగిపోతూనే ఉన్నాయి. మనకు కరొనా వైరస్ పరిమాణం తెలుసు (60–120 నానోమీటర్లు) అణువులలోని శకలాల భారం తెలుసు. దైవకణం అనబడే హిగ్స్‌బొసాన్ గురించి తెలుసు. నీ దగ్గర ఉన్నవాళ్లపై నీవు మోపుతున్న భారం తెలియదు.

చీలిపోయాం మనమెప్పుడో, చీలికలు చీలికలుగా; డబ్బును అలంకారాలను, స్వర్ణ రజతలోహాలను, నవరత్నాలను తలకెత్తుకుంటున్నాం. మనసును తొక్కి పాతిపెడ్తున్నాం. సాటిమనిషిని అవమానాల పాలు చేస్తున్నాం. కష్టకాలం వచ్చినప్పుడే సమానత్వపు అవసరాలను గుర్తిస్తున్నాం. కలరాకు ఇండియాను,

కరోనాకు చైనాను, అణ్వాయుధాలకు అమెరికాను, టెర్రరిజానికి పాకిస్తాన్, ఇరాన్‌ను తిట్టిపోస్తున్నాము ఈ కోవిద్-19 జనవరి ఒకటి, 2020న మొదలైందనుకుందాం! మనమేమన్నా మారామా? పోనీ, నేనేమన్నా మారానా? ఋజువేది?

పైకెక్కాల్సిన మెట్లు కనిపిస్తున్నాయి కాని, ఎక్కి వచ్చిన మెట్లవేపు దిగువకు చూడాలంటే భయం. ఇంకా ఎంతెత్తు ఎక్కాలి వెలుగును దర్శించేందుకు?

ఒక్కసారి బయటకు వెళ్తే మళ్లీ లోపలకు అడుగుపెట్టలేని ఇల్లు నీది. ఎవరికీ పనికి రాదు లుకలుకలాడే పురుగులకు తప్ప. దానికోసం ఎన్ని రక్షణా వలయాలు? ఎన్ని కోటగోడలూ, అగడ్తలూ!

దారిలో ఎక్కడో నిన్ను నీవు పోగొట్టుకున్నావు. అవయవాల మార్పిడి, బయొనిక్స్, వ్యాక్సీనులు! నీలో ఒరిజినల్ పార్టులన్నీ ఒకటొకటే రిప్లేస్ చేయబడుతున్నాయి కొత్తకొత్త లోహాలతో, రిజెక్షన్ - రియాక్షన్ రాకుండా వాడే మందులతో. మనసును కూడా రిప్లేస్ చేస్తారు వీళ్లు త్వరలో ఏ జెనెటిక్ ఇంజనీరింగో చేసి.

మన ఏవజగత్సర్వం, మన ఏవ మహారిపుః
మన ఏవ హి సంసారో, మన ఏవ జగత్త్రయమ్

అని ఋభుగీతలో చెబుతారు- "ఈ మనసే సర్వజగత్తు, ఈ మనసే పరమశత్రువు. మనసే సంసార హేతువు, మనసే ఈ మూడు లోకాలూ అని".

నాకైతే "ఈ మనసే పరమ శత్రువు" అన్నమాట బాగా నచ్చుతుంది. జాన్ మిల్టన్ అన్నట్లు- మనసు తన స్వంత ప్రదేశంలోనే ఉండి స్వర్గాన్ని నరకంగా, నరకాన్ని స్వర్గంగా మార్చగలదు.

అక్కడ తోటలో పిల్లలు ఆడుకుంటున్నారు. రవీంద్రనాథ్ టాగోర్ అంటాడు- ప్రతి శిశువూ దేవుడి నుంచి సందేశాన్ని తీసుకువస్తుంది 'తానింకా మానవుడి గురించి ఆశాభంగం చెందలేదన్నమాటను'.

మనం రేపటి తరానికి ఏమిస్తున్నాం? వారసత్వంగా మన సంపదలను, అలవాట్లను, ఆచారాలను వాటితోపాటు మనం నాశనం చేసిన ప్రకృతిని ఇచ్చి మనం నిష్క్రమిస్తున్నాం. అరచేతిలో అర్థం పర్థం లేని ప్రపంచాన్ని చూపిస్తూ వాళ్ల ఊహలు పెరగకుండా అడ్డుకుంటున్నాం. నలుగురు అశ్వికులూ కొత్త రూపాల్లో

(మహమ్మారి, యుద్ధం, కరువు కాటకాలు, మృత్యువు) వస్తుంటే వాళ్లకు మన పిల్లలను టార్గెట్ ప్రాక్టీస్‌కు వదిలేస్తున్నాం.

22 సెప్టెంబరు 2020 – కోవిద్–19 వ్యాధిగ్రస్తుల సంఖ్య: ప్రపంచంలో 3,16,28,025; మరణాలు: 9,71,779. ఇండియాలో 56,17,699 / 89,579; అమెరికాలో 70,57,560 / 2,04,867.

మొత్తం మీద మనం అనేక వైఫల్యాలను చవిచూసాం, అనేక పాఠాలు నేర్చుకున్నాం ఈ కరొనా మహమ్మారి కాలంలో.

ఏ ప్రత్యామ్నాయమూ లేకుండా ప్రజల్ని అకస్మాత్తుగా క్వారంటెయిన్‌లోకి నెడితే వచ్చే ఇబ్బందుల్ని చూసాము. ఆ తరువాత నిబంధనల్ని ఉల్లంఘించి వలస జనం స్వస్థలాలకు పోతున్నపుడు వారి పాదాల రక్తపు అడుగుజాడల్ని చూసాం! వాళ్లు తిరిగి రావడానినీ చూస్తున్నాం. తొమ్మిది నెలలు పనిలేకుండా తింటూ లావైన వాళ్లను, తొమ్మిది నెలలు పనిలేకుండా తిండికి మొహం వాచి చిక్కిపోయిన వాళ్లనూ చూసాము.

నిన్నటిదాకా మనతో ఉండి ఇవ్వాళ ఒక తెల్లటి ప్యాకేజీగా మారి ఒంటరిగా మృత్యుగృహాల్లోకి, చితిమంటలలోకి నిష్క్రమించిన వాళ్లనూ చూసాము. ఎక్కడో సుదూరాన ఉండి తన వాళ్లను కడసారి చూపుగా వాట్సప్‌లో చూసి కుమిలిపోయిన వాళ్లనూ చూసాము. ఎవర్ని కదిలించినా కన్నీటి గాధలే!

వీటిలో స్వంత వైఫల్యాలూ, రాజ్య వైఫల్యాలూ ఉన్నాయి. వాటిని సరిదిద్దుకునే ప్రయత్నాలు మాత్రం లేవు. ఈ గండం గట్టెక్కితే చాలు మరలా ఎవరి దారిలో వాళ్లు, ఏమాత్రం మార్పూ ఉండదు.

కలల రహదారిలోనూ దారిదోపిడీ లెక్కువైనాయి. ఎప్పుడు తెల్లవారుతుందో తెలీదు. తెలిసేలోపలే బతుకులు తెల్లవారుతున్నాయి.

మనవాళ్లనుకున్న వాళ్లు క్వారంటెయిన్లోకి వెళ్లినపుడు వాళ్లు ఒంటరితనంతో కుములుతున్నపుడు భయం అనే వైరస్ కోవిద్–19 వైరసుకన్నా ఎక్కువ బాధపెడ్తుంది.

గతమంటే బాధ, వర్తమానంలో క్షోభ, భవిష్యత్తులో శూన్యత మనసుల్ని నలిపివేస్తున్నాయి. ఈ దేహనగరిలోకి వైరసు ప్రవేశించినాక తలుపులు మూస్తే

ఉపయోగమేమిటి? అన్ని తలుపులూ అదే తెరుస్తున్నది నాసికల నుంచి నిత్య ప్రవాహాలు.

అయినా మన అలవాట్లు మారలేదు, ఆచారాలు, పరువు హత్యలూ, నిమ్నోన్నతా భావాలూ, వారసత్వ సంకెలలూ తెగలేదు. ఎప్పుడు ఈ ఉత్పాతం నెమ్మదిస్తుందా, ఆగిన మన దందా ఎప్పుడు మొదలెడ్దామా అనేదే ఆలోచన. మనసు మొద్దుబారినాక మౌనమే మిగుల్తుంది.

"నాకేం రాసిపెట్టుందో నాకు తెలీదు. ఇదంతా ముగిసాక ఏమవుతుందో నా ఊహకూ అందడం లేదు. ఈ క్షణాన నాకర్థమయ్యిందేమిటంటే ఇంకా జనం వ్యాధిబారిన పడుతున్నారు. వాళ్లకు వైద్యం కావాలి! అవును, మరల మరల చరిత్రలో ఇది వస్తూనే ఉంటుంది. రెండూ–రెండూ కలిస్తే నాలుగన్నవాడికి మరణదండన విధిస్తారు" అంటాడు ఆల్బర్ట్ కామస్ 'The Plague' అనే పుస్తకంలో.

అబద్ధాలకు ఆకర్షణీయమైన దుస్తులు తొడుగుతాము, సత్యాన్ని నగ్నంగా దాచుకుంటాం. ఎక్కడో మనలో ఏదో తెలియని తుఫాను మనల్ని ముంచెత్తడానికి సిద్ధంగా ఉంటుంది. గుండెలో పొంగే సునామీ అలలు కళ్లలో ఉప్పెనలవుతాయి. మనసంతా మేఘావృతమై ఉరుములు మెరుపులు మెరుస్తాయి. ప్రచండ విద్యుదావేశంతో విద్యుల్లతలు విరిగిపడగా భ్రాంతులు నాశనమవుతాయి. ఇలకు, భువికి వారధి, ఇంద్రధనుస్సులా కానవచ్చే కలల రహదారి కూలిపోతుంది.

"మరల కొత్త వంతెన నిర్మించుకోవాలి నేను"

ఈ కథ ముగిసేసరికి యల్లెస్సారిన్ కలల రహదారి వంతెనపై నిలబడి క్రింద ప్రవహిస్తున్న నీటి ప్రవాహం వేపు చూస్తున్నాడు. చాలా నీరు వెళ్లిపోయింది దిగువకు. స్వేచ్ఛ ఇంకా హాస్పిటల్‌లోనే ఉన్నది. అంతర్యామి ఏదో ఆలోచనలో ఉన్నాడు. భావన ఆశాదీపాన్ని వెలిగిస్తున్నది.

అంతా నిశ్శబ్దంగా ఉంది ఆ సమయాన మనసు కోల్పోయిన మనిషి మందిరంలా! అకస్మాత్తుగా గణగణమని గంటలు మోగాయి నాలుగు దిక్కులా. నలుగురు అశ్వికులు నాలుగు దిక్కులకు పోతున్న భావన. తూర్పువేపు తెల్లగుర్రంపై మహమ్మారి; ఉత్తరం వేపు ఎర్రగుర్రంపై యుద్ధం; దక్షిణం వేపు నల్లగుర్రంపై కరువు కాటకాలు; పడమటి వేపు పాలిపోయిన గుర్రంపై అతడు...

చూస్తున్నకొద్దీ ఆ గుర్రం బూడిదరంగు కారులా మారి తనవేపే వస్తున్నదా అన్న భావన కలిగింది యల్లెస్సారిన్‌కు. ఆ కారు ఇటే వచ్చి తన ముందు ఆగితే డ్రైవర్‌ను తను గుర్తుపట్టగలడా! శిలాసదృశమై, ఏ భావమూ లేని శీతల వదనం అతడిది. ఎలా మరచిపోతాను! సంధ్యాసమయపు వెలుగులు తగ్గిపోయి మసక మసకగా చీకటి కమ్ముకువస్తున్నది. ఈసారి ఆ బూడిదరంగు కారు ఇటు వచ్చి ఆగుతుందా! దూరంగా పడమటి దిక్కున రెండు నక్షత్రాలు వెలిగాయి, ఆ బూడిదరంగు కారు లైట్లలా! యల్లెస్సారిన్ గుండె ఓ క్షణం ఆగి తిరిగి కొట్టుకోసాగింది. తానూ ఓ అశ్వాన్ని ఎక్కి కూర్చున్నట్లు – కారుకు అందకుండా పారిపోదామని – అయిదో అశ్వికుడిగా!

✧✧✧✧✧

**(మృత్యువు తరుముకొస్తున్నపుడు వేగంగా పారిపోతున్న గుర్రం, అశ్వికుడు కలిసిన భయరూపమే అయిదో అశ్వికుడు! (The Fifth Horseman!)**

## "The Fifth Horseman is Fear"

- Zbynek Bryngch

**కనియెం గోమల నీలమేఘ విలసత్ కాలాంజనా కారు ఘో**
**ర నిశా తోత్కట దంష్ట్ర నుజ్జ్వల చలత రక్షాక్షున్ బ్రత్యగ్ర కాం**
**చన వర్ణాంబరు నంత్యకాల దహన జ్వాలా ప్రచండున్ జగ**
**జ్జన సంత్రాసకు నొక్కదివ్య బటుపాశ ప్రౌఢ హస్తోధతున్**

అలా సావిత్రికి కానవచ్చినాడు ఎవరికీ కనబడని యమధర్మరాజు. అతడే, తిండీ తిప్పల్లేక నీరసించి తన గుమ్మం వద్ద పడిఉన్న నచికేతుడినీ చూసాడు. అతడికి మరణం లేని అంతరాత్మ గురించి చెప్పాడు–

**అంగుష్ఠమాత్రం పురుషోంతరత్మా**
**సదా జనానాం హృదయే సన్నివిష్టః**
**తం స్వాచ్ఛరీరాత్ పృవృహేన్ముంజాదివేషీకాం ధైర్యేణ**
**తం విద్యాచ్ఛు క్రమమృతం తం విద్యాచ్ఛుక్రమ మృతమితి**

-"Fear is the mind-killer. Fear is the little death that brings total deliteration. I will face my fear. I will permit it to pass over me and through me. And when it has gone past I will turn the inner eye to see its path. Where the fear has gone there will be nothing. Only I, will remain"-

**"భయం మనసును చంపుతుంది"**

**- Frank Herbert,** Author of 'Dune'

# వర్తమానం లేని వర్తమానం
## (Presentless Present)

**"ఎప్పుడూ గతంలోనే తిరగకు. భవిష్యత్ గురించి స్వప్నిస్తూ ఊరకే కాలాన్ని వృథా చేయకు. ఈ క్షణపు సమయంపై మనసును నిలుపు"** – బుద్ధుడు.

వాళ్లందరూ అదే చెప్పారు– నిన్న ఒక చరిత్ర, రేపు ఏమీ తెలియని మార్మికత. ఈరోజు నీకొక కానుకగా ఇవ్వబడిన వర్తమానం (ఆలిస్ మోర్స్ఎరల్). ఈరోజు నీ రేపటి జీవితంలో మొదటి రోజు. అందుకనే ఒంటరిగా ధ్యాన నిమగ్నుడవై నీ లోపలి స్వరం చెప్పే మాటల్ని విను. లేకుంటే ఇతర గొంతులు నీ నడకను ప్రభావితం చేస్తాయి, నీ మనసుకు ఊపిరాడకుండా చేసి!

నిరాశలో ఉన్నావంటే గతాన్ని తవ్వుతున్నావని, ఆందోళనలో ఉన్నావంటే భవిష్యత్తును వెదుకుతున్నావని, శాంతిగా బతుకుతున్నావంటే వర్తమానాన్ని చదువుతున్నావని అర్థం. ఈ అనంత కాలంలో నీవే పని చేయలేని రోజులు రెండు. ఒకటి నిన్న (Yesterday), రెండోది రేపు (Tomorrow). అందుకని ఈరోజు ముఖ్యమైనది, జీవించడానికి, విశ్వాసానికి, ప్రేమను పంచుకోడానికి ప్రతిరోజూ కొత్తగా పుట్టాలి. గతం వాకిలి దగ్గరే ఆగిపోరాదు. ఏమీ తెలియని భవిష్యత్తులోకి ఎగిరే ప్రయత్నం ఫలించదు.

రకరకాల మందులు, వైద్య విధానాలు వస్తున్నాయి. పోతున్నాయి. 'ముల్లుపోయి కర్రవచ్చె ఢాం, ఢాం' అన్నట్లు ఎవరి లెక్కలు వాళ్లకున్నాయి. ఈ కోవిద్ దెబ్బకు ఇంతకు ముందు మూలనపడిన మందులన్నీ మరల ముందుకు దూకుతున్నాయి.

18 మార్చి 2020న WHO సాలిడారిటి ట్రయల్ (Solidarity Trial) ప్రారంభించింది. Covid-19 వ్యాధికి వాడుతున్న నాలుగు ట్రీట్‌మెంట్ ప్రొటొకాల్స్‌ను అధ్యయనం చేయడం దీని ఉద్దేశం.

Remdesivir, Lopinavir / Ritonavir, Lopinevir / Ritonavir with Interferon - Beta ఎప్రూవ్ అయ్యాయి. క్లోరోక్విన్ వాడకాన్ని జూన్ 2020 నుంచి ఆపివేసారు.

Recovery trial లో డెక్సామిథసోన్ వాడటం వలన మరణాల రేటు మూడవ వంతు తగ్గిందని భావించడంతో స్టెరాయిడ్స్ వాడవచ్చునని ప్రకటించారు. స్టెరాయిడ్స్ వలన కంటిచూపు తగ్గుతుందని కొందరంటున్నారు.

ఇప్పుడు డాక్సిసైక్లిన్, ఐవర్‌మెక్టిన్‌ల వాడకం ఊపందుకున్నది. వీటిలో డాక్సిస్రెక్లిన్ ఏంటిబయాటిక్, ఐవర్‌మెక్టిన్ – ఏంటి పారసైటిక్. వీటిని తొలిదశలో వాడటంతో వైరస్ ఉద్ధృతి ఆపవచ్చుననేది భావన. కోవిడ్–19 పాజిటివ్ వచ్చి Home treatment ఫాబిఫ్లూ (Favipiravir), డాక్సిసైక్లిన్, ఐవర్‌మెక్టిన్, ప్రెడ్నిసలోన్, పాంటప్రజోల్, జింక్, కాల్షియం–విటమిన్ D3, ల కాక్‌టైల్ వాడుతున్నారు.

వైరల్ ఇన్‌ఫెక్షన్‌లో స్టెరాయిడ్లు, ఏంటిబయాటిక్స్ వాడవద్దు – సూపర్ ఇన్‌ఫెక్షన్లు వస్తాయి అని ఢంకా బజాయించి చెప్పినవాళ్లు ఈ మహమ్మారిలో ఎమాక్సిసిల్లిన్, ఎజిత్రొమైసిన్, డాక్సిసైక్లిన్, ఐవర్‌మెక్టిన్, సెఫ్యురాక్సిమ్ లాంటి మందుల్ని భారీగా వాడేసారు. క్లోరోక్విన్‌ను టన్నులకొద్దీ కొని మింగ గలిగినంత మింగేసారు.

ఫావిపిరావిర్, రెమ్‌డెసివిర్, ప్లాస్మా, ఇంటర్‌ఫెరాన్, మోనోక్లోనల్ ఏంటిబాడీ మందులుఅన్నీ జనం మింగారు. కొన్ని జనాన్ని మింగాయి. ఈ ట్రయల్ అండ్ ఎర్రర్ ప్రహసనాలు ముగిసేసరికి వైరస్ తన శక్తిని కోల్పోవడమో, లేక మానవజాతిలో ఇమ్యూనిటి పెరగడమో జరిగి కాస్త ఉపశమనం లభిస్తుంది.

ఇప్పుడు చేస్తున్న వందలాది పరీక్షలకు అదనంగా మరో కొన్ని పరీక్షలు వచ్చి చేరాయి. అందరూ హాపీయేనా! మనల్ని రక్షిస్తాయనుకున్న మాస్కులూ, సామాజిక దూరాలూ, ఐసొలేషన్లూ ఏవీ వ్యాధివ్యాప్తిని అరికట్టకపోవడానికి కారణం మనం నిబంధనలను సరిగా పాటించకపోవడమేనా?

1) మాస్కులు – సర్జికల్ మాస్కు నుంచి N95, N99, FFP లాంటి మాస్కులు వచ్చాయి, పోయాయి. ఇప్పుడు ఎవరికి తోచింది వాళ్లు వాడుతున్నారు.

2) శానిటైజర్లు – చేతులు సబ్బుతో సరిగా కడుక్కుంటే చాలని తేల్చారు చివరకు. ఈలోగా లీటర్ల కొద్దీ శానిటైజర్లు, రకరకాల సబ్బులూ పోటీపడ్డాయి, అమ్ముడుపోయాయి. చేతులకు దురద మిగిలింది.

శానిటైజర్లలో ఉండేది ఆల్కహాలు కనుక కొందరు వోడ్కా, ఆల్కహాలు, బీరులతో

చేతులు కడుక్కున్నారు. బీరు, వోడ్కా కొనలేనివాళ్లు ఫ్రీగా దొరికే శానిటైజర్లు తాగి ప్రాణం మీదకు తెచ్చుకున్నారు.

బ్రెజిల్‌లో వినిగార్‌తో చేతులు కడుక్కున్నారు. ఫిలిప్పీన్స్‌లో పెట్రోల్, డీజిల్‌లో చేతులు ముంచారు. సైంటిస్టులు 'పిలాతే' చేతులు కడుక్కున్నట్లు కాస్త మంచినీళ్లతో చేతులు కడుక్కుని, టవల్‌తో తుడుచుకుంటే చాలని సలహా ఇచ్చారు. ఈలోగా వీధుల్ని, శరీరాల్ని హైపోక్లోరైట్ ద్రావణాలతో స్ప్రేలు చేసి చేసి ఇప్పుడు ఆపేసారు.

3) ముక్కువైద్యాలు – బ్లీచింగ్ పౌడరు, పసుపూ, హైడ్రోజన్ పెరాక్సైడ్, ఉప్పునీళ్లు ఆవిరిపట్టడం, పుక్కిలించడం లాంటి పద్ధతులు వచ్చి కొన్ని పోయాయి, కొన్ని నడుస్తూనే ఉన్నాయి. అమృతాంజనం, జండూబాం, జిందా తిలిస్మాత్‌లకు గిరాకి పెరిగింది.

4) టెంపరేచర్ – ఎండాకాలంలో వైరస్ చస్తుందని అందరూ భావించినా అది వానాకాలం దాకా దాక్కోకుండా వ్యాప్తి చెందుతూనే ఉన్నది. వేడినీళ్లు పసుపు, మిరియాలు తాగడం వలన చాలామంది జీర్ణకోశం, పేవులకు సంబంధించిన వ్యాధులతో బాధపడ్తున్నారిప్పుడు. 'అతి సర్వత్ర వర్జయేత్' అనేది అర్థమయ్యింది. అల్ట్రావయొలెట్ కిరణాలు వైరస్‌ను అరికడ్తాయి కాని అవి చర్మానికి, కళ్లకు ప్రమాదం కలిగిస్తాయి. శ్రీలంకలో తెల్లటి రుమాలు వాడితే వైరస్ ఎక్కువవుతుందని పుకారు సృష్టించారు. ఫిలిప్పీన్స్‌లో తాల్ అగ్నిపర్వతం దగ్గరున్న బూడిద వైరస్‌కు విరుగుడని ప్రచారం జరిగింది.

5) 5G టెక్నాలజి – 5G సెల్‌ఫోన్లు టవర్ల వల్ల విద్యుదయస్కాంత తరంగాలు విడుదలై వైరస్‌లను మార్చి కొత్తకొత్త వ్యాధులకు కారణమవుతున్నాయన్న ప్రచారాన్ని నమ్మి కొందరు సెల్‌ఫోన్ టవర్లను ధ్వంసం చేసారు. 5G కార్యాలయాలపై దాడి చేసారు. ఈలోగా 5G-Bioshield అనే ఫ్లాష్‌డ్రైవ్‌లు విరివిగా అమ్ముడుపోయాయి.

6) మందులు, కషాయాలు, కాక్‌టైల్స్ – ఆంఫిటమైన్, కొకెయిన్, నికొటిన్‌లు కలిపిన మందు 'Dark web' ద్వారా 300 డాలర్లకు అమ్ముడుపోయింది కోవిడ్–19కు వ్యాక్సీన్ పేరుతో.

కొకైన్, కన్నాబిస్, క్లోరోఫారం, ఉడకబెట్టిన తమలపాకులు, మిథనాల్, ఇథనాల్ ఇవన్నీ ఈ తొమ్మిది నెలల కాలంలో అనేకులు వాడినారు. సామాజిక మాధ్యమాలలో ఇవి వైరల్ కావడంతో వాడిన కొందరు జబ్బులపాలైనారు.

7) తాయెత్తులు– 'వైరస్ షటవుట్ ప్రొటెక్షన్' లాంటి తాయెత్తులు జపాన్‌లో కంఠహారాలుగా అమ్మబడినాయి.

హోమియోపతిక్ 'ఇన్‌ఫ్లుయెంజా కాంప్లెక్స్', ఆర్సెనికమ్ ఆల్బమ్, కొల్లాయిడల్ సిల్వర్, టూత్‌పేస్టులు, సోడియం క్లోరైట్‌తో చేసిన మించిల్ మినరల్ సొల్యూషన్ (MMS), షువాన్‌గువాన్‌గ్లియాన్ (Shuanghuanglian) అనే చైనా నాటుమందు, మెథిలిన్ క్లోరైడ్, క్లోరిన్ డై ఆక్సైడ్ లాంటి వైరస్ విరుగుడు పద్ధతులన్నీ ఆక్షేపణకు గురైనాయి.

8) సెలబ్రిటి మందులు – వీటిలో డొనాల్డ్‌ట్రంప్ పేర్కొన్న క్లోరోక్విన్ (గేమ్ ఛేంజర్), అల్ట్రావయొలెట్ కిరణాలు; వ్లదిమిర్ పుతిన్ ప్రచారం చేసిన Gan-Covid-Vac స్పుత్నిక్ వ్యాక్సీను; ఆస్ట్రేలియా చెఫ్ ప్రచారం చేసిన ఫాన్సీవైట్ మెషిన్ – Biochanger NG Subtle Energy Platform (ఖరీదు 14900 డాలర్లు) ఉన్నాయి.

9) చెట్ల మందులు – ఉమ్మెత్త కషాయం, కాలమేఘ మూలికారసం, మకాబుహె కంటిచుక్కలు, లెమన్‌గ్రాస్, అల్లం, మిరియాలు, నిమ్మరసం, తేనెల మిశ్రమం, ఒలియాండ్రిన్ – ఇవన్నీ ఇప్పటికీ వాడుతూనే ఉన్నారు ప్రజలు కోవిద్ విషానికి విరుగుడుగా.

10) మంత్ర తంత్రాలు – స్వామి చక్రపాణి వారి 'గోమూత్ర పానం', Cow urine drinking party, మిడిల్‌ఈస్ట్‌లో ఒంటెమూత్రం వాడినవాళ్లకు కరోనా వైరస్ తగ్గడం మాట అటు ఉంచి, మూత్రపానం వల్ల టైఫాయిడ్, టి.బి. MERS లాంటి వ్యాధులు వస్తాయని తేలింది.

'టెలివిజన్‌ను 'టచ్' చేయండి! నేను మీకు నా ఆశీస్సులు పంపుతా'నన్నాడు కెన్నెత్ కోప్‌లాండ్ అనే టెలి ఇవాంజలిస్టు.

Happy Science అనే మత సమూహపు ప్రచారకుడు Spirtual Vaccines ను వంద నుంచి నాలుగు వందల డాలర్లకు అమ్మి బ్లెస్సింగ్స్ అందచేసాడు. ఇరాన్‌లో ఒక మత ప్రచారకుడు 'Prophets Perfume' అనే మందును రోగులకు ఇచ్చినాడు కోవిద్–19కు విరుగుడుగా!

రమేష్ బిదురి అనే భారతీయ పార్లమెంటేరియన్ 'నమస్తే' వైరస్ వ్యాప్తిని ఆపుతుంది, 'ఆదాబ్', 'అస్సలాంలేకుం'లు నోటివైపు గాలిని పంపి వైరస్ వ్యాప్తిని ఎక్కువ చేస్తాయని ప్రకటించాడు. గొప్ప గాలిశాస్త్రవేత్త ఇతడు.

11) పళ్లూ-ఫలాలు - నిమ్మకాయలు, అరటిపళ్లు, మామిడికాయలు, దురాన్ ఫలాలు, ఉల్లిపాయల వాడకం పెరిగింది. వీటివల్ల వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చు అన్న భావనతో.

వెల్లుల్లి, అల్లం, మిరియాలు, కాకరకాయ రసం, పసుపు, వేపాకులు వాడని ఇల్లు లేదేమోననిపిస్తున్నది ఇప్పుడు. తేనీరు, ఆల్కహాలు, వేడినీళ్లు, ఫెన్నెల్ టీ, రకరకాల కషాయాలు ఇంకా తాగుతూనే ఉన్నారు. కడుపులో మంట, విరేచనాలతో డాక్టర్లను సంప్రదిస్తున్నారు.

12) మాంసం, చేపలు - 'No Meat No Corona Virus' నినాదం ట్విట్టర్‌లో రాజ్యమేలింది కొన్నాళ్లు. చికెన్ మీద ఆ దెబ్బపడితే మంత్రులొచ్చి 'మేం తింటున్నాం, మీకేమీ కాదు' అని చెప్పాల్సి వచ్చింది.

అమెరికాలో క్లోరోక్విన్, అజిత్రొమైసిన్, జింక్ ట్రీట్‌మెంట్ వల్ల డాక్టర్ వ్లదిమిర్ జెలెంకొ, స్టెల్లా ఇమ్మాన్యుయెల్ లాంటి వైద్యులు డొనాల్డ్ ట్రంప్ దృష్టిలో పడినారు. వాటితో దుష్ఫలితాలు వచ్చినాక వెనక్కి తగ్గినారు.

13) మతం-ఆరాధనలు - పాఠశాలలు-చదువులు : కోవిద్-19 మహమ్మారి దెబ్బకు గుడులు, బడులకు తాళాలు పడ్డాయి. ఉత్సవాలు, ఊరేగింపులకు బ్రేకులు వేసారు. చర్చిలు, సినగాగ్‌లు, మాస్కులు, దేవాలయాలు దాదాపు నిర్మానుష్యమైనాయి.

ధార్మిక సంస్థలు కొన్నిచోట్ల ఉచిత కోవిద్-19 నిర్ధారణ పరీక్షలు చేసాయి. మత కూటమి స్థలాల్లో మాస్కులు, రెస్పిరేటర్లు, శానిటైజర్లు ఉంచడమే కాక అవసరమైన వారికి వెంటిలేటర్లు, ఇన్‌ఫ్యూజన్ పంపులు, మానిటర్లకు ఆర్థిక సహాయం అందచేసారు.

హజ్ యాత్ర కేవలం వెయ్యిమంది తీర్థ యాత్రికులు చేయగలిగినారు. (రెండున్నర మిలియన్లు హాజరైనారు క్రితం సంవత్సరం)

జెరూసలెంలో పశ్చిమ గోడవద్ద ప్రార్థనలు చేసే వారి సంఖ్య పలచబడింది.

భారతదేశంలో శ్రీరామనవమి, హోలీ, గణపతి ఉత్సవాలు నిరాడంబరంగా జరిగాయి. తిరుపతి లాంటి దేవాలయాలలో సందర్శకుల సంఖ్య గణనీయంగా తగ్గింది. జైనుల ఆలయాలు, సిక్కుల గురుద్వారాలలో కొన్ని సేవలను నిలిపివేసారు. నేపాల్, కొరియా, థాయ్‌లాండ్ లాంటి దేశాలలో బుద్ధ దేవాలయాలలో సందర్శకుల సంఖ్య తగ్గింది.

చైనాలో జనవరి, ఫిబ్రవరిలో జరిగే సాంప్రదాయ 'Spring Festival' వేడుకలను రద్దుచేసారు.

ఇలా చేసివుంటే బాగుండేదని మనం గతాన్ని గుర్తు చేసుకుంటాం. మన ముందు అనుభవం నేర్పిన కొన్ని మోడల్స్ ఉంటాయి. ఈ కోవిడ్-19 మహమ్మారిని ఇలా ఎదుర్కొని ఉంటే బాగుండేదని మనం అనుకుంటాం.

**1) ఉత్తర కొరియా మోడల్ :** ఇక్కడ State Atheism. కిమ్ జాంగ్-వన్ (Kim Jong-un) వంశపారంపర్య పాలన. నియంతలకే నియంత. అక్కడ కోవిడ్ వ్యాధిగ్రస్తులూ లేరు మరణాలూ లేవు. "వ్యాధిని వ్యాప్తి చేసే మొదటి కేసును నిర్మూలించి సరిహద్దుల్ని సీల్ చేసేస్తే వ్యాధి రాదు" అని కనిపిస్తే కాల్చేయమన్నాడు.

మహమ్మారిని పురిట్లోనే మట్టుపెట్టడం అన్నమాటే! వేలమందిని వ్యాధి చంపడం కన్నా వ్యాధిగ్రస్తుల్ని కొందరిని చంపినా తప్పులేదనే వాదం అది.

"నీ కారు అదుపు తప్పింది. ముందుకు పోతే ముప్ఫైమంది, వెనక్కి నడిపితే ఏడుగురు చస్తారు, ఎటుపోతావు నీవు?" - ఆ ఫిలాసఫీ.

**2) చైనా మోడల్ :** ఇక్కడా స్టేట్ ఎథియిజమ్ (State Atheism) అధికారిక మతం. ప్రభుత్వం అక్కడ యుయిఘర్ ముస్లిములను, ఫాలున్‌గాంగ్ అనుయాయులను వివక్షతతో చూస్తుందని, ఫాలున్‌గాంగ్ అనుయాయులను నిర్బంధించి అమానవీయమైన పద్ధతులలో వాళ్ల అవయవాలను ట్రాన్స్‌ప్లాంటేషన్ పరిశోధనలకు చికిత్సలకు వాడుతున్నారనేది... ఆరోపణ.

చైనాలోని వుహాన్‌లో మొదలైన కోవిడ్-19 వ్యాప్తిని అరికట్టడంలో చైనా విఫలం కావడం వలన మహమ్మారి విశ్వవ్యాప్తమయ్యిందా? లేక, ఈ వైరస్ Genetic Bio Engineering తో మార్పు చేయడం వలన చైనా ప్రజలకు తక్కువ నష్టం, చైనాతో పోటీపడ్తున్న అమెరికా, ఇండియా దేశాల్లో అనంత నష్టం కలిగిస్తున్నదా?

సెప్టెంబర్ 24, 2020 నాటికి

ప్రపంచంలో వ్యాధిగ్రస్తులు / మరణాలు– 3,20,83,944 / 9,81,255.

అమెరికాలో– 71,39,563 / 91,173

చైనాలో– 85,307 / 4,634

చైనా, కజకిస్తాన్, సింగపూర్, వెనెజులా, దక్షిణ కొరియా, సూడాన్, నార్వే, ఇంకా కొన్ని దేశాల్లో కొత్తగా మరణాలు లేవు. ఎందుకని?

బురిడాన్ గాడిదకు చానాళ్ల నుంచి సరైన తిండీ, నీరు దొరకక శుష్కించిపోయింది. గత రెండు రోజులుగా ఎండలు. ఒకపక్క ఆకలి, ఒకపక్క దాహం ముంచెత్తుకు వస్తుంటే దాదాపు శోషవచ్చినంత పనై కాళ్లీడ్చుకుంటూ వస్తుంటే దానికి సమానదూరంలో ఒకపక్క పచ్చగడ్డి మోపు, రెండోపక్క మంచినీళ్ల చెరువు కనబడ్డాయి. ఇప్పుడు గాడిద ఎటువేపు పోతుంది?

రెండూ కావాలంటే గాడిద ఏం చెయ్యాలి ముందు? ఆర్థిక పుష్టి, ప్రతిష్ఠ రెండూ కావాలి. ఆ వేపుగా ముందుకు అడుగులు వేస్తుంటే కరోనా వచ్చి రెంటినీ దెబ్బతీసింది. ముందు దేనిని కాపాడుకోవాలనేది అక్కడి ప్రధాన సమస్య.

న్యూ ఇయర్ వేడుకల కోసం తాత్సారం చేయకుండా ముందే లాక్‌డౌన్ ప్రకటించి ఉంటే కోవిడ్–19 వుహాన్‌లోనే ఆగిపోయేదా? పదిరోజుల్లోనే వేయి పడకల ఆస్పత్రి కట్టగలిగిన చైనా పదకొండు మిలియన్ల జనాభా గల వుహాన్‌లో జనవరి ఒకటినే లాక్‌డౌన్ ప్రకటించి ఉంటే ప్రపంచానికి ఇంత నష్టం జరిగేది కాదా?

ఒకవేళ మరో వైరస్ విజృంభిస్తే, లేక కరోనా వైరస్ మరల తిరగబెడ్తే ప్లాన్ A, B, C లున్నాయా? చైనా దగ్గర వైరస్‌కు ఇదివరకే వ్యాక్సీన్ ఉన్నదా? చైనా నాటువైద్యాలు, మూలికా వైద్యాలు వైరస్ వ్యాధిని, మరణాలను తగ్గించాయా?

**3) న్యూజిలాండ్, ఆస్ట్రేలియా మోడల్ :** చైనాకు న్యూజిలాండ్‌కు మధ్య దూరం 11,147 కిలోమీటర్లు. చైనాకు ఆస్ట్రేలియాకు మధ్య దూరం 9,011 కిలోమీటర్లు.

న్యూజిలాండ్ ఇప్పుడు కోవిడ్–19 లేని దేశం. (Covid Free Nation). వ్యాధిగ్రస్తులు 1824, మృతులు 25;

ఆస్ట్రేలియాలో 26,973 వ్యాధిగ్రస్తులు, మృతులు 859;

చైనా పక్కనే ఉన్న హాంగ్‌కాంగ్‌లో వ్యాధిగ్రస్తులు 5,050, మరణాల సంఖ్య 103;

వియత్నాం, మంగోలియాలో మరణాలు లేవు.

స్వయం ప్రతిపత్తి (Autonomy), స్వేచ్ఛగా ఎన్నుకోవడం (Freedom of Choice) సుఖవంతమైన జీవితాన్నిస్తాయి. కాని వాటిపై సరైన నియంత్రణ ఉన్నపుడు మాత్రమే అవి సత్ఫలితాలనిస్తాయి.

మూలవాసులపై ఈ వ్యాధి తక్కువ ప్రభావాన్ని చూపడం మనం గమనించవచ్చు.

**4) ఆఫ్రికా మోడల్ :** చైనా నుంచి కాక ఆఫ్రికా దేశాలకు ఈ కోవిడ్–19 వైరస్ అమెరికా, యూరప్ దేశాల్నుంచి వచ్చి చేరింది. అక్కడ 41 దేశాలకు 2000 మాత్రమే వెంటిలేటర్లున్నాయి. పది దేశాలలో వెంటిలేటర్లు లేవు. 1.3 బిలియన్ల జనాభాలో వ్యాధిగ్రస్తులు– 14,36,431, మరణాలు 34,587. మొదటి కేసు ఈజిప్టులో కనిపించింది. తరువాత నైజీరియాలో.... అక్కడ కోవిడ్–19 వ్యాధింకా వ్యాప్తి చెందుతున్న దశలోనే ఉన్నదని అభిప్రాయపడుతున్నారు. వైద్య సదుపాయాలు, ఆరోగ్యస్థితి అంతంత మాత్రంగానే ఉండే ప్రజల్లో, దారిద్ర్యం, అవినీతి ఎక్కువగా ఉన్న ఆ దేశాలలో కోవిడ్–19 ప్రభావం ఎలా ఉంటుంది అనేది ఇప్పటికీ ఊహాగానమే.

ఒక బాహ్యవలయ దారి (Outer Ring Road) కి అదనంగా కొత్త రోడ్డు వేసినపుడు డ్రైవర్లు కొత్త దారిలో ట్రాఫిక్ తక్కువ ఉంటుంది, తొందరగా పోవచ్చుననుకుని అందరూ అటే పోవడంతో కొత్త దారిలో ట్రాఫిక్ ఎక్కువై ప్రయాణ సమయం పెరుగుతుంది (Braess Paradox).

ఆఫ్రికా దేశాలలో వ్యాధి రద్దీ తగ్గించాలంటే ఏరకం కొత్త రోడ్డు వేయాలి? ఆ దారిలో ట్రాఫిక్ ఎక్కువైతే పరిస్థితి ఏమిటి? ఆఫ్రికా దారిని ఆఫ్రికాకు వదిలేయడం ఉత్తమమా?

**5) ఇండియా మోడల్ :** వైరుధ్యాలు, ప్రత్యేకతలు, ఉచ్ఛనీచ మానవ స్థితులు ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత ఎక్కువగా ఉన్న దేశం. అటు సమసమాజమూ, ఇటు నియంతృత్వమూ కాక మధ్య మార్గాన్నెన్నుకుని పాత కీర్తి కిరీటాన్ని తలకు తగిలించుకుని మూడడుగులు ముందుకు, మూడడుగులు వెనక్కి వేస్తున్న దేశం. ప్రజల మేలుకై తీసుకున్న కఠిన నిర్ణయాలన్నీ ఆచరణలో దెబ్బతినగా కోవిడ్–19 వ్యాధితో దేశం అతలాకుతలమై పోతున్నది. పదేళ్ల అభివృద్ధిని ఒక ఏడాది ప్రజల నిష్క్రియాపరత్వం నిండా ముంచేసింది.

అనేక భావనలు, అనేక వైరుధ్యాలు, ప్రయారిటీలలో తప్పులు ప్రతికూల పరిస్థితులను తెచ్చాయి. 138,32,18,332 జనాభా (138 కోట్లు). కోవిడ్ వ్యాధిగ్రస్తుల సంఖ్య

| | వ్యాధిగ్రస్తులు | కొత్త కేసులు | మరణాలు |
|---|---|---|---|
| ఇండియా | 57,30,184 | 89,683 | 91,173 |
| బంగ్లాదేశ్ | 3,53,844 | 1,666 | 5,044 |
| పాకిస్తాన్ | 3,07,418 | 532 | 6,432 |
| శ్రీలంక | 3,324 | 11 | 13 |
| నేపాల్ | 67,804 | 1,172 | 436 |
| భూటాన్ | 261 | – | – |

ఇండియాలో ఈ కరోనా వైరస్ – ఒకతల నరికేస్తే రెండు తలలు పుట్టే హైడ్రాలా (Hydra Paradox), చిందిన ప్రతి రక్తపు చుక్కకు పుట్టుకొచ్చే రక్తబీజుళ్లలా పెరుగుతూనే ఉన్నది. ప్రభుత్వం మాట వివిధ వర్గాల ప్రజలు వినరు. కొంప మునిగినాక గగ్గోలు పెడతారు. ప్రజల గోడు ప్రభుత్వానికి చేరేప్పటికి చీకటి చిక్కబడుతుంది. కరోనా వ్యాధి దుష్ఫలితాలతో భారతదేశపు ప్రసిద్ధ గాయకుడు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం 25 సెప్టెంబరు 2020 నాడు కన్నుమూసినాడు.

6) అమెరికా మోడల్ : అందరి చూపూ ఆ దేశం వేపే! ఎక్కడి వెళ్తావంటే అమెరికాకే అనేది ప్రపంచంలోని అభివృద్ధి చెందుతున్న దేశాల యువత మాట. స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ సాక్షిగా అక్కడ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం లభిస్తాయని నమ్మకం. Life, Liberty and the Pursuit of Happiness అక్కడ స్లోగన్లు.

ఆ అగ్రదేశానికి డొనాల్ట్ ట్రంప్ అధ్యక్షుడు. నవంబర్‌లో తిరిగి తనని ఎన్నుకుంటారని ఆశపడుతున్న సమయంలో కరోనా వచ్చింది. సరైన సమయంలో కఠిన నిర్ణయాలు తీసుకోకపోవడం వలన కరోనా అమెరికాలో కల్లోలానికి కారణ మయ్యిందనేది విమర్శకుల అభిప్రాయం.

అక్టోబరు 2, 2020 నాడు డొనాల్డ్ ట్రంప్, మెలానియా ట్రంప్‌లకు కోవిద్-19 పాజిటివ్ వచ్చింది.

ప్రతి ఉత్పాతంలోనూ కొన్ని పెద్ద తలకాయలు రాలిపోతాయి. కరోనానంతర కిరీటమెవరిదో కొద్దిరోజుల్లో తెలిసిపోతుంది.

The Paradox of Choice - Why more is less (Barry Schwartz) – కొనేవాడి ఛాయిస్‌లు తగ్గిస్తే అమ్మేవాడికి ఆందోళనలు తగ్గుతాయని ఓ సిద్ధాంతం; అమెరికాలో ఛాయిస్‌లు ఎక్కువ. ఎక్కువ స్వేచ్ఛ, ఎక్కువ అటానమి (Autonomy). దాని వలన పరిపాలనకు అడ్డంకులధికమనేది ఓ అభిప్రాయం.

ఏకపార్టీ వ్యవస్థ ఉన్న చైనాకు, రెండు పార్టీల పోటీ ఉన్న అమెరికాకు, బహుళ పార్టీలున్న ఇండియాకు, మత వ్యవస్థ రాజ్యాన్నేలే దేశ వ్యవస్థలకు కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి, పర్యవసానాలను ఎదుర్కోవడానికి మార్గాలు వేర్వేరుగా ఉంటాయి.

The Tyranny of Small Decisions (Alfred-E-Kahn) – సిద్ధాంతం ప్రకారం– విడివిడిగా తీసుకునే చిన్ని చిన్ని నిర్ణయాలు, అన్నీ కలిసినపుడు అవి వ్యవస్థనే దెబ్బతీయవచ్చును. కోవిద్-19 మహమ్మారి నెదుర్కోడానికి ఏ దేశానికా దేశం – 'ఎవరికి వారే' అన్నట్లు వ్యవహరించడం, తప్పు నీదే అని ఎదుటివారిపై వేలెత్తి చూపడంతో చివరకు వ్యాధి ప్రబలమై ప్రపంచం మొత్తాన్ని గజగజ లాడిస్తున్నది.

Tragedy of the Commons అనేది మరో ఆలోచన – ఓ గ్రామానికి అందరికీ చెందిన సమిష్టి బీడు మైదానం ఉన్నపుడు అక్కడ ఎవరి పశువులను వాళ్లు వాళ్ల ఇష్టాయిష్టాల ప్రకారం మేపుతారు. దానితో లాభం వ్యక్తిగతంగా, నష్టం ఉమ్మడిగా ఉంటుంది. సముద్రాలు, నదులు, ఎయిర్‌స్పేస్, వీటిపై తగాదాలు మనకు తెలిసినవే. ఈ గొడవలు కోవిద్-19లా ఒకచోట నుంచి మొదలై విశ్వవ్యాప్తం

చెంది ప్రపంచ సామాజిక ఆర్థిక వ్యవస్థలకే ముప్పుగా పరిణమిస్తాయి. ప్రకృతి సంపదలను అందరికీ చెందకుండా ఎవరి స్వార్థానికి వాళ్లు వినియోగించడం, విస్తరణ కాంక్షలు, ఈ అణు, రసాయన, జీవాయుధ సృష్టికి కారణాలని మనకు తెలుసు. కాని నిజం చెప్పరెవ్వరూ....

ఈ క్వారంటెయిన్, ఐసోలేషన్లతో మనం ఎవరింటిలో వాళ్లు బందీలై పోయాము. అధినేతలంతా నేరస్తుల గ్యాంగులా మారిపోయారు. ప్రజలూ తక్కువేం తినలేదు. మనందరికీ తెలుసు ఇప్పుడు ఆ అగ్రదేశాల మధ్య ఉన్న Cold War- శీతల యుద్ధం.

నేరస్థుల గ్యాంగులో ఇద్దరు దొరికారు. వాళ్లను న్యాయపీఠం ముందు నిలబెట్టారు. న్యాయాధిపతి కుర్చీ వెనుక గోడపై స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం – అని వ్రాయబడి ఉన్నది.

అంతకు ముందే వాళ్లిద్దరిని తూర్పు, పశ్చిమ గదుల్లో విడివిడిగా ఉంచి రహస్యంగా కొన్ని వెసులుబాట్లు, స్వేచ్ఛ ఇస్తామని చెప్పారు అధికారులు, వాళ్ల గ్యాంగు వివరాలు చెబితే! వాళ్లకు నాలుగు ఆప్షన్లు ఇచ్చారు.

– గ్యాంగు వివరాలు ఇద్దరూ చెబితే చెరొక రెండేళ్లు జైలు. ఇద్దరూ చెప్పకపోతే ఆరేళ్ల జైలు. ఒకడు చెబితే చెప్పినవాడికి స్వేచ్ఛ (అప్రూవర్‌గా మారినందుకు). చెప్పనివాడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష. ఇప్పుడు వాళ్లేం చేస్తారు! దీనిని Prisoner's Dilemma' అంటారు.

అందరూ నేరస్తులే అయితే ఆప్షన్లు మారతాయి. ఇప్పుడు ఈ కోవిడ్–19 మహమ్మారిని ఎదుర్కోవడంలో మనకున్న వ్యూహాలు–సమస్యలు.

1) జ్వరం, నలతగా ఉన్న వ్యక్తినే పరీక్ష చేయాలా లేక ప్రతి ఒక్కరినీ టెస్ట్ చేయాలా? ఏ లక్షణమూ కనిపించకుండా ఉన్న కొందరు, రేపు మరల Super Spreaders అవుతారు కదా. ఇప్పుడు నెగటివ్ వచ్చినవాళ్లు ఎప్పటికీ మరోసారి పాజిటివ్ కారని లేదు కదా!

2) ఒకవేళ వ్యాక్సీను వస్తే ఎవరికి ముందు ఇవ్వాలి? అందరికీ వ్యాక్సీను అవసరమా?

సరే మొత్తం 7.8 బిలియన్ల ప్రపంచ జనాభాకు పరీక్షలు చేయాలంటే ఖర్చు 7.8×2500 = ఇరవై ట్రిలియన్‌ల రూపాయలు. (ఇరవై లక్షల కోట్ల రూపాయలు) (సుమారుగా).

సరిగ్గా పనిచేస్తాయో లేదో తెలియని మాస్కులు, శానిటైజర్లు, సామాజిక దూరాలూ, మందులూ, ఐసోలేషన్లు జీవితాలలో అగ్నిని రగిల్చాయి. కొందరికి పేదరికాన్ని, చేదు అనుభవాలను, విషాదాన్ని మిగిల్చాయి.

ఖాళీగా ఉన్నాం కదా - అదుగో స్వప్నలోకం - విహరిద్దాం కాసేపు! ఈ కరోనా మహమ్మారి అంతమయ్యేవరకూ! కరోనా అంతమయ్యాక-

1) నేను నీతివంతుడిగా బతుకుతాను. అందరూ నాలానే ఉంటారు. మేం ఒకరినొకరు మోసం చేసుకోము.

2) నేను కులం, మతం, వర్గం, భాషా వగైరా భేదాల నుంచి బయటకు వస్తాను. నేను మానవుడిని అని సగర్వంగా చెప్పుకుంటాను.

3) నా సంపదలను ప్రపంచ సంపదలలో భాగం చేసి నా వాటాకెంత వస్తే అంతే తీసుకుంటాను.

4) నా యింట్లో రహస్యంగా మారణాయుధాలు తయారు చెయ్యను. దాచుకోను. ప్రస్తుతం నాకున్న ఇల్లు, సంపదలనన్నిటినీ ప్రపంచ ప్రభుత్వానికప్పగిస్తాను.

5) ప్రకృతి వనరులకెటువంటి హాని కలుగకుండా ప్రవర్తిస్తాను. పంచభూతాలకు నా వలన కాలుష్యం రాకుండా జాగ్రత్త పడతాను.

అతడన్నాడు- నీ గాలిబుడగకు ముల్లు గుచ్చుకున్నది. 'టప్'మని పేలిపోయిం దిప్పుడే. ఇదుగో వాస్తవాన్ని చూడు-

1) ఎవరూ నీతిగా ఉండరు. అందరు ఎవరికిష్టం వచ్చినట్లు వాళ్లు బతుకుతారు.

2) కుల, మత, వర్గ, భాషా, వర్ణ భేదాలేవీ మారవు. నేను ఫలానా కులం, మతం అనే ప్రతి ఒక్కరూ చెప్పుకుంటారు.

3) నా సంపదలను ఒక్క చిల్లిగవ్వా ఇతరులకివ్వను. నేను కష్టపడి సంపాదించింది, పనీపాటా లేనివాళ్లకివ్వడానికి నేనేమీ వెర్రి వెధవను కాను.

4) నన్ను నేను కాపాడుకోవడానికి చేతనైనన్ని అన్ని రకాల ఆయుధాలు తయారు చేస్తాను. దాచుకుంటాను. కాపలాగా కుక్కల్ని పెంచుతాను.

5) అందరితోపాటే నేను. కాలుష్యం ఎక్కువ కావడంలో నా పాత్ర స్వల్పం.

కాబట్టి, మనం ఏమీ మారమనేదే అర్థమవుతున్నది. మనలాంటివే మన ప్రభుత్వాలు. ఏవీ మారవు. తాత్కాలిక ప్రసూతి వైరాగ్యాల తరువాత కొత్త వ్యూహరచనలు ప్రారంభమవుతాయి.

శిఖరాగ్ర చర్చలు, కరచాలనాలు, మనోహరమైన చిరునవ్వులు కెమెరా నేత్రాల ముందు తళుక్కుమని మెరుస్తాయి. రహస్య ఎజెండాలు ఎవరి భూగర్భ మాళిగల్లో వాళ్లు చేస్తూనే ఉంటారు.

వీళ్లు మారరు అనేది సత్యం.

వీళ్లు మారతారు అనేది ఆశ.

లేఖలూ, వర్తమానాలూ, అలిఖిత సూచనలూ, ఉగ్గబెట్టుకున్న ఉద్వేగాలూ, తప్పనిసరై దాచుకున్న ఆవేశ ఆక్రోశాలూ బయటపడడానికి సమయం కోసం ఎదురు చూస్తుంటాయి.

అయినా మనుషులు మారరు. మారాలంటే ఇన్నాళ్లూ కూడబెట్టుకున్న సంపదలూ, భవనాలూ, కీర్తిప్రతిష్ఠలూ అన్నీ నేలమట్టమై పోతాయని భయం. పోడు చేసిన భూమిలా మంటలో కాలి నల్లబారితేనే కొత్త సమాజం మొలకెత్తుతుందా!

వైఫల్యాలూ, పాఠాలూ ఎన్నైనా రాయవచ్చు కలలు, వాస్తవాల గురించి యుగాల పాటు చర్చించవచ్చు. మార్చలేని సరిహద్దులున్నపుడు, సర్దుబాటు చేసుకోవాలి. ఎక్కడికక్కడ మానవత్వమే పరమావధిగా మానవుడు-కుటుంబం-సమాజం-దేశం-ప్రపంచం నియంత్రణ సంస్థల నేర్పరుచుకుని ప్రస్తుత అస్తవ్యస్త పరిస్థితులకు కారణమైన వ్యక్తిగత ఆస్థులు, కుల, మత, వర్గ, వర్ణ వ్యవస్థలలోని లోపాలను తొలగించే సామూహిక నిర్ణయాలు తీసుకోవాలి. సరిహద్దుల గొడవలను తక్షణం పరిష్కరించాలి.

ఓ రకంగా చూస్తే చైనాలోని State Atheism అమెరికన్ స్వేచ్ఛా కాపిటలిజం కన్నా ముందంజలో ఉన్నదనిపిస్తున్నది. మత ఛాందసులను కూడా నియంత్రించ గలిగితే మరికొన్నాళ్లపాటు ప్రశాంతత నెలకొంటుందేమో!

తరతరాలుగా వస్తున్న మత భావనలను ప్రార్థనా మందిరాలను కాదనడం అసాధ్యం కాబట్టి పరమత సహన గుణాన్ని పెంపొందింప చేయాలి. ఆధునిక విజ్ఞానం ఛాందసుల చేతుల్లోకి పోకుండా ఉంటే ప్రేమ, శాంతి ట్విన్ టవర్లు కూలిపోకుండా ఉంటాయి.

స్వస్థలాలకు వెళ్లిన వలస జనం మరల తిరుగు ప్రయాణాలు మొదలెట్టారు. మరణ భయం తగ్గినాక, జీవితంపై మమకారం పెరుగుతుంది. బస్సులూ, రైళ్లూ, విమానాలూ గాడిన పడ్డాక, స్తంభించిన జీవన చక్రం కాస్తంతైనా కదుల్తుంది ముందుకు.

మనుషుల్లో కొంతైనా మార్పు వస్తుందేమోనని చూస్తున్న వాళ్ల లెక్కలు తప్పుతాయి. జనజీవన స్రవంతి యధావిధిగా ముందుకు ప్రవహిస్తుంది. రకరకాల ప్రవచనాలు తెల్లవారేప్పటి చీకటి తెరలను చింపి వేస్తున్నపుడు మనం ఉలిక్కిపడి నిద్రలేస్తాం. ఆలోచించుకునే వ్యవధి ఇవ్వకుండా వర్తమానం నిన్ను జీవన రహదారిపై నడిపిస్తుంది. వర్తమానం (Present) అనేదే లేదని కొందరి అభిప్రాయం.

–"ఈ మహమ్మారి వలన మనకు తెలిసిందేమిటంటే మనుషుల్లో చెడుకన్నా మంచి ఎక్కువని. ఆపత్సమయంలో ఒకరికొకరు తోడు వస్తారని. ఈ కథ ముగింపు విజయాన్ని సూచించకపోయినా ఇది మన వైఫల్యాలను, నేర్చుకున్న పాఠాలను, మరల చేయకూడని తప్పిదాలను ఏకరువు పెడ్తుంది. భూత భవిష్యత్ కాలాల మధ్య ఉండీ లేనట్లుండే వారధి వర్తమానం.

**"But what does it mean the plague?**
**It is life, that's all" ఇది జీవితం! అంతే!"–**

– ఆల్బర్ట్ కామస్ (Albert Camus, The Plague)

నలుగురు అశ్వికులూ ఒకచోట కూర్చుని లాట్లు వేసుకుంటారు ఎవరెటు ఎప్పుడు వెళ్లాలా అని. రుగ్మత అనే తెల్లగుర్రం మీద మొదటి అశ్వికుడు కరోనా కిరీటం, విల్లు చేబూని బర్బరీకుడి బాణాలతో ప్రపంచమంతా ఆక్రమించాక, కాంక్ష అనే ఎర్రగుర్రంపై ఖడ్గమో, మిస్సైళ్లో చేతబూని యుద్ధమనే అశ్వికుడు ప్రపంచాన్ని రక్తసిక్తం చేస్తాడు. సరిహద్దుల వద్ద రాఫెల్ యుద్ధ విమానాలూ, సుఖోయి SU-30 లు గగనతలాన్ని, అమెరికా, చైనా యుద్ధనౌకలు దక్షిణ ఫసిఫిక్ సముద్రంలోనూ చక్కర్లు కొడుతుంటాయి.

ఆ తరువాత ఆఫ్రికా నుంచి బయల్దేరి ఆకలి అనే నల్లటి గుర్రం మీద కరువు కాటకాల అశ్వికుడు తనతో మిడతల దండు వెంటరాగా ప్రపంచాన్ని సంక్షుభితం కావిస్తాడు. నాలుగో అశ్వికుడు మృత్యువు వాళ్ల వెంటనే ఉండి పాపం అనే బూడిదరంగు గుర్రంపై స్వారీ చేస్తూ శీతల వాయువులు విసుర్తుండగా మృత్యు కరవాలంతో ఆయుర్దాయం తీరిన వారిని పంట కోసినట్లు కోసుకుంటూ పోతుంటే వీళ్లను తప్పించుకోడానికి భయమనే పసుపుపచ్చని అశ్వంపై పారిపోతుంటాడు మానవుడనే అయిదో అశ్వికుడు! The Fifth Horseman!

✧✧✧✧✧



# Notes (Wiki)

## Four Horsemen of the Apocalypse

The **Four Horsemen of the Apocalypse** (usually referred to as the **Four Horsemen**) are figures in Christian faith, appearing in the New Testament's final book, Revelation, an apocalypse written by John of Patmos, as well as in the Old Testament's prophetic Book of Zechariah, and in the Book of Ezekiel, where they are named as punishments from God.

Revelation 6 tells of a book/scroll in God's right hand that is sealed with seven seals. The Lamb of God/Lion of Judah opens the first four of the seven seals, which summons four beings that ride out on white, red, black, and pale horses. To Zechariah, they are described as "the ones whom the Lord has sent to patrol the earth" causing it to rest quietly. Ezekiel lists them as "sword, famine, wild beasts, and plague."

In John's revelation, the first horseman is on a white horse, carrying a bow, and given a crown, riding forward as a figure ofConquest, perhaps invoking Pestilence, Christ, or the Antichrist. The second carries a sword and rides a red horse and is the creator of War. The third is a food merchant riding upon a black horse, symbolizing Famine. The fourth and final horse is pale green, and upon it rides Death accompanied by Hades. "They were given authority over a quarter of the earth, to kill with sword, famine, and plague, and by means of the beasts of the earth."

The Christian apocalyptic vision is that the Four Horsemen are to set a divine end time upon the world as harbingers of the Last Judgment. That the number of horsemen is *four* is important: four is the number associated with creation (e.g., the four living creatures) or the earth (e.g., the four winds) in the Book of Revelation.



## Dr. LANKA SIVA RAMA PRASAD

M.B.B.S; M.S. GENERAL SURGERY
M.Ch. CARDIOTHORACIC SURGERY
Fellow in VASCULAR SURGERY
Post graduate Diplomate in Human Rights
Post graduate Diplomate in Television Production
Cell animation Specialist- Heart Animation Academy
Computer Animation Specialist- Pentafour- Chennai
Web Engineer and Web Designer- Web City- Hyderabad
Fellow of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

### I. Poetry (Telugu)

1. Alchemy
2. Vaana Mabbula Kanthi Khadgam
3. Tea Kappulo Toofan
4. Tangeti Junnu
5. Karakatakam (Cancer)
6. Oka Sarassu – Aneka Hamsalu (Psychiatry)
7. Marana Saasanam
8. Sri Lalitha Sahasranama Stotram
9. Kuyyo – Morro Satakam
10. Bhairava Satakam

### II. Poetry (English)

11. Shades
12. The Twilight Zone
13. My Poem is My Birth Certificate
14. The Pendulum Clock, The Gramophone,
    The Typewriter and The Pen
15. The Vigilance Whistle!
16. How to Cook a Delicious Poem
17. Windows and Apples
18. The Guerdon of Poesy
19. The Haste Land
20. Bees Need No Invitation When Flowers Bloom...
21. Poetravelogue
22. Supercalifragilisticexpialidocious
23. The Lost Songs of a Lone Traveler!

## III. Stories, Novels, Essays… (Telugu)

24. Katti Anchupai (Noir Stories)
25. Chupke – Chupke (Woman diseases)
26. Akshararchana
27. Deepa Nirvana Gandham (Death)
28. Swapna Sastram (Dreams-1)
29. Kalalu-Peeda Kalalu (Dreams-2)
30. Satyanveshanalo (Novel)
31. Sankya Sastram (Numerology)
32. Dr. Jayadev Cartoons (Cartoons)
33. Kathalu – kavitalu
34. Genome (Biotechnology Novel)

## IV Stories, Novels, Essays (English)

35. In Search of Truth (Novel)
36. How to be happy (Philosophy)
37. Bouquet of Telugu Songs and Poems

## V Translations (English to Telugu)

38. Iliad (Homer)
39. Odyssey (Homer)
40. Epic Cycle (Homer)
41. Three Greek Tragedies
42. The Poems of Sappho
43. Aeneid (Virgil)
44. Pilgrim's Progress (John Bunyan)
45. Paradise Lost (John Milton)
46. Paradise Regained (John Milton)
47. Divine Comedy (Dante)
48. Faust (Goethe)
49. World Famous Stories
50. Namdeo Dhasal Poetry
51. William Blake Poetry
52. Emily Dickinson Poetry – Part I
53. Emily Dickinson Poetry – Part II
54. Emily Dickinson Poetry – Part III
55. Emily Dickinson Poetry – Part IV
56. Emily Dickinson Poetry – Part V
57. Russian Poetry
58. Jalapatam (Eighteen English Poets)
59. Dabbu Manishi (Money Poetry)

60. Santi Yuddham (War-Peace)
61. Christu Adbhuta Geethalu
62. The Path of Christ
63. Silappadikaram
64. Manimekhala
65. Sangam Poetry
66. Conference of Birds (Attar)
67. Masnavi - Part 1
68. Masnavi - Part 2
69. Masnavi - Part 3
70. Masnavi - Part 4
71. Masnavi - Part 5
72. Masnavi - Part 6
73. Madhusala (Edward Fitzgerald)
74. Sougandhika (Master Poems in English-1)
75. Toorpu Padamara (Master Poems in English-2)
76. Prema Kurisina Velalo… (Master Poems in English-3)
77. Vallu Mugguru (Master Poems in English-4)
78. Alanati Kothagali (Master Poems in English-5)
79. Manchu Toofan (Master Poems in English-6)
80. Endaa – Vaana (Master Poems in English-7)
81. Pillanagrovi Pipupu (Master Poems in English-8)
82. Naalugu Dikkulu (Master Poems in English-9)
83. Allanta Doorana Aa Paata Vinavacche (Master Poems in English-10)
84. Divya Vastrala Kosam (Master Poems in English-11)
85. Oka Madhusala (Master Poems in English-12)
86. The Axion Esti (Odysseus Elytis)
87. Love & Death (Frederico Garcio Lorca)
88. Ten Thousand Lines (Edwin Cordevilla)
89. Century of Love (Roula Pollard)
90. Pablo Neruda Poetry
91. Mexican Poetry
92. Inanna (Queen of Heaven and Earth)
93. Sataroopa (A.K. Khanna)
94. Aamani (Master Poems in English-13)
95. Kotha Deepalu (Master Poems in English-14)

## VI Translations (From Telugu, Hindi to English)

96. Bhagavatam (Potana)
97. Soundarya Lahari (Sankaracharya)
98. Modern Bhagavadgita

99. Samparayam (Suprasanna)
100. The Tree of Fire (Anumandla Bhoomaiah)
101. The Poems of Kuppam (Seeta Ram)
102. We Need a Language (T.W. Sudhakar)
103. The Broken Grammer (T.W. Sudhakar)
104. The Voice of Telangana (Madiraju Ranga Rao)
105. Fire and Ice (Rama Chandramouli)
106. The Tears of Bliss
107. This is no Streaking (Stories – K.K. Menon)
108. The Pool of Blood (Novel – Ampasayya Naveen)
109. Madhusala (Harivamsa Roy Bacchan)
110. Journey to Manasa Sarovar (English poetry)
111. Smooth Hands- Sosonjan A. Khan- (Bilingual)
112. Dancing Winds- Maria Miraglia (Bilingual)
113. Moments- Alicja Kubreska (Bilingual)
114. Tayouan Pai Pai- Yaw-Chin Fang(Bilingual)
115. The World of Extinct Lamps- Izabela Zubko (Tri lingual)
116. Pearls of Wisdom- Pramila Khadun- (Bilingual)
117. The Wind my lover- Ade C. Manila-(Bilingual)
118. The Mystic Mariner- Madan Gandhi (Bilingual)
119. Ten Color Rainbow - The Poems from Poland (Bilingual)
120. The True Meaning of Life - Rashid Pelpuo
121. The Wind My Lover - Ade C. (Bilingual)
122. Jak Ziemia Po Pierwszym Deszezu - The Poems from Poland (Bilingual)
123. Prima Ballerina Roberta Di Laura
124. The Casket of Vermilion (English Poetry)
125. Barefoot to Arcadia - Aprilia Zank (Bilingual)
126. Lets be one in The One - George Onsy (Bilingual)
127. Riding the Tide - Ashok Bhargava (Bilingual)
128. The Collected poems of Dr. LSR Prasad
129. The Epic of Gilgamesh
130. Krzysztof Kokot - Around the Haiku
131. Renata Cygan - I am a troubadour
132. Sergio Camellini - The Planet of Pink Clouds
133. Kumkum Bharine
134. Oulaya Drissi El Bouzaidi - A Long-winged Breath
135. Agnieszka Jarzebowska - The Fifth Season
136. The Making of Mahatma
137. Juliusz Erazm Bolek - The Secrets of life - A Calendar in verse
138. The Songs of Annamayya
139. Basudeb Chakraborti Poetry

140. Poland Poetry - As Clear as the Sun
141. Bozena Helena Mazur-Nowak's - Blue Longing
142. Izabela Zubko - The Holy Trinity
143. Deepa Chandran Ram - The Inner Quiet
144. Nazi Naaman Poetry
145. Lal Ded 'Vakhs'
146. Eden S. Trinidad - Eden Blooms
147. Dr. Jernail S. Anand - Fighting the Flames
148. Hell Rise in Paradise
149. Three Color Brush (China Poetry)
150. The Making of Mahatma - Poetry (Collector's Edition)
151. An Epic of Kashmir (Poetry)
152. The Legend of Lady Yang Guifei
153. Tjukurpa - Time Continuum (Dream Time - Every When)
154. Trident (Love, War and Peace) Poetry
155. Yuddhopanishad (The Upanishad of War)
156. COVID-19 - Biotechnology Novel
157. Krishna Prasai's Sun-Shower (A collection of 108 Zen Poems)
158. Covid-19 Parodies
159. VIRUSES - VACCINES
160. THE EDDAS




Dr. Lanka Siva Rama Prasad

డా॥ లంకా శివరామప్రసాద్


# అయిదో అశ్వికుడు

(THE FIFTH HORSEMAN)



జనవరి నుంచి కరోనా శీతల విషవాయువుల మధ్య
అతడి నడకను గమనిస్తూనే ఉన్నాను.
అతడి వెనుక ఎందరివో కలల రహదారులు, వంతెనలూ
కూలిపోతున్నా అతడలా వస్తూ పోతూనే ఉన్నాడు.
మహమ్మారి, యుద్ధం, కరువు, మృత్యువు
అనే నలుగురు అశ్వికులను చూసాను నేను.
ఈ నాలుగో అశ్వికుడు నాకు పరిచితమైనవాడే!
అతడిని తప్పించుకుని పోవాలని
భయమనే గుర్రంపై స్వారీ చేస్తూ వేగంగా వెళ్లిపోతున్నాను,
అయిదవ అశ్వికుడిగా కలల రహదారిపై!
ఆ Fifth Horseman నేనే!

